సెప్టెంబర్
2017

137

సంపుటి : 12 సంచిక : 5

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

భారత దేశంలో మీడియా పరిస్థితి : ప్రత్యామ్నాయం ఆవశ్యకత

కార్పొరేట్ల ప్రయోజనాలకే జిఎస్టీ

అక్టోబర్ విప్లవానికి మార్గం వేసిన ఫిబ్రవరి విప్లవ విజయం

ఇంటా బయట ట్రంప్ ప్రమాదకర పోకడలు

సంక్షోభ భయంలో ఐటీ

ప్రమాదంలో మన ప్రజాస్వామ్యం

7 దశాబ్దాల స్వాతంత్ర్య భారతం


భూ సమస్యను ముందుకు తెచ్చిన తెలంగాణా సాయుధ పోరాటం

# భూ సమస్యను ముందుకు తెచ్చిన తెలంగాణా సాయుధ పోరాటం

**పుచ్చలపల్లి సుందరయ్య**

**త**మ దుర్భర జీవితంలో కొన్ని ప్రాథమికమైన వెసులుబాట్ల కోసం, వెట్టిచారికి వద్దు, అక్రమ నిర్బంధ వసూళ్ళ వద్దు, భూముల నుండి బేదఖళ్ళువద్దు, చిత్రహింసలు అవమానాలు వద్దు అనే నినాదంతో ప్రాథమిక హక్కుల కోసం; విద్యా, సంస్కృతుల కోసం, బాధ్యతాయుత స్వయం పరిపాలన కోసం ఉద్యమం ప్రారంభమైంది. అదే కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభల నాయకత్వాన, ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా, నైజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా, భూమికోసం, విమోచన కోసం, శక్తివంతమైన సాయుధ ప్రజా పోరాటంగా రూపొందింది. తెలంగాణా ప్రాంతంలోని దాదాపు మూడోవంతు ప్రాంతానికి, మూడు వేల గ్రామాలకు అది విస్తరించింది. ఆ గ్రామాలలో గ్రామ రాజ్యపోరాట కమిటీలు స్థాపించబడినాయి. నైజాం ప్రభుత్వ అధి కారులు, భూస్వాములు– పరిపాలనా నిర్వహణను ప్రజలు, పంచాయతీ కమిటీలకే వదిలేసి గ్రామాలు వదిలివెళ్ళవలసి వచ్చింది. వెట్టి చారికి, అక్రమ నిర్బంధ వసూళ్ళు, భూము ల నుండి బేదఖళ్ళు, అధిక వడ్డీలు గుంజే అప్పులు, లంచగొండి అధికారులచేత, గ్రామాల లోని దోపిడీదార్ల చేత చిత్రహింసలు పాలు గావడం, అవమానాలకు గురికావడం, అంత మొందించబడినాయి. అంతేకాదు బంజరు భూములకు, భూస్వాముల మిగులు భూములను పది లక్షల ఎకరాల మేరకు పంపిణీ చేయడం జరిగింది. దానితోపాటే వ్యవసాయానికవసరమైన పశువులను, వ్యవసాయ పరికరాలను కూడా పల్లెటూళ్ళ పేద ప్రజలకు పంచిపెట్టడం జరిగింది. వ్యవసాయ కార్మికులకు న్యాయమైన వేతనాలు అమలు జరపబడ్డాయి. ధాన్యం పంపిణీ చేయబడింది. తమ జీవితాలలో మొట్టమొదటిసారిగా రెండుపూటలా కడుపునిండా తిండి తినగలిగామని ప్రజలు చెప్పుకొన్నారు. గెరిల్లా దళాలు, గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేయబడ్డాయి. నైజాం పోలీసు, సైన్యమూ, గ్రామాలలోని దోపిడీదార్లు, పెద్ద క్యాంపులకే పరిమిత మైపోయారు. అక్కడినుండే పగలు నిర్ణీత సమయాలలో తమ దాడులను సాగించుతుండే వాళ్ళు. కమ్యూనిస్టులు – చీకటిదొరలు అని పేర్కొంటూ, చీకటిపడిన తర్వాత కమ్యూనిస్టుల అజమాయిషీయే సాగుతోందని భూస్వాములు, పోలీసులు పగటివేళ మాత్రమే పాలించగలుగుతున్నారని శతృపత్రికలు సైతం అంగీకరించవలసి వచ్చింది.

మొత్తం నైజాం సంస్థానమూ, ఆకలి సమాజమూ మొదలంటా కదిలిపోయాయి. ఉద్యమం ఇంకా ఎక్కువ ప్రాంతాలకు విస్త



**తెలంగాణా సాయుధ పోరాటంలో మహిళలు కూడా బందూకులు పట్టారు**

రించింది. మొత్తం తెలంగాణా అంతటికీ వ్యాపిగాంచింది. తెలంగాణా అబలలకు కూడా ప్రాకింది. సరిగ్గా ఆ సమయంలోనే, భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రజలపై రజాకార్ దౌర్జన్యాన్ని అరికట్టడం అనే సాకుతోనూ, 'కమ్యూనిస్టు దౌర్జన్యాన్ని' అణచివేయటమనే ప్రకటిత ప్రధాన లక్ష్యంతోనూ తన సైన్యాలను పంపాలని నిర్ణయించుకుంది.

భారత ప్రభుత్వపు 'పోలీస్ చర్యను', తెలంగాణా సాయుధ పోరాటాన్ని పునః సంహరించేంత వరకు సాగిన పరిణామాన్ని, దాని పర్యవసానాన్నీ సమీక్షించబోయే ముందు, తెలంగాణా ప్రజల ఈ మహోన్నత వెల్లువ విజయం పొందటానికి కారణభూతమైన పరిస్థితిని పరిశీలిద్దాం. తెలంగాణా పాత్రికేయ పితామహుడు హైదరాబాద్ సంస్థానంలో తెలుగు పునరుజ్జీవనోద్యమ నాయకులలో నొకరగు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, పెద్ద భూస్వామ్య కుటుంబానికి చెందినవాడే అయినా, ప్రశంసాపూర్వకంగా దిగువ విధంగా తన ఆశ్చర్యం ప్రకటించాడు;

"ఈ కమ్యూనిస్టుల వద్ద ఏ ఇంద్రజాలమున్నదో, ఏ మహామంత్రమున్నదోగాని, నీ బానిసోడ్నిదొరా, నీ ముందు సాష్టాంగపడతా, నీ పాదాలకు మొక్కుతా" అంటుండేవాళ్ళను వీరులుగా మలిచారు. మట్టిలో నుండి మహా వీరులను సృష్టించారు"

"దున్నేవానికే భూమి" అనే నినాదమే ఆ శక్తి, కమ్యూనిస్టుల రహస్యమైతే, కలచివేస్తున్న ఆ సమస్యను కమ్యూనిస్టులు నిగర్వంగా చేపట్టారు. భూమికోసం అర్రులు చాస్తూ, పోరాడుతున్న రైతాంగ జనసామాన్యానికి నాయకత్వం వహించారు. ఆచరణలో దాన్ని సాధించుకునేందుకు నడిచారు. ఈ సామాన్య రైతాంగంతోపాటు వారూ పోరాడి, తమ ప్రాణాలర్పించారు.

**'దున్నేవానికే భూమి'**

పెంపొందుతున్న ఉద్యమం తాకిడవల్లనే, ఈ నినాదం తక్షణమే అమలుజరపవలసిన ఆవశ్యకతగా రూపొందింది.

తాము సాగుచేసుకుంటున్న భూముల నుండి ఏ రైతునూ బేదఖల్ చేయరాదంటూ, ఆ హక్కును నిలబెట్టుకొంటూ ఉద్యమం ప్రారంభమైంది. విసునూరు దేశముఖ్ బారి నుండి అయిలమ్మ పొలంలోని పంటను జయప్రదంగా కాపాడటం మొదలుగా గల గణనీయమైన విజయాలు సాధించబడినాయి. తర్వాత "బేదఖళ్ళన్నీ నిలుపు చేయాలి. భూస్వాములు హస్తగతం చేసుకున్న భూమిని తిరిగి సంపాదించాలి" అనేది సంస్థానమంతటా ఆచరణ నినాదంగా రూపొందింది.

అధిక వడ్డీరేట్లతో రోజు రోజుకూ తడిసి మోపెడవుతూ పేరుకుపోతున్న, అప్పులను తీర్చలేదనో, కౌలు చెల్లించలేదనో, మరేదో విధమైన సాకుతోనో దేశముఖ్‌ల చేత అంతకు ముందు తమ భూములు స్వాహా చేయబడిన రైతులున్నారు. భూములను కబళించి, తమ స్వంతం చేసుకోవాలని భూస్వాములకు బుద్ధిపట్టి నిరంకుశంగా బేదఖల్ చేయబడిన రైతులున్నారు. వారంతా ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే సమస్యను లేవనెత్తారు. 'బేదఖళ్ళన్నిటినీ నిలుపుచేయాలి' అనే నినాదం నుండి 'అక్రమ బేదఖళ్ళను, ఆక్రమణలనూ రద్దుచేయాలి' అనే నిర్ణయానికి రావటానికి ఎంతోకాలం పట్టలేదు. గతంలో భూస్వా

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


**1.భూ సమస్యను ముందుకు తెచ్చిన తెలంగాణా సాయుధ పోరాటం**
పుచ్చలపల్లి సుందరయ్య .......... 2

**2. భారత దేశంలో మీడియా పరిస్థితి: ప్రత్యామ్నాయం ఆవశ్యకత**
పాలగుమ్మి సాయినాథ్ ......... 4

**3. కార్పొరేట్ల ప్రయోజనాలకే జిఎస్టీ**
సురజిత్ మజుందార్ ............ 11

**4. అక్టోబర్ విప్లవానికి మార్గం వేసిన ఫిబ్రవరి విప్లవ విజయం**
ఆర్. అరుణ్ కుమార్ ........... 13

**5. ఇంటా బయట ట్రంప్ ప్రమాదకర పోకడలు**
ఎస్. వెంకట్రావు.................. 15

**6. సంక్షోభ భయంలో ఐటీ**
వి.శ్రీధర్.......................... 20

**7. ప్రమాదంలో మన ప్రజాస్వామ్యం**
హమీద్ అన్సారి ................ 25

**8. 7 దశాబ్దాల స్వాతంత్ర్య భారతం**
డా॥ హేమలత.................. 30



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పర్యావరణ పరిరక్షణ

ప్రపంచ వ్యాపితంగా మానవుని కార్యకలాపాల వల్ల వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రమాదకర పరిస్థితులు సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్న మాటలు గతంలో వినకపోయినా ఇప్పుడు అందరూ వినక తప్పని పరిస్థితి వచ్చేసింది. బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వినియోగం వల్ల విడుదలవుతున్న ఉద్గారాలు భూమి చుట్టూ ఉన్న సున్నితమైన వాతావరణ పొరలో పెద్ద మార్పులు తెస్తున్నాయి. వర్షాలకూ – దుర్భిక్షానికీ మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయి. అంటే వాతావరణంలో చేరిన నీరంతా కొన్ని చోట్ల కుమ్మరించబడి తీవ్ర తుపానులు, అధిక వర్షాలు, వరదలకు కారణమవుతుంటే, కొన్ని చోట్ల వర్షాలే లేక దీర్ఘకాల దుర్భిక్ష పరిస్థితులేర్పడుతున్నాయి. రుతుపవనాల మీద ఆధారపడ్డ మన దేశంలో ఈ పరిస్థితి మరింత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల ధృవాల్లో, పర్వతాలమీద మంచుకరిగి, సముద్రాల నీటి మట్టాలు పెరుగుతున్నాయి. వేలు, లక్షల ఎకరాల తీర ప్రాంతం కోసుకుపోయి తీరంలో నివసించే పేద ప్రజలు జీవనాధారం కోల్పోతున్నారు.

ప్రపంచీకరణ తెచ్చిన వినిమయదారీ జీవన విధానం వల్ల అనవసర వనరుల వాడకం బాగా పెరిగిపోయింది. ప్రజల వినిమయం మీదే దేశాల అభివృద్ధి ఆధారపడి ఉంది కాబట్టి ప్రభుత్వాలు దీన్ని ప్రోత్సహిస్తున్నాయి. రోడ్లను ఎంత విశాలం చేస్తున్నా పట్టనంతగా మోటారు వాహనాల వాడకం పెరిగింది. దాని వల్ల మనుషులకు ప్రాణవాయువు అందనంతగా వాయుకాలుష్యం పెరిగిపోయింది. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగుళూర్ వంటి పెద్ద నగరాల్లోనే కాదు, చిన్న నగరాల్లో కూడా ప్రజలు ఈ బాధ నిత్యం అనుభవిస్తున్నారు. యూజ్ అండ్ త్రో వాడకం మన పట్టణాలు, గ్రామాలను కాలుష్య కాసారాలుగా మార్చేస్తున్నాయి. కాలుష్య కారక పరిశ్రమలు తమ బ్రతుకులు ఛిద్రం చేస్తున్నాయని నేడు అనేక ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటున్నారు.

ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు కాలుష్యం బాధ్యత తీసుకోవడం లేదు. వాతావరణ కాలుష్యాన్ని నివారించే పారిస్ ఒప్పందం నుండి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా వైదొలిగాడు. ప్రపంచ జనాభాలో 4 శాతం జనాభా ఉన్న అమెరికా మొత్తం వనరుల్లో 25 శాతం వినయోగిస్తోంది. ప్రపంచ జనాభాలో 40 శాతం వరకు ఉండి కేవలం 5 శాతం వనరులు మాత్రమే వినియోగిస్తున్న చైనా, భారత్‌లదే బాధ్యత అని అమెరికా తప్పుకుంటోంది. వనరుల వినియోగంలో, వ్యర్థం చేయడంలో ధనికులదే పెద్ద చేయి. అయినా వారి బాధ్యత లేదని ప్రభుత్వాలు చేతులెత్తేస్తున్నాయి. ఆర్థిక అంతరాలు పెరుగుతున్న కొద్దీ వనరుల దుర్వినియోగం పెరిగిపోతోంది.


పర్యావరణ సమస్యలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు బాధ్యత వహించడం లేదు. ఎందుకని? ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థే పర్యావరణ విధ్వంసంపై ఆధారపడి నడుస్తోంది. పర్యావరణ విధ్వంసం ఆగిపోతే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆక్సిజన్ ఆగిపోతుంది. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగినంత కాలం పర్యావరణ విధ్వంసం కొనసాగుతుంది, ఇంకా పెరుగుతుంది. నేటి ప్రపంచంలో ఇది ఒక కొత్త వైరుధ్యాన్ని కూడా సృష్టిస్తోంది. ఈ వైరుధ్యాన్ని సరైన రీతిలో పరిష్కరించకపోతే మానవ జాతే నాశనమయ్యే ప్రమాదం ఉంది. పర్యావరణ విధ్వంసం పరిసమాప్తమయ్యి, మానవాళి మనుగడ సజావుగా సాగాలంటే బొలీవియా అధ్యక్షుడు ఇవో మొరెల్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేయడం మినహా మరో మార్గం లేదు. అందువల్ల ఈ రోజు నిజమైన పర్యావరణ పరిరక్షణ కోరుకునే వారు పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో పాల్గొనాలి. ఇంకో మాటలో చెప్పాలంటే పర్యావరణ వ్యతిరేక పోరాటాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడాలి.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# భారత దేశంలో మీడియా పరిస్థితి ప్రత్యామ్నాయం ఆవశ్యకత



రచయిత ప్రముఖ జర్నలిస్టు, మీడియా విశ్లేషకులు.

**పాలగుమ్మి సాయినాథ్**

**(భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయ్యేళ్లు పూర్తయిన నేపథ్యంలో 'దేశంలో మీడియా అసలు స్వరూపం... కొనసాగుతున్న సంక్షోభం... ప్రత్యామ్నాయం ఆవశ్యకత' గురించి ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ 'న్యూస్ క్లిక్' ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ప్రముఖ పాత్రికేయులు, మేగసేసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.....ఎడిటర్)**

'నాడు మీడియా చిన్నదే అయినా పెద్ద సామాజిక బాధ్యతను నిర్వర్తించింది, నేడు మీడియా చాలా పెద్దగా ఉన్నా సామాజికంగా అది చాలా చిన్న పాత్ర పోషిస్తున్నది. ఇది భారతీయ మీడియాలో కొట్టొచ్చినట్లు కనిపించే ఒక ముఖ్యమైన వైరుధ్యం. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, 1893లో అప్పటి బ్రిటిష్ మేజెస్టిస్ ప్రభుత్వం చేసిన ప్రత్యేక అభ్యర్థన మేరకు రాయిటర్స్ వార్తాసంస్థ తన ప్రత్యేక కరస్పాండెంట్‌ను భారత్‌కు పంపింది. దేశంలోని క్షామ పీడిత జిల్లాలను పర్యటించిన రాయిటర్స్ ప్రతినిధి కరువు పరిస్థితిపై నివేదిక ఇచ్చారు. ఆ నివేదికకు రాసిన ముందు మాటలో "భారత్‌లో క్షామంపై జాతీయ పత్రికలు పెద్దయెత్తున ఘోషిస్తున్నాయి" అని పేర్కొన్నాడు. అప్పటికి భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించి ఎనిమిదేళ్లే, కాంగ్రెస్ కన్నా జాతీయ పత్రికల విమర్శకే బ్రిటిష్ ప్రభుత్వం ఆనాడు ఎక్కువ భయపడేది. నాడు పత్రికలు చిన్నవే అయినా ప్రపంచంలోనే అతి శక్తివంతమైన సామ్రాజ్యానికి అధిపతులైన తెల్లదొరలను ఆత్మరక్షణలోకి నెట్టాయి. ప్రప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా పిలువబడే 1857 సిపాయిల తిరుగుబాటు తరువాత వేలాది కరపత్రాలు, న్యూస్ లెటర్స్ రూపంలో మీడియా ప్రజల్లోకి వెళ్లింది. పత్రికల గొంతు నొక్కేందుకు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వర్నాక్యులర్ ప్రెస్ యాక్టు తీసుకొచ్చింది. వర్నాక్యులర్ అన్న పదాన్ని లార్డ్ మెకాలే ఉద్దేశపూర్వకంగానే వాడాడు. లాటిన్ భాషలో ఆయన దిట్ట. 'వర్నాక్యులర్' అనే పదం వర్నాక్యులస్ అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. ప్రాచీన నిఘంటువు ప్రకారం 'వర్నాక్యులస్' అంటే బానిసలు మాట్లాడుకునే భాష అని అర్థం. జాతి దుర్హంకారంతోనే మెకాలే ఈ పదాన్ని వాడాడనేది నిర్వివాదాంశం. అందుకే ఈ పదాన్ని మనం నిషేధించాలి. రాయిటర్స్ వార్తా సంస్థ 'స్వతంత్రతకు, వాస్తవికతకు ప్రతీక' అని ఎస్‌హెచ్‌ఎం మెనివలన్ అంటాడు. బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రత్యేక అభ్యర్థనకు రాయిటర్స్ వెంటనే స్పందించడం, తన కరస్పాండెంట్‌ను భారత్‌కు పంపి నివేదిక తెప్పించి ఇవ్వడం, దానిపై మేజెస్టిస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగింది. ఆకలి, దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవడంలో బాలగంగాధర్ తిలక్ లాంటి వారు బ్రిటిష్ ప్రభుత్వానికి చేయూతనిచ్చారు. ఈ విషయంలో మీడియా అమోఘమైన పాత్ర నిర్వహించింది. ఆనాటి పత్రికల సర్కులేషన్ వందలు, వేలల్లో మాత్రమే వుండేది. నేడు లక్షల్లో వుంది. గాంధీజీ నడిపిన పత్రిక సర్కులేషన్ సైతం 5వేలలోపే వుండేది. కానీ, అది చాలా పెద్ద ప్రభావాన్ని చూపింది. ఆ పత్రికలో గాంధీ రాసిన వ్యాసాలు చాలా పత్రికలు పునర్ముద్రించడమో, ఉటంకించడమో చేసేవి. విచిత్రమైన విషయమేమిటంటే భారతదేశ డెబ్బయ్యో స్వాతంత్ర్య వార్షికోత్సవం జరుపుకుంటున్న ఈ సమయంలో ఆనాటి జాతీయోద్యమంతో ఏమాత్రం సంబంధం లేనివారు కేంద్రంలో తిష్టవేసుక్కూర్చోవడం. వీరిలో ఒక్కరికంటే ఒక్కరికీ జాతీయోద్యమంతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సంబంధం లేదు. మీడియా విషయానికొస్తే ఇదివరకెన్నడూ లేనంతగా నేడు అది వ్యాపార మయమైంది. కొద్ది మంది వ్యక్తులు మీడియాపై గుత్తాధిపత్యం చలాయిస్తున్నారు. పందొమ్మిది భాషల్లో ప్రసారాలు నిర్వహిస్తున్న ఈటీవీ చానెళ్లు ఇప్పుడు ఎంత మాత్రమూ రామోజీ రావువి కావు. వీటిలో తెలుగు చానెళ్లు మినహా మిగతావన్నీ అంబానీ చేతిలోకి వెళ్లిపోయాయి. రిలయెన్స్ చేతిలో ఎన్ని పత్రికలు, టీవీ చానెళ్లు వున్నాయో లెక్కలేదు. గుత్తాధిపత్యం అంతగా పెరిగిపోయింది. ముప్పయ్యేళ్ల క్రితం మీడియా పరిస్థితి చూస్తే రామ్‌నాథ్ గోయెంకా దేశంలో కొన్ని ప్రాంతాలపై గుత్తాధిప్యం చలాయిస్తే, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ముంబయి, మహారాష్ట్రల్లోను, 'ది హిందూ' దక్షిణాదిలోను గుత్తాధిపత్యం వహించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నిన్నటి వరకు మీడియా సంస్థలే కార్పొరేట్లుగా వుండేవి. నేడు కార్పొరేట్ల విస్తారమైన సామ్రాజ్యంలో మీడియా ఒక చిన్న విభాగంగా వుంది. ముఖేష్ అంబానీ కి చెందిన నెట్‌వర్క్-18 ను విడిగా చూస్తే ఆస్తులు, హంగులు, ప్రభావ పరంగా చూస్తే పెద్దదే. కానీ రిలయన్స్ గ్రూపు సంస్థల్లో ప్రధానంగా వున్న ఫ్యాబ్రిక్స్, పెట్రోలియం కంపెనీలతో పోల్చితే అది చాలా చిన్నది. భారత్‌లో నేడు కనిపిస్తున్న ఈ ధోరణి అమెరికా, ఆస్ట్రేలియాల్లో చాలా కాలం క్రితమే మొదలైంది. అమెరికా ఎలక్ట్రానిక్ మీడియాపై సిఎన్ఎన్, ఎన్‌బిసి, సిబిఎస్, ఎబిసి వంటి సంస్థలు గుత్తాధిపత్యం వహిస్తున్నాయి. ఈ గుత్తాధిపత్యం స్వభావంలోను మార్పు వచ్చింది. ఎన్‌బిసి మీడియా సంస్థను తీసుకుంటే దీని యజమాని రేడియో కార్పొరేషన్ ఆఫ్ అమెరికా (ఆర్‌సిఏ). ఇది పెంటగాన్‌కు చెందిన ఏడవ అతిపెద్ద మిలిటరీ కాంట్రాక్టు సంస్థ. నాటో ఉపయోగించే ప్రతి కంప్యూటర్ గైడెడ్ మిసిలీ వార్‌హెడ్‌ను ఈ సంస్థే అందిస్తుంది. ఎన్‌బిసికి ఆర్‌సిఏ యజమాని అయితే, ఆర్‌సిఏకు యజమాని జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ. ఇది

ప్రపంచం లో రెండవ అతిపెద్ద కాంట్రాక్టు సంస్థ. వీటి అధీనంలోని మీడియా ప్రచ్ఛన్న యుద్ధం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల్లో యుద్ధ వార్తలను కవర్ చేసేటప్పుడు ఎవరికి కొమ్ముకాస్తాయో ప్రత్యేకించి వివరించనక్కర్లేదు. 1980లో బడా మిలిటరీ కాంట్రాక్టర్ జనరల్ డైనమిక్స్ ఉపాధ్యక్షుడికి, మీడియా ప్రతినిధులకు మధ్య జరిగిన ఇష్టాగోష్టిలో ఓ ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. అమెరికా- రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ప్రపంచ శాంతికి విఘాతం కలిగించదా? అని ఓ జర్నలిస్టు ప్రశ్నించాడు. దానికి ఆ జనరల్ డైనమిక్స్ యజమాని బదులిస్తూ,"దీర్ఘకాలిక ముప్పును ఎదుర్కోవడంపై మనం విశ్వాసం వుంచాలి" అని వ్యాఖ్యానించాడు.

మీడియా, బ్యాంకింగ్, ఆయుధవ్యాపార సంస్థల మధ్య మిలాఖత్ చాలా బలీయంగా వుంటుంది. దీని విశ్వరూపం గురించి 'ది లాస్ట్ క్వార్టర్ ఆఫ్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పుస్తకంలో బెన్ బెక్డియాన్ చక్కగా విశ్లేషించాడు. మీడియా కంపెనీ డైరక్టర్లు ఆయుధ కంపెనీ డైరక్టర్ల బోర్డు సమావేశానికి హాజరవుతారు. ఆయుధ కంపెనీ డైరెక్టర్లు మీడియా డైరెక్టర్ల బోర్డులో వచ్చి కూర్చుంటారు. బ్యాంకింగ్ కంపెనీ డైరక్టర్లు అయితే అన్ని బోర్డుల్లోను కూర్చుంటారు. కార్పొరేట్ సంస్థలు తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఒక దానిపై ఒకటి ఎలా ఒత్తిడి తెస్తాయో బెక్డియాన్ పుస్తకం వివరిస్తుంది. కార్పొరేట్ కంపెనీలు ఒకరి ప్రయోజనాలను మరొకరు నెరవేర్చుకునే ఈ పద్ధతి భారత్‌లో ఇటీవలి కాలంలో శరవేగంగా విస్తరిస్తోంది. షిప్పింగ్ పరిశ్రమాధిపతికి, మీడియా యజమానికి, ప్రభుత్వాధినేతకు మధ్య బీరకాయ పీచులాంటి ఓ విడదీయరాని బంధం ఏర్పడింది. వీటి ప్రయోజనాల కనుగుణంగానే మీడియాలో కథనాలు వస్తుంటాయి. గత వారం టైమ్స్ ఆఫ్ ఇండియా, డిఎన్ఎ పత్రికలు ఏమాత్రం బెరుకు లేకుండా 'ప్రత్యేక'వార్తా కథనాలంటూ రెండు వార్తలను ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో పెట్టాయి. అవి గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీ చేసిన బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి సంబంధించినవి. అమిత్ షా గత అయిదేళ్లలో తన ఆస్తి 300 శాతం పెరిగినట్లు చూపారని, ఇందుకు జీతభత్యాలు తప్ప ఇంకే ఇతర ఆదాయ మార్గాలు లేవనేది మొదటి వార్తా కథనం సారాంశం. రెండవ వార్తా కథనం ఇరానీ విద్యార్హతలకు సంబంధించిన మూడవ వర్షన్‌ను ముందుకు తెచ్చింది. ఎన్నికల సంఘం

> **"1980-90లలో టైమ్స్ గ్రూపు యాజమాని బెనెత్ కోల్‌మన్ అండ్ కో లిమిటెడ్ మీడియాను అడ్డం పెట్టుకుని షిప్పింగ్, సిమెంట్, జ్యూట్, ఉక్కు వ్యాపారాల్లో తన ప్రయోజ నాలను నెరవేర్చుకునేది. ఇటువంటి కార్పొరేట్ మీడియాను మెయిన్‌స్ట్రీమ్ మీడియా అని ఎలా అనగలం? కార్పొరేట్ మీడియా కొద్ది మంది యజమానుల ప్రయోజనాలను కాపాడేం దుకుద్దేశించినట్టిది."**



లోకమాన్య తిలక్,
స్వాతంత్రోద్యమంలో ఆయన
నడిపిన కేసరి పత్రిక


केसरी.

देशाचें दुर्दैव !!

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌కాక ముందే అహ్మదాబాద్ కరస్పాండెంట్స్ కూపీ లాగి ఇచ్చిన ఈ కథనాలు వెబ్‌సైట్ నుంచి హఠాత్తుగా మాయమై పోయాయి. అధికారంలో వున్నవారికి, కార్పొరేట్ మీడియాకు మధ్య లాలూచీయే దీనికి అసలు కారణం. 1980-90లలో టైమ్స్ గ్రూపు యాజమాని బెనెత్ కోల్‌మన్ అండ్ కో లిమిటెడ్ మీడియాను అడ్డం పెట్టుకుని షిప్పింగ్, సిమెంట్, జ్యూట్, ఉక్కు వ్యాపారాల్లో తన ప్రయోజ నాలను నెరవేర్చుకునేది. ఇటువంటి కార్పొరేట్ మీడియాను మెయిన్‌స్ట్రీమ్ మీడియా అని ఎలా అనగలం? కార్పొరేట్ మీడియా కొద్ది మంది యజమానుల ప్రయోజనాలను కాపాడేం దుకుద్దేశించినట్టిది. వారి వద్ద హంగులు, ఆర్భాటాలు, విస్తృతమైన నెట్‌వర్క్ వుండొచ్చు. అంత మాత్రాన అది మెయిన్ స్ట్రీమ్ మీడియా కాజాలదు. దానిని కార్పొరేట్ మీడియా అనే పిలవాలి. వందేళ్ల జర్నలిజం చరిత్రలో మకుటాయమానదగ్గ రచనలు 1919లో జాన్ రీడ్ రాసిన 'టెన్ డేస్ దట్ షుక్ ద వరల్డ్', మెక్సికో రివల్యూషన్‌కు సంబంధించిన 'వీవా మెక్సికో' పుస్తకాలు. ఈ రెండు రచనలు ఆయనకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. అమెరికాకు చెందిన జాన్ రీడ్ ప్రముఖ పాత్రికేయుడు, సోషలిస్టునాయకుడు. ఈ సందర్భంగానే అమెరికాకు చెందిన మరో ప్రముఖ జర్నలిస్టు మార్క్ ట్వెయిన్స్ గురించి ప్రస్తావించాలి. ఇది ఆయన కలంపేరు. అసలు పేరు శామ్యూల్ లాంగ్‌గ్రోన్‌క్లెమెన్స్. ముప్పయ్యేళ్ల పాటు పాత్రికేయరంగంలో పనిచేసిన ట్వెయిన్స్‌కు నలభైకి పైగా మారు పేర్లు వున్నాయి. ఆయనను పోలీసులు అరెస్టు చేసినప్పుడల్లా వీటిలో ఏదో ఒక పేరు చెబుతుండేవాడు. సామ్రాజ్యవాదం, జాతి దురహంకారంపై ఆయన తన కలాన్ని కత్తిలా ఝుళిపించాడు. అనేక మార్లు జైలుకెళ్లాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడేవారికి ఆయన రాసిన 'అడ్వంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవల గొప్ప ప్రేరణనిస్తుంది. కాంగోలో బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని, ఫిలిప్పైన్స్‌ను నెత్తురుటేరుల్లో ముంచి, అయిదు శాతం జనాభాను హరించిన భయానక యుద్ధానికి సంబంధించిన యదార్థ గాథలను బయటి ప్రపంచానికి తెలియజేసిన సాహసోపేత పాత్రికేయుడాయన. 2000 సంవత్సరంలో న్యూయార్క్ టైమ్స్ ఎడిటర్‌ను నేను కలుసుకున్నప్పుడు మార్క్ ట్వెయిన్స్ గనుక ఇప్పటికీ జీవించి వుంటే ఆయనను మీ పత్రికలో కాలమిస్ట్‌గా పెట్టుకునేవారా? అనడిగాను. దానికి ఆయన ఏమాత్రం తడుముకోకుండా 'నో' అని గట్టిగా చెప్పాడు. మార్క్ ట్వెయిన్స్‌కు ముందున్న తరంలో థామస్ పెయిన్ అనే గొప్ప జర్నలిస్టు వుండేవాడు. 1737లో ఇంగ్లండ్‌లో జన్మించిన

**“ పోలీస్ ఉన్నతాధికారులను మహరాష్ట్ర ముఖ్య మంత్రి పిలిపించుకుని రైతాంగ ఆత్మహత్యలపై సాయినాథ్ లాంటి కొందరు పాత్రికేయులు విష ప్రచారం చేస్తున్నారు, వాటికి చెక్ పెట్టాలని చెప్పిన తరువాత రిపోర్టు దానికనుగుణంగానే వస్తుంది. 2011 నుంచి పోలీసు రికార్డులు, రెవిన్యూ శాఖ సర్వేలు రైతు ఆత్మహత్యల అంకెల ను తగ్గించి చూపడం మొదలెట్టాయి. ”**

పెయిన్ మూడు స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొన్నాడు. బ్రిటన్‌లో ప్రజలపై విపరీత భారాలను మోపిన నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాడు. 1776లో అమెరికన్ స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరులూదినవారిలో ఆయన ఒకరు. అమెరికన్ వార్ ఫర్ ఇండి పెండెన్స్ ఉద్యమంలో వలంటీర్‌గా వ్యవహ రించాడు. ఆ తరువాత ఫ్రెంచ్ విప్లవంలో పాల్గొన్నాడు. 1790లో ఫ్రాన్స్ రివల్యూషన్ అసెంబ్లీకి సభ్యునిగా ఎన్నికయ్యాడు. ఫ్రెంచ్ విప్లవం, మానవ హక్కులను బలపరుస్తూ పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాశాడు. చరిత్రలోకి వెళితే ఇటువంటి రివల్యూషనరీ జర్నలిస్టులు మనకు అనేక మంది తారస పడతారు.

కార్పొరేట్ మీడియా విషయానికొస్తే అది తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి రకరకాల సిద్ధాంతాలు, ప్యాకేజీలు, ఆంక్షలతో మీడియాను నియంత్రించాలని చూస్తోంది. ఈ క్రమంలోనే కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఓ ప్రమాదకరమైన ప్రక్రియను చేపట్టింది. రైతుల ఆత్మహత్యలు, శిశు మరణాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు, ఇతర నేరాలకు సంబంధించి విలువైన, విశ్వసనీయ సమాచారాన్ని సేకరించి, విశ్లేషించే జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) పీక నులి మేసి, బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చి (బిపిఆర్)లో కలిపేయాలని చూస్తోంది. ఇందుకు సంబంధిం చిన అధికారిక ప్రకటన వారం పది రోజుల్లో వెలువడనున్నట్లు సమాచారం. ఎన్‌సిఆర్‌బిని నాశనం చేయడం ద్వారా రైతాంగ ఆత్మహత్యల ఘోష వినబడకుండా చేయాలన్నది మోడీ ప్రభుత్వ పన్నాగం. పిలల్లో పౌష్టికాహార లోపం గురించి దీర్ఘకాలికంగా డేటాను సేకరించి, విశ్లేషించే నేషనల్ న్యూట్రిషనల్ మోనిటరింగ్ బ్యూరో (ఎన్ఎన్ఎంబి)పై రెండేళ్ల క్రితమే వేటు వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పిల్లలకు రోజుకు కనీసం 513 కేలరీలు కూడా ఆహారం లభించడం లేదని, ఎంత మంది పిల్లలు విటమిన్ ఎ లోపంతో బాధపడుతున్నారు? మెగ్నీషియం లోపంతో ఎంత మంది బాధపడుతున్నారు ? వంటి కచ్చితమైన డేటా ఇచ్చే ఏకైక సంస్థ ఈ న్యూట్రిషన్ మోనిటరింగ్ బ్యూరో. అది ఇచ్చే సమాచారం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా వుండడంతో ఆ సంస్థను శాశ్వితంగా మూసే సింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ఇండి యన్ డేటాను నాశనం చేస్తుంది. ఈ క్రతువును యుపిఏ ప్రభుత్వం ప్రారంభించగా ఎన్డీయే ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. 2009–10లో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన సర్వే పేదరికం అధికంగా వున్నట్లు తేల్చింది. అది కరువు సంవత్సరం కావడంతో అంతకుముందు సంవత్సరంతో పోల్చితే పేదరికం పెరిగింది. ఇది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా వుండడంతో అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా ఆ సర్వే రిపోర్టును పక్కన పెట్టి, రీ సర్వేకు ఆదేశించారు. తరువాత అన్ని సర్వేలను అవుట్ సోర్సింగ్‌కు ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రభుత్వ సర్వేల్లో 10,000–20,000 మందిని నమూనాలుగా తీసుకుంటే, ప్రైవేట్ సర్వేలు 3,000–4000 మందిని మాత్రమే నమూనాలుగా తీసుకుని మమ అనిపించాయి. ఆ విధంగా పేదరికం తగ్గినట్లు సర్వే రిపోర్టులను తెప్పించుకున్నారు. ప్రొఫెసర్లు, జర్నలిస్టులకు అందుబాటులో వుండాల్సిన ప్రామాణిక డేటాను ప్రభుత్వమే ఒక పథకం ప్రకారం నాశనం చేస్తోంది. వామ పక్షాలు, ఇతర సామాజిక కార్యకర్తలు ఎక్కువగా ఉటంకించే ఎన్‌సిఆర్‌బి డేటాను ప్రభుత్వం గత అయిదారేళ్లుగా పరిగణనలోకి తీసుకోవడం మానేసింది. రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూ శాఖ ఇచ్చిన డేటానే పార్లమెంటులోను, అసెంబ్లీల్లోను వల్లె వేస్తోంది. రైతుల ఆత్మహత్యలు ఎక్కువ జరిగాయంటే పరిహారం ఎక్కువ చెల్లించాల్సి వుంటుంది కాబట్టి వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్య చేసుకున్న రైతులు ఒక్కరు కూడా లేరని దబాయిస్తోంది. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యల విషయాన్నే తీసుకుంటే ఒకే వారం నాలుగు సర్వేల ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం చెప్పే లెక్కలకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన వారి లెక్కలకు మధ్య వ్యత్యాసం చాలా వుంది. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తు చేయాలి. చక్రవర్తి నగ్నంగా వుండడాన్ని అందరూ చూశారు. కానీ, ఆ విషయాన్ని ఆయనకు చెప్పే సాహసం ఎవరూ చేయరు. అటువంటి స్థితిలో ఒక పిల్లవాడు లేచి మహా రాజా! నీ అవతారాన్ని ఒక్కసారి అద్దంలో చూసుకో, నువ్వు ఎంత నగ్నంగా ఉన్నావో నీకే తెలుస్తుంది అన్నాట్ట! నా దృష్టిలో ఆ పిల్లవాడే మొట్టమొదటి రిపోర్టర్. అతడే జర్నలిజంలో నిజమైన హీరో! అటువంటి వారే ఇప్పుడు కావాలి.


రైతాంగ ఆత్మహత్యలకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించే డేటా, రెవిన్యూశాఖ ఇచ్చే అంకెల కన్నా ఎన్‌సిఆర్‌బి ఇచ్చే డేటా చాలా మెరుగైనది, విశ్వసనీయ మైనది. పోలీస్ ఠాణాలో నమోదయ్యే వివిధ రకాల నేరాల్లో రైతు ఆత్మహత్య కూడా ఒకటిగా వుంటుంది. పోలీస్ స్టేషన్ నుంచి ఆ నివేదికలే జిల్లా కేంద్రానికి వెళతాయి. అక్కడి నుంచి రాష్ట్ర కేంద్రానికి, అటు మీదట కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు వెళుతుంది. ఎన్‌సిఆర్‌బి ఈ పోలీస్ ఠాణాలపై ఆధారపడకుండా ప్రజల నుంచి సేకరిస్తుంది. కాబట్టి ఆ డేటాకు మిగతా డేటాలకన్నా విశ్వసనీయత ఎక్కువగా వుంటుంది. మహారాష్ట్రలో ఇరవై ఏళ్లలో 65వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం అలాంటి పరిస్థితి ఏదీ లేదని అంకెలగారడీతో బుకాయించే ప్రయత్నం చేసింది. పోలీస్ ఉన్నతాధికారులను ముఖ్య మంత్రి పిలిపించుకుని రైతాంగ ఆత్మహత్యలపై సాయినాథ్ లాంటి కొందరు పాత్రికేయులు విష ప్రచారం చేస్తున్నారు, వాటికి చెక్ పెట్టాలని చెప్పిన తరువాత రిపోర్టు దానికనుగుణంగానే వస్తుంది. 2011 నుంచి పోలీసు రికార్డులు, రెవిన్యూ శాఖ సర్వేలు రైతు ఆత్మహత్యల అంకెల ను తగ్గించి చూపడం మొదలెట్టాయి. 2014 నాటికి వచ్చేసరికి 12 రాష్ట్రాలు, అయిదు కేంద్ర పాలిత ప్రాంతాలు తమ రాష్ట్రాల్లో ఒక్కరంటే ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదని ప్రకటించేశాయి. అంటే భారత్ రైతుల స్వర్గ ధామంగా మారిపోయిందన్న మాట! మరో వైపు ఆత్మహత్యలను నేరంగా పరిగణించనక్కర్లేదని ప్రభుత్వమే ప్రకటించాక ఈ కేసుల నమోదు తగ్గక ఏమవుతుంది? పశ్చిమ బెంగాల్‌లో

> **"రాజస్థాన్‌లో పశ్చిమ వైపు నుంచి తూర్పు దిశగా గాలులు వీస్తాయి. అగ్రవర్ణాలు పీల్చి వదిలిన గాలినే దళితులు పీల్చాలి. దానికనుగుణంగా అక్కడ గ్రామానికి తూర్పు శివార్లలో దళితుల కాలనీలు వుంటాయి. సాగు నీటి పారుదల వ్యవస్థలో చారిత్రికంగా కొన సాగుతూ వస్తున్న ఈ వివక్షపై జర్నలిస్టులు దృష్టిపెట్టాలి."**

ఏడాదికి 800 మంది రైతులు, కర్ణాటకలో 1,500 మంది, ఛత్తీస్‌గఢ్‌లో 1,550 మంది రైతులు సగటున ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఎన్‌సిఆర్‌బి డేటా చెబుతుంటే, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మహత్యలు లేవని చెబుతున్నాయి. ఎవరు రైతు అనే నిర్వచనం విషయానికొస్తే అదొక పెద్ద ప్రహసనం. దేశంలో 95 శాతం కౌల్దారుల పేర్లు రికార్డులకెక్కడం లేదు. ఎందుకంటే ఎక్కువ సందర్భాల్లో నోటి మాటతోనే భూమి కౌలుకిస్తుంటారు. కౌల్దారుల వద్ద ఎలాంటి పత్రాలు వుండవు. కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే దానిని వ్యవసాయ కూలీల ఖాతాలోనో, మరో ఖాతాలోనో వేస్తున్నారు. దీంతో రైతుల ఆత్మహత్యలు తగ్గుతున్నట్లు, ఇతర ఆత్మహత్యలు పెరుగుతున్నట్లు రికార్డులు చూపిస్తాయి. కర్ణాటకలో రైతుల ఆత్మహత్యలు 62 శాతం తగ్గాయని చూపిస్తే, ఇతర ఆత్మహత్యల్లో 132 శాతం పెరుగుదల నమోదయింది. రైతు ఆత్మహత్యలు తగ్గాయని చెప్పే ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. డేటా ప్రక్రియను పూర్తిగా నాశనం చేయడం ద్వారా వచ్చే అయిదేళ్లలో గణాంకాల తులనాత్మక పరిశీలనకు ఏమాత్రం అవకాశం లేకుండా చేస్తోంది. ఇది వ్యవసాయ రంగంపైన, పశుసంపదపైన తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రతి అయిదేళ్లకోసారి నిర్వహించే పశుసంపద సర్వే ఈ ఏడు జరుగుతుంది.

1980సెప్టెంబరు 20న యుఎన్‌ఐ రిపోర్టర్‌గా పాత్రికేయరంగంలో నేను అడుగుపెట్టేసరికి ఇరాన్‌- ఇరాక్‌ యుద్ధం మొదలైంది. అప్పట్లో ప్రతి పత్రికకు ఒక లేబర్‌ కరస్పాండెంటు,వ్యవసాయ రిపోర్టరు ఉండేవారు. ఇప్పటికొచ్చేసరికి ఏ పత్రికలోనూ లేబర్‌ కరస్పాండెంటు కానీ, వ్యవసాయ కరస్పాండెంటు కానీ లేని పరిస్థితి. ఒక వేళ ఏ పత్రికకైనా వ్యవసాయ రిపోర్టర్‌ వున్నా, ఆ వ్యక్తి వ్యవసాయ మంత్రిత్వశాఖ, సంబంధిత శాఖా మంత్రి ఇచ్చే ప్రకటనలు, పత్రికా గోష్టులకు మాత్రమే పరిమితమవుతున్నారు. వ్యవసాయ కరస్పాండెంట్‌ అంటే క్షేత్ర స్థాయికి వెళ్లి పరిస్థితిని పరిశీలించాలి. మండీకి వెళ్లాలి. మార్కెట్‌ను అధ్యయనం చేయాలి. రబీ, ఖరీఫ్‌ సీజన్లలో పంటల పరిస్థితిని అంచనా వేయాలి. రుతుపవనాల ప్రభావం గురించి అంచనా వుండాలి. నేడు మీడియాకు ఆ ఆసక్తే సన్నగిల్లింది. దేశ జనాభాలో 75 శాతంగా వున్న ప్రజల గురించి అది పట్టించుకోదు. కానీ, సెన్సెక్స్‌ 300 పాయింట్లు పడిపోతే ప్రపంచం ఏదో తలకిందులైపోయినట్లు గగ్గోలు పెడుతుంది. 69 శాతం మందికి జీవనాధారంగా వున్న వ్యవసాయ రంగానికి కార్పొరేట్‌ మీడియా ఇస్తున్న స్పేస్‌ 0.67శాతం.

వ్యవసాయ సంక్షోభానికి గల కారణాల్లో సాగునీటి సమస్య ముఖ్యమైనది. కావేరి వివాదాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరిస్తే ప్రతి ఒక్కరూ సంతోషిస్తారు. దేశంలో అసమానతలు పెరగడానికి నీటి సంక్షోభం ఒక ముఖ్య కారణం. నీటి సమస్యలోనూ వర్గ పక్షపాతం వుంది. నీటి పంపిణీలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వివక్ష కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు ముంబయిలో తాను నివసిస్తున్న ప్రాంతానికి గత 29ఏళ్లుగా రోజుకు 24 గంటలూ నీరు సరఫరా అవుతుంది. ముంబయికి సరఫరా అవుతున్న ఈ నీళ్లు థానే జిల్లాల్లోని ఆదివాసీలుండే ప్రాంతంలోని అయిదు సరస్సుల నుంచి తీసుకొస్తున్నారు. మరో వైపు అక్కడ ఆదివాసీలకు ఒక్కటంటే ఒక్క వాటర్‌ కనెక్షన్‌ కూడా మంజూరు చేయలేదు. ఈ విధంగా ఆదివాసీల నీటిని వారి దాహార్తిని తీర్చకుండా ముంబయి నగరానికి గత ముప్పయ్యేళ్లుగా తరలిస్తున్నారు. టైమ్స్‌ ఆఫ్‌ ఇండియా జర్నలిస్టు ప్రియాంక కకోద్కర్‌ గత ఏడాది ఆర్‌టిఐ ద్వారా రాబట్టిన సమాచారాన్ని బట్టి మహారాష్ట్ర పట్టణ ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాలకన్నా 400 శాతం ఎక్కువగా నీరు పొందుతున్నట్లు తేలింది. ముంబయి, థానే, పూణె ఈ మూడు పట్టణాల జనాభా 36 శాతం కాగా, మొత్తం నీటిలో 56 శాతం నీటిని వీరు ఉపయోగిస్తున్నారు. పట్టణాలకు, గ్రామీణ ప్రాంతాలకు మధ్య వివక్ష అలా వుంచితే, పట్టణ ప్రాంతాల్లో సంపన్నులుండే ప్రాంతాలకు, దళితులు, ఇతర అణగారిన వర్గాలవారుండే కాలనీలకు మధ్య వివక్ష ప్రస్ఫుటంగా కనిపి స్తోంది. దక్షిణ ముంబయి, ఘాట్కోపర్‌, ధారావి ప్రాంత ప్రజలకు తలసరి ఒక్కొక్కరికి 40-50 లీటర్లు మాత్రమే సరఫరా చేసి, సంపన్నులుండే ప్రాంతాల్లో ఒక్కొక్కరికి 500-600 లీటర్లు చొప్పున సరఫరాచేస్తున్నారు. ఇక్కడ ఒక అంశం గురించి ప్రస్తావించాలి. దళిత కాలనీలు ఊరికి దక్షిణం వైపే ఎందుకుంటాయి? ఉత్తరం వైపు ఎందుకుండవు? దక్షిణాదివైపు తల పెట్టుకుని పడుకుంటే యముడు వచ్చి తల నరుక్కుపోతా డని హిందూ మత విశ్వాసుల నమ్మకం. అమ్మమ్మ నానమ్మలు కూడా మనకు ఇదే విషయాన్ని నూరిపోస్తుంటారు. అదలా వుంచితే ఈ ప్రాంతాల్లో నీటి ప్రవాహం చాలా వరకు ఉత్తరం నుంచి దక్షిణం వైపు వుంటుంది. కనుక నీటి ప్రవాహానికి ఎగువ భాగంలో అగ్రవర్ణాలు, మధ్య భాగంలో మధ్య తరగతి కులాలు, చిట్ట చివరి భాగంలో దళితులు వుంటారు. ఈ విధంగా నీటి సరఫరాలోను వర్ణ వివక్షను వ్యవస్థీకృతం చేశారు. రాజస్థాన్‌ దగ్గర కొచ్చే సరికి అక్కడ ఈయమ నీతి మారిపోతుంది. అక్కడ నదులు, సరస్సులేమీ వుండవు కాబట్టి



మహాత్మా గాంధీ నడిపిన యంగ్‌ ఇండియా పత్రిక ఇన్‌ సెట్‌లో గాంధీ

> **“ కార్పొరేట్ మీడియా గుత్తాధిపత్య విస్తరణ క్రమంలో రెండు ప్రధానమైన వ్యవస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. మొదటిది 2002లో టైమ్స్ ఆఫ్ ఇండియా మీడియా నెట్ పేరుతో ఎడిటోరియల్ స్పేస్‌ను అమ్మకానికి పెట్టడం. ఇక రెండవది, 2009లో చోటు చేసుకున్న ప్రైవేట్ ఒప్పందాలు.**


THE TIMES OF INDI
OBAMA'S NET WORTH LOWEST AT $5M AMONG US PRESIDENTS IN 57 YRS | 16
RAVINDRA JADEJA APOLOGISES TO BCCI FOR ST LUCIA PUB INCIDENT | 24
IITians all — 175 clear JEE
Ranks Have Dropped But Numbers Increase
14-year-old boy tops in Delhi
SP renominates Jaya Bachchan for RS
Govt crushes AI stir, sacks union leaders

కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాసే టైమ్స్ ఆఫ్ ఇండియా

గాలి వాలును బట్టి అక్కడ దళితుల స్థానాన్ని నిర్ణయించారు. ఆ రాష్ట్రంలో పశ్చిమ వైపు నుంచి తూర్పు దిశగా గాలులు వీస్తాయి. అగ్రవర్ణాలు పీల్చి వదిలిన గాలినే దళితులు పీల్చాలి. దానికనుగుణంగా అక్కడ గ్రామానికి తూర్పు శివార్లలో దళితుల కాలనీలు వుంటాయి. సాగు నీటి పారుదల వ్యవస్థలో చారిత్రికంగా కొన సాగుతూ వస్తున్న ఈ వివక్షపై జర్నలిస్టులు దృష్టిపెట్టాలి.

నీటి వనరుల మళ్లింపు ప్రధానంగా నాలుగు రూపాల్లో సాగుతోంది. 1. పేదల నుంచి ధనికులకు 2.గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణ ప్రాంతాలకు, 3. వ్యవసాయం నుంచి పరిశ్రమలకు. 4. ఆహార పంటల నుంచి వాణిజ్య పంటలకు. మొదటి రెండు అంశాల గురించి ఇప్పటికే చర్చించాము. ఆహార పంటల నుంచి వాణిజ్య పంటలకు నీటి మళ్లింపు అనేది ఒక ముఖ్యమైన అంశం. ఒక ఎకరం చెరకు పంటకు ఉపయోగించే నీటితో 12 -15 ఎకరాల జొన్న పండించవచ్చు. మహారాష్ట్రలో ఈ వాణిజ్య పంటలకు ఎక్కువగా నీటిని వినియోగిస్తున్నారు. ప్రజల తాగు నీటి అవసరాలకు ఉపయోగించాల్సిన నీటిని పరిశ్రమలకు మళ్లిస్తున్నారు. మరట్వాడా ప్రాంతంలో మహిళలు లీటర్ నీటికి 45 పైసలు చెల్లిస్తుంటే, బీరు, మద్యం తయారు చేసే 24 కంపెనీలు లీటర్‌కు నాలుగు పైసలు మాత్రమే చెల్లిస్తు న్నాయి. బీరు కంపెనీలు రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని తోడేస్తున్నాయి. గత సంవత్సరం కుంభమేళాకు మొత్తం4.2 టిఎంసీల్లో 1.3 టిఎంసీల నీటిని మళ్లించారు. ఐపిఎల్ మ్యాచ్ నిర్వహణ కోసం మైదానం తడిపేందుకు తాగు నీటిని వాడొద్దని మహారాష్ట్ర హైకోర్టు ఆదేశించాల్సివచ్చింది. కోర్టు అలా ఆదేశించడాన్ని కార్పొరేట్ మీడియా తీవ్రంగా విమర్శించింది. నీటి కొరతతో నాసిక్‌లో ద్రాక్ష పంట పూర్తిగా దెబ్బతిని పోయినా దానికి పట్టదు. 30-40 లక్షల పనిదినాలు కోల్పోయినా ఫికర్ లేదు. ద్రాక్ష ఎగుమతులు పడిపోయి యావత్ మరట్వాడా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నా ఎన్నడూ పట్టించుకోని మీడియా ఐపిఎల్ మ్యాచ్ రద్దుపై మాత్రం శివాలెత్తింది.

మరట్వాడా నీటి సమస్య ముందుకొచ్చినప్పుడల్లా జాతీయ నదుల అనుసంధానం గురించి కొందరు మాట్లాడుతుంటారు. ఈ అనుసంధానం పాట పాడేవారికి ఈ దేశంలోని భౌతిక పరిస్థితులు, వాటి సంక్లిష్టతలు, మిగులు జలాల గురించి బొత్తిగా అవగాహన లేదు. దేశంలో ప్రవహించే అతి పెద్ద నదుల్లో ఒకటైన బ్రహ్మపుత్ర ఎగువ భాగాన చైనా ఆనకట్ట నిర్మించింది. బ్రహ్మపుత్ర నదీ జలాలపై చైనాతో వివాదం వుంది. అలాగే బాగ్లీహార్‌పై పాకిస్తాన్‌తో తగాదా వుంది. తీస్తా, ఫరక్కాపై బంగ్లాదేశ్‌తో పేచీ వుంది. కోసీపై నేపాల్‌తో సమస్య వుంది. అంతర్గతంగా చూసుకుంటే కావేరిపై కర్ణాటక, తమిళనాడు మధ్య వివాదం, ముల్లపెరియార్ డ్యామ్‌పై కేరళ, తమిళనాడు మధ్య జగడం, ఆల్మట్టిపై కర్ణాటక, ఆంధ్ర మధ్య వివాదం, రావి, బియాస్‌పై పంజాబ్‌లో ఒకప్పుడు తలెత్తిన ఖలిస్తాన్ ఉద్యమం.. ఒక్క మాటలో చెప్పాలంటే దేశంలో తలెత్తిన ప్రతి రాజకీయ వివాదం వెనక ఈ నదీజలాల వివాదం ఏదో ఒక రూపంలో వుంటుంది. వీటిని పరిష్కరించుకోకుండా జాతీయ నదుల అనుసంధానం గురించి మాట్లాడడంలో అర్థం ఏమైనా వుందా?

దేశంలో కరువుకాటకాలేర్పడడానికి వాతావరణ మార్పులే కారణమన్నట్లుగా కార్పొరేట్ మీడియా చెబుతున్నది. వాతావరణ మార్పులు ముఖ్యమైన అంశమే అందులో సందేహం లేదు, కానీ అంతకన్నా ముఖ్యమైనది నీటి సమస్య అనే విషయం మరచిపోరాదు.

కార్పొరేట్ మీడియా గుత్తాధిపత్య విస్తరణ క్రమంలో రెండు ప్రధానమైన వ్యవస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. మొదటిది 2002లో టైమ్స్ ఆఫ్ ఇండియా మీడియా నెట్ పేరుతో ఎడిటోరియల్ స్పేస్‌ను అమ్మకానికి పెట్టడం. ఇక రెండవది, 2009లో చోటు చేసుకున్న ప్రైవేట్ ఒప్పందాలు. వార్తాపత్రిక యజమాన్యం, ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీ మధ్య ఈ ఒప్పందాలు వుంటాయి. ఈ ప్రైవేట్ ఒప్పందాల ఉద్దేశం వ్యాపార విస్తరణలో పరస్పరం సహకరించుకోవడం ఒక్కటే కాదు, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు కట్టకుండా ఎగవేయడమూ వుంది. రెండు ఇంగ్లీష్ పత్రికలు మినహా దాదాపు అన్ని కార్పొరేట్ పత్రికలు ఈ పద్ధతిలోకి ప్రవేశించాయి. ఈ తరహా ఒప్పందాలకు మన దేశంలో ఆద్యుడు పాంటలూన్స్ బ్రాండ్ రూపకర్త కిషోర్ గియానీ అనే చెప్పాలి. ఆయన తన వ్యాపార సామ్రాజ్యాన్ని పెద్దయెత్తున విస్తరించుకునేందుకు ఒక వార్తా పత్రికతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ఎలా వుంటుందంటే, ఒక ప్రైవేట్ కార్పొరేషన్ ఒక వార్తా పత్రికలో 7-10 శాతం షేర్లు తీసుకుంటుంది. అప్పుడు సదరు కంపెనీకి వ్యతిరేకంగా ఆ పత్రికలో ఎలాంటి వార్తలూ రావు. ప్రైవేట్ కంపెనీ ఆ పత్రికలో రెండు మూడు పేజీల భారీ వాణిజ్య ప్రకటన ఇస్తుంది. జాతీయ పత్రికలో ఒక ఫుల్ పేజీ యాడ్ అంటే రెండు కోట్లు చేస్తుంది. అంత మొత్తం నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే ఆదాయపు పన్ను కట్టాల్సి వుంటుంది. ఈ పన్నును

కట్టకుండా తప్పించుకోవడం కోసం ఆ కంపెనీ పత్రికకు చెల్లించాల్సిన సొమ్మును షేర్ల రూపంలో ముట్టజెప్తుంది. ఈ విధమైన ఒప్పందాల్లో కొన్ని వందల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఓ పత్రిక 230 కంపెనీలతో ఒకేసారి ఈ తరహా ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇంత జరుగుతున్నా ఆదాయపు పన్ను శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ ప్రైవేట్ ఒప్పందాల భాగోతం ముందు పెయిడ్ న్యూస్ కుంభకోణం కూడా దిగదుడుపే. పెయిడ్ న్యూస్ అనేది 2009 నాటికి ఒక పరిశ్రమగా మారిపోయింది. కార్పొరేట్ మీడియా సంస్థలు నేడు దీనిని పక్కాగా సంస్థాగతం చేశాయి. అశోక్ చవాన్ పెయిడ్ న్యూస్ వ్యవహారంపై తాను రాసిన ప్రత్యేక వార్తా కథనాలపై విచారణకు ఆదేశించిన భారత ప్రెస్ కౌన్సిల్ చివరికి తన నివేదికకు తనే పాతరేసింది. ప్రెస్‌కు రక్షణ కవచంగా వుండాల్సిన ప్రెస్ కౌన్సిల్ కార్పొరేట్ మీడియా అధిపతుల కొమ్ముకాసింది. జస్టిస్ మార్కండేయ కట్జూ ప్రెస్ కౌన్సిల్ చైర్మన్‌గా వున్నప్పుడు పరిస్థితి కొంత మెరుగ్గా వుండేది.

> ‘పెయిడ్ న్యూస్’ సంస్కృతి భారత్‌ది కాదు, ఇది అమెరికా నుంచి దిగుమతి అయింది. 2002లో బిబిసి బాబరావోల్ట్రాస్ కార్యక్రమం పేరుతో క్యాంప్‌బెల్ సూప్ గురించి ఎనిమిది ఎపిసోడ్‌లు నడిపింది. అమెరికాకు చెందిన ఎబిసి కంపెనీ ఈ క్యాంప్‌బెల్ సూప్ తయారీ దారు. అదే దీనికి స్పాన్సరర్‌గా వ్యవహరిం చింది. టైమ్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు హెన్రీ లూసీ తన పత్రిక వాస్తవికతకు దర్పణం పడుతుందని గొప్పగా ప్రకటించాడు. అది పూర్తి అబద్ధం.


DAILY NEWS & ANALYSIS
DNA
Modi's 10 mn Indian Overseas Votebank
All new DNA: No junk, just news
Election Commission puts long-discussed idea on track with survey, contest to crowdsource ideas, ties up with TISS for the mission
THE DIASPORA

పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రికలు కార్పొరేట్ పత్రికలు

రిలయెన్స్ కంపెనీ నెట్‌వర్క్-18, ఫస్ట్ పోస్ట్‌ను నెలకొల్పడంతో బాటు, ఇతర మీడియా సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మీడియా పై గుత్తాధిపత్యం చలాయించే స్థితికి ఎదిగింది. మీడియాలో వేల షేర్లు పెట్టిన సంస్థ భారత ఆర్థిక వ్యవస్థపై మాంద్యం ప్రభావాన్ని బయటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది. ఆర్థిక వ్యవస్థ పై మాంద్యం నీడలు కమ్ముకున్న తరుణంలో ‘ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోంది’ అంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా పతాక శీర్షికన ఒక కథనాన్ని ఇచ్చింది. దానికిందనే ‘మాంద్యం ఎక్కడ?’ అంటూ మరో శీర్షిక పెట్టింది. వాల్‌స్ట్రీట్ దెబ్బకు ఒక వైపు వందల కోట్ల రూపాయల ఆస్తులు స్టాక్ మార్కెట్‌లో ఆవిరైపోతుంటే ఈ విధమైన ప్రచారాన్ని ఆ పత్రిక నిర్భీతిగా సాగించింది. మార్కెట్ శక్తులతో రాజీ పడి వాస్తవాలను మసిపూసి మారేడు కాయ చేసింది. మోడీ- అమిత్ షాలను ఇంద్రుడు చంద్రుడు అంటూ ఆకాశాని కెత్తేసింది. దేశంలో నయా ఉదారవాద విధానాలను మొట్టమొదట ప్రవేశపెట్టిన పివి నరసింహారావును అప్పట్లో అపర చాణక్యుడని కీర్తించింది. పివి ప్రధాని కాగానే ఇండియా టుడే రాసిన తొలి సంపాదకీయంలో ఆయన వట్టి అసమర్థుడని, పివి కన్నా శరద్ పవార్ ప్రధాని అయితే ఎంతో బాగుండేదని వ్యాఖ్యానించింది. ఆ తరువాత కొద్ది రోజులకే ఆ పత్రిక బాణీ మార్చి, పివిని మించిన యోధుడే లేరని ప్రశంసల వర్షం కురిపించింది. వాజ్‌పేయి ప్రధాని అయినప్పుడు ఆయనను ‘కవి ప్రధాని’ (పొయెట్ ప్రైమ్ మినిస్టర్) అంటూ గానం చేసింది. వాజ్‌పేయి నిజంగా కవే అయివుంటే ప్రధాని కాకముందు ఆయన కవిత ఒకటైనా హిందీ సాహిత్యంలో అచ్చయివుండేవి. కానీ అలా ఎన్నడూ జరగలేదు. వాజ్‌పేయి తన కవితలను తానే అచ్చువేసుకున్నారు. 2004లో మన్మోహన్ సింగ్ ప్రధాని అయినప్పుడు ‘ఆర్థికవేత్త ప్రధాని’ (ఎకనామిస్ట్ ప్రైమ్ మినిస్టర్) అంటూ ఆయనను ఆకాశాని కెత్తేసింది. వీరిని మీడియా ఇలా పరవశించి పొగడడానికి కారణం ఒక్కటే. విలువైన సహజ వనరులను మార్కెట్ శక్తులకు అప్పనంగా అప్పగించడంలో ఈ ప్రధానులంతా పోటీ పడ్డారు. అందుకే వారు కార్పొరేట్ మీడియాకు ముద్దు బిడ్డలయ్యారు. చమురు, గ్యాస్, మైనింగ్ వంటి వాటిని ప్రైవేట్ పరం చేయడం వల్ల ప్రధానంగా లబ్ధి పొందింది ఈ కార్పొరేట్ మీడియా కంపెనీలే! గనులు, చమురు, గ్యాస్, స్పెక్ట్రమ్ వంటివి ప్రైవేటీకరించడం వల్ల టాటా, బిర్లా, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలే లబ్ధి పొందాయి. ఈ కార్పొరేట్ మోనార్కులే మీడియా మోనార్కులుగా చలామణి అవుతున్నారు. యుపిఏ ప్రభుత్వంలో విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన ప్రఫుల్ పటేల్‌ను అత్యంత చురుకైన మంత్రిగా మీడియా కొనియాడింది. ఆయన చేసిన ఘనకార్యం ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియాను నిర్వీర్యం చేసే చర్యలు తీసుకోవడం. కార్పొరేట్ మీడియా బిజినెస్ లీడర్‌షిప్ అవార్డులనే ఎందుకు ఇస్తోంది. ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ కండక్టర్ అవార్డులు ఎందుకివ్వదు? ఇందులో పరస్పర ప్రయోజనాలు దాగి వున్నాయి. వ్యాపారాన్ని, అడ్వర్టయిజ్‌మెంట్ల రూపంలో ఆదాయాన్ని పెంచుకోవడమే దీని వెనక వున్న అసలు రహస్యం. 1985-86 వరకు సంపాదకుడు సుప్రీం. ఆయనకు చాలా అధికారాలుండేవి. ప్రపంచీకరణ వచ్చాక ఎడిటర్ పాత్ర నామ మాత్రావశిష్టమైపోయింది. కవులు, రచయితలు, స్వాతంత్ర్య సమర యోధులు సంపాదక బాధ్యతలు నిర్వహించే స్థితి పోయి, సిఇవోలు, మేనేజర్లు ప్రధాన సంపాదకులుగా చలామణి అయ్యే స్థితి వచ్చింది. ఇప్పుడు టీవీలో న్యూస్ యాంకర్లు యాంకర్ పాత్రకు మాత్రమే పరిమితమవడం లేదు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సిందే నంటారు. చైనా త్రికోణ భుజి అంశంపై త్రికోణ మంత సైజులో నోరు పెట్టుకుని అరుస్తారు.

మీడియాను, జర్నలిస్టులను కొందరు ఒకేగాటన కట్టి మాట్లాడుతుంటారు. అది

> **❝ కార్పొరేటేతర మీడియా రిపోర్టర్లు గా మనం బ్యాంకింగ్ రంగంలో సంక్షోభాన్ని ఏ విధంగా చూడాలి? బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించాలని కార్పొరేట్ మీడియా రోజు కొక సంపాదకీయం రాస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన ఏడున్నర లక్షల కోట్ల బకాయిల్లో ఎనబై శాతం దాకా కార్పొరేట్ బకా సురులు మింగేసినవే వున్నాయి. వీటి గరించి కార్పొరేట్ మీడియా మాట్లాడదు. ❞**

సరికాదు. దేశంలో అద్భుతమైన జర్నలిస్టులు వున్నారు. వీరిలో కొందరు మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో పనిచేస్తున్నారు. టెలిగ్రాఫ్, హిందుస్తాన్ టైమ్స్ సంయుక్తంగా లే ఆఫ్‌లు ప్రకటించినప్పుడు వీరిలో కొందరు బయటకు పోయారు. వారి స్థానంలో వేరే కొత్త గ్రాడ్యుయేట్లను యాజమాన్యాలు తీసుకున్నాయి. అవి ఇలా వ్యవహరించడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, డబ్బును ఆదా చేసుకోవడం, రెండు, ప్రజల్ని ఆలోచింపజేయడం కాకుండా, వారిని మభ్యపుచ్చడమే తమ లక్ష్యమని చాటడం.

'పెయిడ్ న్యూస్' సంస్కృతి భారత్‌ది కాదు, ఇది అమెరికా నుంచి దిగుమతి అయింది. 2002లో బిబిసి బాబరావోల్ట్రాస్ కార్యక్రమం పేరుతో క్యాంప్‌బెల్ సూప్ గురించి ఎనిమిది ఎపిసోడ్‌లు నడిపింది. అమెరికాకు చెందిన ఎబిసి కంపెనీ ఈ క్యాంప్‌బెల్ సూప్ తయారీదారు. అదే దీనికి స్పాన్సరర్‌గా వ్యవహరించింది. టైమ్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు హెన్రీ లూసీ తన పత్రిక వాస్తవికతకు దర్పణం పడుతుందని గొప్పగా ప్రకటించాడు. అది పూర్తి అబద్ధం. 2014లో ఆ పత్రిక విలేకరులకు ర్యాంకింగ్స్, రేటింగ్స్ అనే కొత్త విధానాన్ని ప్రకటించింది. చూసింది చూసినట్లు రిపోర్టుచేయడం, రాతలో చక్కటి నైపుణ్యం ప్రదర్శించడం, బ్రేకింగ్ స్టోరీస్ ఈ అంశాల ప్రాతిపదికన ర్యాంకింగ్స్ నిర్ణయిస్తామన్నారు. ఆచరణలో తేలిందేమిటంటే వాణిజ్య ప్రకటనకర్తలతో చక్కటి స్నేహ సంబంధాలు నెరపిన కరస్పాండెంటుకు ఎక్కువ పాయింట్లు, రాతలో అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన వారికి తక్కువ పాయింట్లు ఇచ్చారు. వీటన్నిటిని బట్టి జర్నలిస్టు తన తెలివితేటలను దేనికి ఉపయోగించాలో టైమ్స్ చెప్పకనే చెప్పింది. జర్నలిస్టు రాసే ఏ వార్త అయినా అడ్వర్టయిజర్లతో స్నేహ సంబంధాలను పెంపొందించేదిగా వుండాలన్నదే దాని సారాంశం. ఈ పరిస్థితుల్లో కార్పొరేట్ యేతర మీడియా జర్నలిస్టులపై బృహత్తరమైన బాధ్యత వున్నది. రైతుల ఆత్మహత్యలు, నీటి సంక్షోభం వంటి అంశాలను ఎన్ని కోణాల నుంచి పరిశీలించవచ్చో పైన పేర్కొన్నాం. ప్రపంచ బోర్‌వెల్స్ రాజధానిగా భారత్ పేర్గాంచింది. తమిళనాడులోని ఓ చిన్న పట్టణం తిరుచెన్‌గోడ్. గంధపు చెక్క స్మగ్లర్ వీరప్పన్ ఒకప్పుడు సంచరించిన ఈ ప్రాంతంలో 20 వేల బోర్‌వెల్ రిగ్స్ ఏటా సగటున 200 కోట్ల అడుగుల మేర తవ్వకాలు చేపడుతున్నాయి. మరో వైపు కోట్లాది లీటర్ల నీటిని పైసా కూడా చెల్లించకుండా బీర్ కంపెనీలు తోడేసుకుంటున్నాయి. బోర్‌వెల్స్ డ్రిల్లింగ్ నేడు ఒక పెద్ద పరిశ్రమగా మారింది.

కార్పొరేటేతర మీడియా రిపోర్టర్లు గా మనం బ్యాంకింగ్ రంగంలో సంక్షోభాన్ని ఏ విధంగా చూడాలి? బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించాలని కార్పొరేట్ మీడియా రోజు కొక సంపాదకీయం రాస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన ఏడున్నర లక్షల కోట్ల బకాయిల్లో ఎనబై శాతం దాకా కార్పొరేట్ బకా సురులు మింగేసినవే వున్నాయి. వీటి గరించి కార్పొరేట్ మీడియా మాట్లాడదు. బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలడానికి రిలయన్సే కారణమని తెలిసినా ఆ విషయాన్ని బయటకు చెప్పదు. దీనిపై మంత్రులూ నోరు మెదపరు. ఇటువంటి సందర్భాల్లో వాస్తవాలను బయట పెట్టాల్సిన బాధ్యత కార్పొరేటేతర మీడియాపై వుంది.

పశుపోషణ విషయానికొస్తే దళితులు, ఆదివాసీలు, పేదలు ఎక్కువగా ఉపయోగించే పందులు, గొర్రెలు, మేకలు, గాడిదల సంఖ్య ఈ మధ్య కాలంలో గణనీయంగా పడిపోతున్నది. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా విదర్భను సందర్శించినప్పుడు ఆవులను, గేదెలను పెద్ద యెత్తున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఆ విషయం మరచిపోయారు. యుపిఏ, ఎన్డీయే ప్రభుత్వ హయాంలలో ఒంగోలు జాతి పశువులు 20 శాతం అంతరించిపోయాయి. పశుపోషణ భారంగా మారి విదర్భ, ఉత్తరాఖండ్, అంథేరి, తడోబా ప్రాంత రైతులు పశువులను వదిలించుకోవడానికి అడవులకు తోలేస్తున్నారు. గోవధ నిషేధం వల్ల చెప్పులు తయారు చేసే కొల్లాపూర్ దళితులు ఉపాధికి ఎలా దూరమవుతున్నదీ, పశువుల వ్యాపారంపై ఆధారపడే బీసీలు ఎలా నష్టపోతున్నదీ కార్పొరేట్ మీడియాకు పట్టదు. గోవధ నిషేధం ప్రజల జీవితాలపై ఏ విధమైన ప్రభావం చూపుతుందన్న దాని గురించి కార్పొరేట్ మీడియా పట్టించుకోదు. ప్రభుత్వ ప్రకటనలపై ఆధార పడకుండా, ప్రజల జీవితాలకు సంబంధించిన డేటాను పరిశీలించి, వార్తా కథనాలను రాయాల్సిన బాధ్యత కార్పొరేటేతర మీడియా జర్నలిస్టులపై వుంది.

**(తెలుగు సేత కె. గడ్డెన్న)**

❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

ఈ మాసం ప్రత్యేకం

# కార్పొరేట్ల ప్రయోజనాలకే జిఎస్టీ



రచయిత జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ)లో ఆర్థశాస్త్ర విభాగ ప్రొఫెసర్

**సురజిత్ మజుందార్**

కీర్తిశేషులు చుక్కపల్లి పిచ్చయ్య 88వ జయంతి సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) – ప్రజలపై ప్రభావం అన్న అంశంపై జరిగిన సెమినార్‌లో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ)లో ఆర్థశాస్త్ర విభాగ ప్రొఫెసర్ సురజిత్ మజుందార్ చేసిన ప్రసంగ పాఠాన్ని మార్చిస్తు పాఠకులకు అందిస్తున్నాం ...... ఎడిటర్

**భా**ష, సంస్కృతీ సాంప్రదాయాల మాదిరిగానే ఆర్థికంగా కూడా భిన్నత్వం కలిగియున్న దేశంలో రాత్రికి రాత్రే సమూల మార్పులు తీసుకొచ్చేందుకు తొందరపడటం అప్రజా స్వామికం. సంస్కృతీపరంగా విభిన్నత్వం కలిగి యున్న దేశాలతో పోల్చినా చాలా దేశాల కంటే భారత్‌లో ఆర్థికపరంగా చూసినప్పుడు చాలా వైరుధ్యం కనిపిస్తుంది. ఇలాంటి దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడమంటే అది రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రతను దెబ్బతీయడం, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్గించడమే అవుతుంది. ప్రస్తుతమున్న పన్నుల వ్యవస్థతో పోల్చి జీఎస్టీ ప్రయోజనాలు, లోపాల చర్చను పక్కనబెడితే భారత ఆర్థికరంగం ఎదుర్కొంటున్న పన్నుల సమస్యతో సహా ప్రధాన సమస్యలకు తొందర పాటుగా తీసుకొస్తున్న ఈ విధానం వల్ల ఏ మాత్రమూ పరిష్కారం లభించదు.

అధికార వికేంద్రీకరణ జరగాల్సిన సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తిని కాలదన్ని, జియస్‌టి ద్వారా కేంద్రీకృత విధానం అమలు చేయాలనుకోవడమే వివాదస్పదమైన అంశం. ఇలాంటి నేపథ్యంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని అనుకున్నప్పుడు, సులభంగా అమలు చేసేటువంటి వాతావరణం ఉన్నా కూడా పూర్తి స్థాయిలో సంసిద్ధత లేకుండా పూనుకోవడం తప్పు. ప్రస్తుతమున్న విధానాలంటే కొత్త విధానంలో భవిష్యత్‌లో తలెత్తే ఇబ్బందులేమిటనే ఆలోచన కూడా చేయకుండా, ఏ మాత్రం సన్నద్ధత లేకుండానే తీసుకొచ్చిన జీఎస్టీ ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాల్జేసిన 'నోట్ల రద్దు' కంటే భిన్నమైన నిర్ణయ మేమీ కాదు.

నోట్లరద్దులో లావాదేవీలు జరగకుండా నిలిపేయడం, నగదు అందుబాటులో లేకుండా చేయడం వంటి తీవ్రమైన ఆంక్షల వల్ల ఆర్థిక గందరగోళ పరిస్థితిని మనం చూశాం. జీఎస్టీలో ఈ గందరగోళం అనేది కాస్త విభిన్నంగా ఉంటుంది. మన దేశంలో చేసిన ఆర్థిక సంస్కరణలన్నీ అనిశ్చితితో కూడినవే. వ్యాపార నిర్ణయాలు సంశయాలతోనే కూడి వుంటాయి. ప్రస్తుతమున్న పరిస్థితులను పరిగణలోకి తీసుకొని భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను, ఆశించే ప్రతిఫలాలను ఊహించి నిర్ణయాలు తీసుకుంటాం. అంటే ఆ నిర్ణయ ప్రక్రియే సంశయాలతో కూడివుంటుంది. ఈ నిర్ణయ ప్రక్రియపై ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల ప్రభావముంటుంది. ఇప్పుడు జీఎస్టీని ప్రవేశపెట్టడం వల్ల ఈ నిర్ణయాల ప్రక్రియలో అనిశ్చితి మరింతగా పెరిగిపోతుంది. చట్టాలు, నిబంధనలు రూపొందించేవారు, ఆమోదించేవారు కొందరయితే..వారి ఆలోచనలతో ఏమాత్రం సంబంధం లేని మరికొంత మంది వ్యక్తులు వాటిని అమల్జేస్తారు. ఆ చట్టాలు, నిబంధనల ప్రభావానికి గురయ్యే వ్యక్తులు వేరే ఉంటారు. ఇవన్నీ కూడా ప్రస్తుత పరిస్థితులు, అందుబాటులో ఉన్న చట్టాల పరిధికి లోబడి ఏం చేయకూడదు, ఏం చేయవచ్చు అనే న్యాయపర సలహాలు తీసుకొని అమల్జేస్తుంటాం. అందువల్ల మొత్తం వ్యవస్థలోనే సమూల మార్పులు చేయాలని అనుకున్నప్పుడు చరిత్ర వెనుకకు వెళ్లి అనుభవాలను తెలుసుకోవాలి. ప్రస్తుతమున్న వ్యవస్థ యొక్క సంక్లిష్ట స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. అది పాలకుల నుంచి ప్రజలు ఆశించేది. కానీ ప్రభుత్వ చర్యలలో కానీ, తీసుకొస్తున్న నిబంధనల్లో కానీ ఏ మాత్రం స్పష్టత కనిపించదు. ఆర్థిక సంక్షోభం, నోట్లరద్దు వంటి చర్యల నేపథ్యంలో జీఎస్టీని తీసుకొచ్చేందుకు సానుకూల వాతావరణమేదీ కనిపించదు.

ఒకే దేశం ఒకే పన్ను అనే ఆలోచనతో జీఎస్టీ విధానం సిద్ధాంతపరంగా రాతప్రతుల్లో బాగానే కనిపించవచ్చు. కానీ లెక్కా పత్రాల్లేని లావాదేవీలు అత్యధికంగా జరిగే భారతదేశం లాంటి సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థకు ఇలాంటి ఏకీకృత పన్నుల విధానం ఏమాత్రం పొసగదు. వాస్తవంగా చేయాల్సిందేమిటి? లెక్కపత్రాలు లేకుండా జరుగుతున్న లావాదేవీలు ఏమిటి? ఏ లావాదేవీలను అలా అనుమతించాలి. అధికారికంగా పన్ను కట్టి జరిపే లావాదేవీలు ఏమిటి? అనే దానిపై ముందు స్పష్టత ఉండాలి. ఇప్పుడు జీఎస్టీ అమలులో కొరవడినది ఈ స్పష్టతే. ఇలాంటి అనిశ్చితితో కొత్త విధానాన్ని తీసుకురావడం వల్లే న్యాయపరమైన చిక్కులు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలా న్యాయపరిధిలోకి నిర్దిష్ట లావాదేవీలు వెళ్లిన తర్వాత వాటికి సంబంధించిన రంగాలు మళ్లీ అనిశ్చితిలోకి పడిపోతాయి. భవిష్యత్తులో తలెత్తే సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకం లేదు. అందువల్ల ముందు ఈ అనిశ్చితి నుంచి బయటపడి స్పష్టత కల్పించాలి. పరోక్ష పన్నుల విధానానికి సంస్కరణగా తీసుకొస్తున్న జీఎస్టీ మూలాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పెరుగుతాయని చెబుతున్నారు అంటే పరోక్ష పన్నుల ద్వారా ఆదాయాలను పెంచుకోవడానికే జీఎస్టీని అమల్లోకి తెస్తున్నారనేది స్పష్టం. మొత్తం పన్నుల్లో పరోక్ష పన్నుల వాటాను, అంటే జీఎస్టీ ద్వారా ప్రజలపై భారాలను మరింతగా పెంచేస్తారన్నమాట.

సాధారణంగా కొత్త విధానాలను తీసుకొచ్చేటప్పుడు చూపించే గణాంకాలు, పరిమాణాలు సానుకూలంగా కనిపిస్తాయి. జీఎస్టీని ఆమోదించేవాళ్లంతా చెప్పేదేమిటి? ప్రస్తుతం ఉన్న అన్ని విధానాలకంటే జీఎస్టీ చాలా సమర్థవంతమైన విధానమని, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధికి


> "సాధారణంగా కొత్త విధానాలను తీసుకొచ్చేటప్పుడు చూపించే గణాంకాలు, పరిమాణాలు సానుకూలంగా కనిపిస్తాయి. జీఎస్టీని ఆమోదిం చేవాళ్లంతా చెప్పేదేమిటి? ప్రస్తుతం ఉన్న అన్ని విధానాలకంటే జీఎస్టీ చాలా సమర్ధవంతమైన విధానమని, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధికి తోడ్పడుతుందని చెబుతారు. మరి ప్రతికూల ప్రభావాల మాటేమిటి? దీనిపైన ఎవ్వరైనా స్పష్టత ఇస్తున్నారా?"

తోడ్పడుతుందని చెబుతారు. మరి ప్రతికూల ప్రభావాల మాటేమిటి? దీనిపైన ఎవ్వరైనా స్పష్టత ఇస్తున్నారా? విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను కూడా ఇదే ప్రాతిపదికలతో తీసు కొచ్చేరు. మరి అదేమైంది. వ్యవస్థీకృతమైన కసరత్తు చేయకుండా ఏ విధానం తీసుకొచ్చినా అది మరింత అనిశ్చితికిలోకి నెడుతుందే మినహా ఒరిగేదీమీ ఉండదు. జీఎస్టీ తీసుకురావడంలో ప్రాథమికంగా కొరవడినది ఈ అంశంమే. ఏమన్నా అంటే ఇదే ట్రెండ్ అని సెలవిస్తున్నారు. అమెరికా లాంటి పెద్ద దేశాల్లోనే జీఎస్టీ అమల్జే యడం లేదు. కానీ జీఎస్టీ గొప్పదనీ, ఇప్పుడున్న అన్ని పన్ను విధానాలకంటే సమర్థవంతమైనదని, దానిని తక్షణమే అమల్లోకి తెచ్చేయాలంటూ బహుళజాతి సంస్థలు చేసిన ఒత్తిడి ఫలితంగానే జీఎస్టీ తీసుకొచ్చారు. భారతదేశం లాంటి వైవిధ్యభరితమైన దేశంలో జీఎస్టీని తీసుకు రావాలంటే రాజకీయంగానూ ఏకాభిప్రాయం సాధించాల్సివుంటుంది. ఎక్కువ ఆదాయం కల్పిస్తామనే భరోసాతో కొన్ని రాష్ట్రాలు మినహా దాదాపు అన్ని రాష్ట్రాలను జీఎస్టీకి ఒప్పిం చగలి గారు. దీనికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. కానీ వాస్తవంలో జరగబోయేదేమిటి? వీరు చెప్తున్న ఆదాయం రాష్ట్రాలకు ఎలా వస్తుందనేది చెప్పడం లేదు. దీనికోసం ఇప్పటి వరకు మీరు చేసిన ఏరాట్లు చెప్పడం లేదు. వ్యవస్థాగతంగా చేసిన నిర్దిష్ట పరిశోధనేంటంటే నోరు మెదపరు. జీఎస్టీ వల్ల నల్లధనం తగ్గుతుందని, పన్ను ఎగవేత దారులకు చెక్ పెడతామని, ఆదాయాలు రెట్టింపు చేస్తా మని, జిడిపి పెరుగుతుందని మభ్యపెడు తున్నారు. ఈ ప్రక్రియనంతా కాసేపు పక్కన పెడదాం. లాభాలు దండుకోవాలనే తీవ్రమైన ప్రయత్నం ఒకటి జరుగుతోంది. ఆ ప్రయత్నం యొక్క ప్రమాదమేంటి? అంతర్జాతీయ స్థాయి లతో పోలిస్తే దేశంలో జిడిపి చాలా తక్కువగా ఉ ందనీ, అందువల్ల పన్నులేయక తప్పదని చెబుతున్నారు. ఈ పన్నులు ఎవరిపైన వేయాలి? తద్వారా వచ్చే ఆదాయాన్ని ఎవ్వరికి పంచాలి? సమస్య ఉత్పన్నమౌతున్నదిక్కడే. ఇటీవల చేపట్టిన 'నోట్ల రద్దు' నిర్ణయం వల్ల కానీ, ఇప్పుడు తీసు కొచ్చిన జీఎస్టీ వల్ల కానీ చేస్తున్నదేమిటి? జనాభాలో అత్యధిక మందిపై భారాలు మోపి, స్వల్ప సంఖ్యలో ఉండే కొద్దిమందికే లాభాలు దక్కేలా చేస్తున్నారు. ఎక్కువ లాభాలు దండుకో వాలని చూసేవారి ప్రయోజనాల దిశగా వ్యవ స్థను నడపడమంటే సామాజికంగా పతనమ వ్వడమే. ఈ ప్రయోజనాల దిశలోనే జీఎస్టీని తీసుకొచ్చారు. వాస్తవంగా లాభాలు దండుకునే కార్పొరేట్ రంగం నుంచి ప్రత్యక్ష పన్నులు రాబట్టి తద్వారా వచ్చే ఆదాయాలను పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం జీఎస్టీ రూపంలో దానికి విరుద్ధంగా చేస్తోంది. కార్పొరేట్ రంగం నుంచి పన్నులు రాబట్టకుండా వాటికే ఆదా యాలు దక్కేలా పన్నుల వ్యవస్థను జీఎస్టీ రూపం లో సంస్కరిస్తోంది. తక్కువ మంది ఉన్న కార్పొరేట్‌లపై పన్ను భారం పడకుండా ఆ భారా న్ని మరింత విస్తరించి ఎక్కువ మంది ప్రజా నీకంపైన మోపుతోంది. కార్పొరేట్ ప్రపంచం లోనూ, వ్యాపారాల స్థాయిల్లో హెచ్చుతగ్గు లుంటాయి. సంపద పరంగా అంద రూ ఒకే పరిమాణంలో ఇమిడివుండరు. వీరిలోని కొద్దిమంది కోసమే అధిక మొత్తంలో పన్నుల మినహాయింపు లభించేలా జీఎస్టీ తీసుకొస్తు న్నారు. ఆ కొద్దిమంది ప్రయోజనాల కోసమే దేశం మొత్తంపై ఈ భారాలు మోపేం దుకు సిద్ధమ య్యారు. సాదారణంగా ఏ దేశం లోనైనా జరిగే ఆర్థిక కార్యకలాపాల వల్ల ఆ దేశ ఆదాయం పెరగాలి.

ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలను మిన హాయిస్తే వెలుపల జరిగే అన్ని ఆర్థిక కార్యకలా పాలపైనా పన్నుల రూపంలో ఆదాయం ఉత్పత్తి అవుతుంది. ప్రతి ఆర్థిక చర్యలోనూ ఎంతో కొంత ఆదాయ ఉత్పత్తి జరుగుతుంది. ఎక్కువ మందికి ఆయా దశల్లో ఆదాయం పంపిణీ అవు తుంది. ఇలా లభించే ఆదాయంపై కట్టే పన్ను ప్రత్యక్ష పన్ను అవుతుంది. అంటే ప్రభుత్వా నికి ఆయా దశల్లో లభించే ఆదాయా లపై ఆయా దశల్లో ఆ ఆదాయాలు పొందేవారు ప్రత్యక్ష పన్ను కడతారు కాబట్టి ప్రస్తుత విధానం ప్రత్యక్ష పన్నుల భారం పంచుకోబడుతుంది. కానీ జీఎస్టీ అలా కాదు. ఏకీకృత పన్ను అయినం దున ఒకే చోట పన్ను కట్టాలి. కాబట్టి భార మంతా నేరుగా ప్రజలపైనే పడుతుంది. మధ్య లో అమ్మకాలు, కొనుగోళ్లు జరిపినప్పుడు వ్యాపా రులకు లభించే ఆదాయాలపై ఆయా వ్యాపా రులు కట్టాల్సిన ప్రత్యక్ష పన్నుల భార మంతా కూడా నేరుగా వినియోగదారులపైనే పడు తుంది. ఎవరి ప్రయోజనాలు ఆశించి జీఎస్టీని తీసుకొచ్చారనేది ఈ సూక్ష్మ పరిశీలన లోనే అర్థమైపోతుంది.

మన దేశ పన్నుల ఆదాయంలో ఉన్న ప్రధాన సమస్య ఏమిటంటే.. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల పరోక్ష పన్నుల రూపంలో ఇప్పటికే తీవ్ర మైన అన్యాయం జరుగుతోంది. ప్రత్యక్ష పన్నుల కంటే రెండింతలు ఎక్కువ ఆదాయాన్ని పరోక్ష పన్నుల ద్వారా ప్రజల నుంచి పిండు తున్నారు. పరోక్ష పన్నులకు సంస్కరణ తీసుకొస్తున్న జీఎస్టీ ద్వారా పన్నుల విస్తరణ పెంచడమంటే దానర్థం ప్రస్తుతం ప్రజలు చెల్లిస్తున్న పరోక్ష పన్నుల భారాన్ని పెంచడమే అవుతుంది. ప్రత్యక్ష పన్నుల ద్వారా కార్పొరేట్ రంగంపైనా, సంపన్ను లపైనా వేయాల్సిన పన్నులను నిర్లక్ష్యం చేయడం ద్వారా సామాజిక వివక్ష పాటిస్తున్నారు. అభివఅద్ధి చెందిన దేశాల్లో మూడింట ఒక వంతే పరోక్ష పన్నులుంటే, మన దేశంలో అందు కు భిన్నంగా రెండొంతులున్నాయి. ఒక వంతే ప్రత్యక్ష పన్నులు న్నాయి. వినియోగదారులపై విధించే పరోక్ష పన్నుల వల్ల భారం ఎక్కువగా ఉంటోంది. స్థూల జాతీయ వఅద్ధిరేటు ఎక్కువ గా ఉండాలంటే వినియోగదారులపై భారాన్ని తగ్గించి, కార్పొరేట్ పన్ను ఎగవేతదారుల నుంచి ప్రత్యక్ష పన్నుల్ని వసూలు చేయాలి. దేశంలో దాదాపు 7.5లక్షల కంపెనీలు రిజిస్టర్ చేసుకుంటే, సుమారు 250 బడా కార్పొరేట్ కంపెనీలకే ఆదాయం వస్తుంది. ఆదాయంలో 50 శాతం నుంచి 54 శాతం వరకు ఆ కంపెనీ లకే ఉంటోంది. వాటి నుంచి ప్రభుత్వం ఆదాయపు పన్ను వంటి ప్రత్యక్ష పన్నులు వసూలు చేయకపోగా, తిరిగి వారికే పన్నులో రాయితీ లిస్తుంది. ప్రత్యక్ష పన్నులకు, పరోక్ష పన్నులకు చాలా తేడా ఉందన్నారు. ఒక వస్తువును తయారు చేసే కంపెనీ పన్ను చెల్లిం చాలి. కానీ అది అమ్మే వ్యాపారి, కొనే వినియోగ దారుడు కూడా పన్ను చెల్లించేలా చేయడం జీఎస్టీ ఉద్దేశం. ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే, వారి ఒత్తిడితోనే జీఎస్టీ తీసుకొచ్చారనేది నా నిశ్చితాభిప్రాయం. ❋

# అక్టోబర్ విప్లవానికి మార్గం వేసిన ఫిబ్రవరి విప్లవ విజయం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఆర్. అరుణ్ కుమార్**

**1917** అక్టోబర్ లో చారిత్రాత్మకంగా జయప్రదమైన మహా సోషలిస్ట్ విప్లవానికి 1917 ఫిబ్రవరి లోని విప్లవం ఒక ముఖ్యమైన మైలురాయి. 1905 విప్లవం విఫలమ యినప్పటికీ సోషలిస్టు విప్లవానికి ఇది ఓ గుర్తించదగ్గ మూలమలుపు, ఒక పూర్తిస్థాయి కసరత్తు. 1905 విప్లవం సఫలం కాకపోయినా 1917 బూర్జువా

ప్రజాస్వామ్య విప్లవం విజయవంతమైంది . ఇదే అక్టోబర్ సోషలిస్ట్ విప్లవం జయప్రదమవడానికి తోలి అడుగు. 1905 విప్లవం వైఫల్యం చెందినప్పటికీ , రాజు దగ్గరినుండి కొన్ని ముఖ్యమయిన వెసులు బాట్లు పొందగలి గింది. రష్యా రాజకీయ ముఖ చిత్రాన్నే పూర్తిగా మార్చేసింది . 1905 అనుభవాలు రష్యా సోషల్ డెమొక్రాట్లకు ముఖ్యమయిన పాఠాలను నేర్పించింది. వారికీ 1917 లో జరగబోయే విప్లవానికి సరైన వ్యూహాలు రూపొందించుకు నేందుకు సహకరించింది. 1917 జనవరి తొలి దినాలలో ఒకచోట ఉపన్యసిస్తూ లెనిన్,'' ప్రజా బాహుళ్యంలో బ్రహ్మాండమయిన రాజ కీయ , విప్లవ చైతన్యం జాగృతం చేయడమే 1905 విప్లవం ప్రాముఖ్యత” అని అన్నారు. సామ్రాజ్యవాద యుద్ధం మొదలవగానే విప్లవోద్యమంలోని స్తబ్దత సమసిపోతుందని ఏంతో నమ్మకంగా చెప్పారు. ‘యూరప్ విప్లవాన్ని గర్భాన ధరించిందని ‘ కొల్లగొట్టే పనిలోనే ఉన్న ఈ యుద్ధం కార్మిక వర్గ నాయ కత్వంలో తిరుగుబాట్లకు దారితీస్తుందని, అంతి మంగా సోషలిజం విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు.

ఇంతటి ఆశావాదంతో చెప్పిన లెనిన్ కూడా తన మాటలు ఇంత తొందరగా వాస్తవరూపం దాలుస్తాయని ఊహించలేదు. రష్యన్ ప్రజలలో, ముఖ్యంగా కార్మికవర్గంలో అసంతృప్తి పొంగి పొరలడంతో దేశంలో తిరిగి కొత్తగా విప్లవ పరిస్థితులు ఏర్పడ్డాయి.

1917 సంవత్సరమే జనవరి 9 సమ్మెతో మొదలయింది. ఆ రోజు కార్మికులు సమ్మెకు దిగారు. పెట్రోగ్రాడ్, మాస్కో, బాకు, నిజ్ని - నోవ్‌గోరోడ్ లాంటి

పెద్ద పెద్ద పట్టణాలన్నింటా నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. మాస్కోలో మూడింట ఒకవంతు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ప్రపంచ యుద్ధ సమయమంతటిలోకి అతిపెద్దదయిన సమ్మె పెట్రోగ్రాడ్‌లో జరిగింది. సాధారణ సమ్మె మరోసారి ప్రాచుర్యం పొందనారంభించింది. రష్యన్ పార్లమెంట్ (డ్యూమా ) ప్రారంభమయే ఫిబ్రవరి 14 వ తేదీ కార్మికులు పార్లమెంటుకు నిరసన తెలుపుతూ ఊరేగింపుగా వెళ్లాలని మెన్షివిక్కులు ప్రతిపాదించారు. కానీ బోల్షివిక్కులు ఊరేగింపుగా వెళ్ళేబదులు ప్రదర్శనను ఏర్పాటు చేయాలనీ

ప్రతిపాదించారు. కార్మికవర్గ సంఘాలు బోల్షివిక్కుల ప్రతిపాదనని అనుసరించాయి. 1917 ఫిబ్రవరి 18 వతేదీ పెట్రోగ్రాడ్ లోని' పుటిలోవ్ వొర్క్స్ ‘ లో జీతాలు పెంపుదల కోరుతూ , తొలగించిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరుతూ సమ్మె ప్రారంభమయింది. ఫిబ్రవరి 22 వ తేదీ ఇందుకు ప్రతిస్పందనగా యాజమాన్యం లాక్ అవుట్ ప్రకటించింది. అదే రోజు దాదాపు అన్ని పెద్ద కర్మాగారాలు సమ్మెలోకి దిగాయి. వేలాది కార్మికులు కోపోద్రిక్తులై రోడ్ల పైకి వచ్చి ర్యాలీలు నిర్వహించారు. చాలీచాలని రేషన్ రొట్టెకోసం పడిగాపులు పడుతున్న మహిళల ఆగ్రహం వీరికి తోడ యింది. ఈ కలయికే విస్ఫోటానికి దారితీసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఫిబ్రవరి 23, (మార్చి 8, పాత రష్యన్ క్యాలెండరులో ఫిబ్రవరి 23 అవుతుంది ) పెట్రోగ్రాడ్ బోల్షివిక్ శ్రామిక మహిళా కమిటీ వీధులలోకి వచ్చి ఆకలికి, యుద్ధనికి, రాచరికానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. పెట్రోగ్రాడ్ కార్మికవర్గం ఈ ప్రదర్శనకి మద్దతుగా పట్టణంలో సమ్మె పిలుపు నిచ్చింది. ఆ విధంగా సాధారణ రాజకీయ సమ్మె రాచరికానికి వ్యతిరేక సమ్మె స్వభావాన్ని సంతరించుకుంది. ఫిబ్రవరి 24 వ తేదీ 2,00,000 మంది కార్మికులు – పెట్రోగ్రాడ్ కార్మిక వర్గంలో సగానికి పైనే – సమ్మెలో పాల్గొన్నారు. ఫ్యాక్టరీ సమావేశాలు, ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయి. విప్లవం ప్రారంభమయింది. ఫిబ్రవరి 25 వ తేదీకల్లా పెట్రోగ్రాడ్‌లోని కార్మికవర్గం అంతా




ఫిబ్రవరి విప్లకంలో ప్రజా వెల్లువ

> " ఫిబ్రవరి విప్లవం గురించి మాట్లాడుతూ లెనిన్, "విప్లవం కార్మిక వర్గం వలననే సాధ్యపడింది. కార్మికవర్గం నాయకత్వాన్ని ప్రదర్శించింది, రక్తం చిందిం చింది, తనతో పాటు అశేష కష్టజీవులను పేద ప్రజలను తోడ్కొని పోయింది" అన్నారు "

యినవారిని నిర్బంధించడానికి ఆంగ్లో ఫ్రెంచ్ కుట్ర, సామ్రాజ్యవాద యుద్ధం కొనసాగించేందుకు అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, యుద్ధాన్ని మరింత భయంకరంగా, మూఢంగా కొనసాగించడం, గుచ్కోవ్ కాన్‌స్టాంటినోపుల్‌ను స్వాధీనం చేసుకోవడానికి లక్షలాది మంది రష్యన్ కార్మికులను కర్షకులను బలిచేయడం, ఫ్రెంచ్ పెట్టుబడిదారులు, సిరియా, బ్రిటిష్ పెట్టుబడిదారులు, మెసపొటేమియా మొదలయినవి ఒకవైవు ఉన్నాయి. మరో వైపు విప్లవ విప్లవోద్యమంలో చేరిపోయింది. ప్రదర్శనలు, పోలీసులతో కొట్లాటలతో అంతా అట్టుడికి పోయింది. 'రాజు నశించాలి', యుద్ధం నశించాలి', ఆహారం కావాలి', అన్న నినాదాలతో నిండిన బ్యానర్లు ఎక్కడ బడితే అక్కడ దర్శనమిచ్చాయి. ఫిబ్రవరి 26 వ తేదీ తెల్లవారి సమ్మె తిరుగుబాటు రూపాన్ని సంతరించుకుంది. కార్మికులు పోలీసులను నిరాయుధులను చేసి తాము సాయుధులయ్యారు. అత్యంత వేగంగా మారుతున్నా పరిమాణాలు, ఉవ్వెత్తున ఎగసిపడుతున్న విప్లవం చూసి రాజు ఫిబ్రవరి 25వ తేదీ జనరల్ ఖబలోవ్‌కు రాజదానిలో చెలరేగుతున్న అశాంతిని ఒక్క రోజులోగా అదుపు చేయాలనీ ఆదేశాలిచ్చారు. జనరల్ ఖబలోవ్ పెట్రోగ్రాడ్ మిలిటరీ ప్రాంతానికి కమాండర్. అందువలన ఫిబ్రవరి 28 వ తేదీ లోగా పనిలో చేరకపోతే యుద్ధభూమికి పంపిస్తానని బెదిరించాడు. ఫిబ్రవరి 26 వ తేదీ పావ్లోవిస్కీ రెజిమెంట్‌లోని నాల్గవ రిజర్వు బెటాలియన్‌కి కాల్పులు జరిపి కార్మికుల విప్లవ స్ఫూర్తిని అణచివేయమని ఉత్తర్వ్యాలు జారీ అయ్యాయి. సైనికులు కాల్పులయితే జరిపారు గాని కార్మికుల పైన కాదు. సైనికులు కార్మికుల వైపుకు చేరి బలవంతంగా కార్మికులను చెదరగొడుతున్న పోలీసు బలగాలపైన కాల్పులు జరిపారు. ఇదే ఓ మలుపు. సైనికులలో యుద్ధరంగంలోనూ వెలుపలా, ఏంతో ఓర్పుతో బోల్షివిక్కులు చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. శ్రామిక మహిళలు కూడా వీరికి తోడయి ప్రత్యక్షముగా రాజు ఆధిపత్యాన్ని కూలదోయడానికి ప్రజలకు సహకరించవలసిందిగా సైనికులకు విజ్ఞప్తి చేసారు. ఈ ప్రయత్నాలన్నింటి వలన సైనిక బెటాలియన్లు నెమ్మదిగా తమ మద్దతును మళ్లించాయి. కార్మికులు సైనికులతో కలసి తిరగబడి రాజు యొక్క మంత్రులను, జనరల్స్‌ని నిర్బంధించి, విప్లవకారులను ఖైదుల నుండి విడిపించారు. ఇదే రాజు ఆధిపత్యానికి గండికొట్టింది. పెట్రోగ్రాడ్ లోని ఈ విప్లవ విజయంతో ఇతర అన్ని ప్రాంతాలలోని కార్మికులు, సైనికులు, రాజు యొక్క అధికారులను ఎదిరించడం ప్రారంభించారు. ఆ విధంగా ఫిబ్రవరి బూర్జువా –ప్రజాతంత్ర విప్లవం సఫలీకృతమయింది. బోల్షివిక్కులు ఏళ్ల తరబడి, ముఖ్యంగా యుద్ధ సమయంలో ఎంతో ఓర్పుతో ఆందోళన, ప్రచారం చేయడం వలననే ఫిబ్రవరి విప్లవం విజయవంతమయింది. ఫ్యాక్టరీలలోనూ, సైనిక శిబిరాలలోను సమ్మె చేస్తున్న లేదా ప్రదర్శనలు చేస్తున్న వారికి బోల్షివిక్ కార్మికులు గట్టి నాయకత్వాన్ని అందించారు. ఫిబ్రవరి విప్లవం గురించి మాట్లాడుతూ లెనిన్, "విప్లవం కార్మిక వర్గం వలననే సాధ్యపడింది. కార్మికవర్గం నాయకత్వాన్ని ప్రదర్శించింది, రక్తం చిందిం చింది, తనతో పాటు అశేష కష్టజీవులను పేద ప్రజలను తోడ్కొని పోయింది'.




కార్మికవర్గానుద్దేశించి ప్రసంగిస్తున్న లెనిన్

ఫిబ్రవరి విప్లవం తొందరగా విజయవంతమవడానికి కారణం " ఒక ప్రత్యేకమయిన చారిత్రిక పరిస్థితులు, పూర్ధి భిన్నమయిన ఒరవడులు, పూర్తిగా భిన్నమయిన వర్గ ప్రయోజనాలు, సామాజిక పోరాటాలు, అన్ని కలిసి మహత్తరమయిన పొందికగా మిళితమయ్యాయి. అంటే మిల్యూకోవ్, గుచ్కోవ్, మొదల స్వభావం కలిగిన కార్మికుల, ప్రజల పెద్ద ఉద్యమాలు( పట్టణం లోని దేశం లోని అత్యంత పేదలందరి ఉద్యమాలు ), రొట్టె కోసం, శాంతి కోసం, నిజమయిన స్వేచ్ఛ కోసం". దేశాన్నిఎన్నో రోజుల నుండి ఆర్ధికంగా పాలిస్తున్న పెట్టుబడిదారీవర్గానికి , 'రాజుని మట్టి కరిపించేందుకు ఒక దెబ్బ వేయడం అవసరం'. ఫిబ్రవరి విప్లవం ఆ పని చేసింది. తద్వారా రాజ్యాధికారం పొందే వీలయింది. దానితో పాటే ఫిబ్రవరి విప్లవం కార్మిక, సైనిక సోవియట్లను, అంటే –సమాజం లోని కార్మికుల, పేద ప్రజల ప్రయోజనాలను వ్యక్తీకరించే, ' ఇంకా అభివృద్ధి చెందని బలహీన మైన ప్రభుత్వం', ప్రారంభమవడానికి సహాయపడింది. ఇది రెండు అధికార కేంద్రాలకు తావిచ్చింది – బూర్జువాజి నాయకత్వం లోని తాత్కాలిక ప్రభుత్వానికి, విప్లవానికి నాయకత్వం వహించిన కార్మిక సైనిక సోవి యట్స్‌కి మధ్య వైరుధ్యం ఏర్పడింది. ఈ వైరుధ్యం1917లో అక్టోబర్ విప్లవం విజయం సాధించి, బూర్జువా తాత్కాలిక ప్రభుత్వాన్ని పడగొట్టడం ద్వారా పరిష్కరించబడింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# ఇంటా బయట ట్రంప్ ప్రమాదకర పోకడలు



రచయిత సిపిఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు, మార్క్సిస్టు ఎడిటర్

**ఎస్. వెంకట్రావు**

ఎన్నికల ముందు 'అమెరికా ఫస్ట్' (అమెరికాకే తొలిప్రాధాన్యత) అన్న నినాదంతో ప్రజల ఓట్లు కొల్లగొట్టిన మితవాద నాయకుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం క్రమంగా మారుతోంది. మన దేశంలో నరేంద్ర మోడీ చేసినట్టే ఆయనా ఎన్నికల్లో ప్రజలకు చాలా వాగ్దానాలు చేసి ఇప్పుడు ప్లేటు ఫిరాయించడమే కాదు రోజుకో మాట చెబుతూ గందరగోళం సృష్టిస్తున్నాడు. 'మేకిన్ అమెరికా' నినాదంతో వస్తూత్పత్తి రంగాన్ని తిరిగి అమెరికాకు తీసుకొస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఈ నినాదం చైనాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాడు. సాఫ్ట్ వేర్ ఉద్యోగాల్లో అమెరికన్లనే తీసుకుంటానన్నాడు. ఇతర దేశాల నుండి అమెరి కాకు సాఫ్ట్‌వేర్ నిపుణుల వలసను అడ్డుకుంటా నన్నాడు. ఈ నినాదం భారత్‌కు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిందే. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే వచ్చేట్లు చూస్తానన్నాడు. అమెరికాలోకి వలస వచ్చేవారిపైనా, ముస్లింలపైనా ద్వేషం రెచ్చ గొట్టాడు. ఆర్థిక అంతరాలు, పేదరికం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్న అమెరికాలో ప్రజలను ఈ నినాదాలు బాగా ఆకట్టుకున్నాయి.



వీటికన్నా మించి ఆయన సైనిక రంగంలో చేసిన నినాదాలు ప్రజలను మరింత ఆకర్షించాయి. నాటో కూటమికి అయ్యే ఖర్చు అమెరికా ఒక్కటే భరించకూడదు నాటో దేశాలన్నీ భరించాలన్నాడు. దక్షిణ కొరియాలోనూ, తూర్పు ఆసియాలోనూ అమెరికా సైనిక స్థావరాల ఖర్చులు అక్కడ లబ్ధి పొందుతున్న దేశాలు కూడా భరించాలన్నాడు. ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా దళాలుండడం దండగ అన్నాడు. ఆఫ్ఘన్ యుద్ధంలో బరాక్ ఒబామా విధానాన్ని దునుమాడాడు. పనికి మాలిన ఆఫ్ఘనిస్థాన్ యుద్ధంలో మన సైనికులు చనిపోవడం తగదన్నాడు. అక్కడ తిష్టవేసి ఉన్న 8000 మంది అమెరికా సైన్యాన్ని వెనక్కి పిలిపించాలన్నాడు.

ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదం ద్వారా వాల్‌స్ట్రీట్ బడా పెట్టుబడిదారీ కంపెనీల పట్ల, యుద్ధం పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకున్నాడు. అమెరికాకు పూర్వ వైభవం తెస్తానన్న నినాదంతో ప్రజల సెంటిమెంటును అనుకూలంగా మలచుకున్నాడు. కానీ గద్దెనెక్కిన వెంటనే ఆయన ప్రజల ఆశలు వమ్ము చేయడమే కాదు, ఇంటా బయట మరింత ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు.

ఒకవైపు దేశంలో పచ్చి మితవాద శక్తులను ఉపయోగించుకుని పార్లమెంటేతర ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నాడు మరోవైపు పరిపాలనలో సైనిక, ఫైనాన్స్ కార్పొరేట్ శక్తులకు పెద్ద పీట వేసి ప్రపంచ వ్యాపితంగా ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నాడు.

### ఫాసిస్టు శక్తులకు ఊతం

అమెరికాలో నయా–నాజీలకు, పచ్చి మితవాద శక్తులకు ట్రంప్ మద్దతును ఇటీవల వర్జీనియా రాష్ట్రంలోని చార్లొట్టెస్‌విల్లెలో జరిగిన ఘటన వెల్లడిస్తోంది.

చార్లొట్టెస్‌విల్లెలో 19వ శతాబ్దానికి చెందిన జాత్యహంకార నాయకుడు రోబర్ట్ ఇ. లీ విగ్రహం తొలగింపునకు నిరసనగా తెల్లజాతి దురహంకారులు ఆగస్టు 11వ తేదీన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలకు నిరసనగా అన్ని జాతుల వారు ఐక్యంగా అదేచోట ఆగస్టు 12 న శాంతి ప్రదర్శనకు పూనుకున్నారు. ఈ ప్రదర్శనకు నల్లజాతి, హిస్పానిక్స్, తెల్లజాతి వారు, ఇతర అనేక జాతులకు చెందిన వేలాది మంది హాజరయ్యారు. ప్రదర్శనపై తెల్లజాతి దురహంకారులు ఒక పథకం ప్రకారం దాడి చేశారు. "మితవాదుల ఐక్యతా రాలీ" పేరుతో దాడికి దిగిన వారు సైనిక దుస్తులతో ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ ఆయుధాలు పట్టుకుని వచ్చారు. వారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు పెన్స్ ఫోటోలు పట్టుకున్నారు. ట్రంప్ ఇచ్చిన 'అమెరికా ఫస్ట్' నినాదాలు రాసిన ప్లకార్డులు, స్వస్తిక్ చిహ్నాలు పట్టుకుని జాత్యహంకార నినాదాలు చేశారు. యూదు, ముస్లిం, వలసవాదులను దూషిస్తూ శాంతి ప్రదర్శకులపై దాడికి దిగారు. వీరిలో నయా –నాజీలు, తెల్లజాతి దురహంకారులు, కు క్లక్స్ క్లాన్ సభ్యులు, వివిధ ఉగ్రవాద గ్రూపులకు చెందినవారు ఉన్నారు. దాడిని పోలీసులు చూస్తూ ఉండిపోయారుగాని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ లోగా ఒక తెల్లజాతి దురహంకారి శాంతి ప్రదర్శకుల మీదికి కారును వేగంగా పోనిచ్చాడు. అందులో హీదర్ హేయర్ అనే యువతి మృతి చెందగా 19 మంది గాయపడ్డారు. ఇది అమెరికా అంతర్గత టెర్రరిస్టు చర్య అని అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ అభివర్ణించాడు.

కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఈ టెర్రరిస్టు చర్యను ఖండించకపోగా 'రెండు

"ఈ విధంగా పార్లమెంటునూ, కోర్టులనూ, చట్టాలనూ ధిక్కరిస్తూ పాలించాలనుకుంటున్న ట్రంప్ తన సొంత మితవాద సైన్యాన్ని సమ కూర్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడని పరిశీలకులు భావిస్తున్నారు. చార్లొట్టెస్‌విల్లెలో సెమీ సైనిక దుస్తుల్లో తుపాకులు పట్టుకుని శాంతి ప్రదర్శనపై దాడికి దిగిన నయా-నాజీ, తెల్లజాతి దురహం కారులకు ఆయన బహిరంగంగా మద్దతు తెలపడం వెనుక ఈ వ్యూహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని చెబుతున్నారు."

వైపులా" ఉన్న విద్వేషం, మూఢత్వం, హింసా కాండలను ఖండిస్తున్నట్లు ప్రకటించాడు. ఆ తరువాత తన ప్రకటనను సమర్థించుకునే క్రమంలో కూడా ఆయన అన్ని జాతులతో కూడిన శాంతి ప్రదర్శకులనూ, తెల్లజాతి దురహంకార నయా-నాజీ ఉగ్రవాదులనూ ఒకే గాటన కట్టడంతో అమెరికాలోనూ, విదేశాల్లోనూ తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరికి ఆయన ప్రభుత్వం లోనే పలువురు ట్రంప్ వైఖరిని వ్యతిరేకించారు. తన సొంత రిపబ్లికన్ పార్టీలో అనేకమంది నాయకులు ట్రంప్ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

టెర్రరిస్టు సంస్థలకు ట్రంప్ మద్దతు వెనుక వ్యూహం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆయన రెండు పార్టీల వ్యవస్థ ఉన్న అమెరికాలో తన దంటూ ఒక నిరంకుశ, పార్లమెంటరీయేతర సంస్థను నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారు. రిపబ్లికన్, డెమోక్రాటిక్ పార్టీల వ్యవస్థలు ట్రంప్ నియంతృత్వ పోకడలకు అడ్డు వస్తున్నాయి. అలాగే పార్లమెంటులోని రెండు సభలు, కోర్టులు కూడా ఆయన నిరంకుశ పోకడలకు కళ్లెం వేస్తున్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు ముస్లిం దేశాల నుండి ప్రజలెవ్వ రినీ అమెరికా రాకుండా వీసాలు తిరస్కరించాలని ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీనిపై ఇంటా, బయటా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇస్లామా ఫోబియాను అధ్యక్షుడే ప్రోత్సహిస్తున్నాడని పలువురు పేర్కొన్నాడు. దీన్ని అమెరికా ఫెడరల్ కోర్టు, అనేక రాష్ట్రాలు తిరస్కరించాయి. దాంతో తన ఆదేశాన్ని అమలు చేయడానికి ఆయన కోర్టులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించాడు.

మెక్సికో నుండి అమెరికాకు ప్రజలు వలస రాకుండా రెండు దేశాల మధ్య 3,300 కిలోమీటర్ల పైన గోడ కట్టేస్తానని ట్రంప్ ఎన్నికల ముందూ, తరువాత ప్రకటించాడు. గోడకట్ట డానికి భారీగా నిధులు కావాలి. అసలే దివాళా స్థితిలో ఉన్న అమెరికా ఖజానా దానికి ఒప్పుకో



ఆగస్టు 12న చార్లొట్టెస్‌విల్లెలో జరిగిన అన్ని జాతుల ఐక్య శాంతి ప్రదర్శన

వడం లేదు. అందుకని ఆయన నిర్ణయానికి అమెరికా పార్లమెంటు బ్రేకులు వేస్తోంది. దాన్ని సహించలేని ట్రంప్, అక్టోబర్ 1 తో ప్రారంభ మయ్యే ఆర్థిక సంవత్సరంలో గోడ నిర్మాణానికి పార్లమెంటు నిధులు మంజూరు చేయకపోతే ఫెడరల్ నిధుల బిల్లును వీటో చేసి, మొత్తం పరిపాలననే స్తంభింపజేస్తానని బెదిరించాడు. ఆగస్టు 22న ఆరిజోనా రాష్ట్రంలోని ఫోయెనిక్స్‌లో జరిగిన సభలో ఈ బెదిరింపులకు దిగడంతో పాటు అరగంట పాటు ఆయన చేసిన ప్రసంగంలో ఆగస్టు 12న చార్లొట్టెస్‌విల్లెలో జరిగిన ఉగ్రవాద దాడిపై తన వైఖరిని సమర్థించుకోడానికే ఎక్కువ సమయం కేటాయించాడు. తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నాయని పత్రికలపై ధ్వజమెత్తాడు. వలసవచ్చిన ప్రజలను అనవసరంగా అరెస్టులు చేయిస్తున్నందుకు గాను కోర్టులు నేరస్తుడుగా ప్రకటించిన ఆరిజోనా షెరీఫ్ జోయ్ ఆర్పిర్పాయోకు తను క్షమాభిక్ష పెడతానని ప్రకటించాడు.

ఈ విధంగా పార్లమెంటునూ, కోర్టులనూ, చట్టాలనూ ధిక్కరిస్తూ పాలించాలనుకుంటున్న ట్రంప్ తన సొంత మితవాద సైన్యాన్ని సమ కూర్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడని పరిశీలకులు భావిస్తున్నారు. చార్లొట్టెస్‌విల్లెలో సెమీ సైనిక దుస్తుల్లో తుపాకులు పట్టుకుని శాంతి ప్రదర్శనపై దాడికి దిగిన నయా-నాజీ, తెల్లజాతి దురహం కారులకు ఆయన బహిరంగంగా మద్దతు తెలపడం వెనుక ఈ వ్యూహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని చెబుతున్నారు. నిజానికి ట్రంప్ ప్రభుత్వ వర్గాల మద్దతుతోనే చార్లొట్టెస్‌విల్లెలో ఫాసిస్టుల ప్రదర్శన జరిగిందని చెబుతున్నారు.

## ప్రభుత్వంలో సైనిక, ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు

ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంలోని ప్రధాన స్థానాల్లోకి మాజీ సైనికాధికారులను తీసుకున్నాడు. రిటైర్డ్ జనరల్ జెమ్స్ మట్టిన్‌ను రక్షణ మంత్రిగా నియమించాడు. మట్టిస్‌ను అందరూ "మాడ్ డాగ్" (పిచ్చికుక్క) మట్టిస్ అంటారు. ఇరాక్‌లోని ఫల్లూజా నగరం లో వేలాది ప్రజలను పిచ్చికుక్కలా ఊచకోత కోయించాడాయన. రిటైర్డ్ మెరైన్ జెనరల్ జాన్ కెల్లీని ట్రంప్ అంతర్గత రక్షణ శాఖ మంత్రిగా నియమించాడు. జాతీయ భద్రత మంత్రిగా రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఫ్లిన్‌ను నియమించాడు. ఈయన ముస్లిం వ్యతిరేకి. ఇస్లామ్‌ను కాన్సర్‌తో అభివర్ణించాడు. వీరితోబాటు ట్రంప్ మంత్రివర్గంలో 9 మంది రిటైర్డ్ సైనికాధికారులున్నారు.

ట్రంప్ ప్రభుత్వాన్ని శతకోటీశ్వరుల ప్రభుత్వంగా అభివర్ణిస్తారు. వాల్‌స్ట్రీట్ శతకోటీశ్వరులతో ఆయన మంత్రివర్గాన్ని నింపేశాడు. అమెరికా చరిత్రలో మొట్టమొదటి శతకోటీశ్వరుడైన అధ్యక్షుడు ట్రంప్. ఆయన తోబాటు మరో ఇద్దరు శతకోటీశ్వరులు, ఒక డజను మంది కోటీశ్వరులూ ఆయన మంత్రి వర్గంలో ఉన్నారు. అంతా కలిపి 6100 కోట్ల డాలర్ల (సుమారు 4.27 లక్షల కోట్ల రూపాయల) సంపద పోగుచేసుకున్న ధనికులు ట్రంప్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. వీరిలో చాలా మందికి గతంలో ప్రభుత్వంలో ఉన్న అనుభవం లేదు. ట్రంప్ మంత్రివర్గంలోని కోటీశ్వరుల్లో చాలా మందికి వాల్‌స్ట్రీట్ ఫైనాన్స్ పెట్టుబడితోనూ, కార్పొరేట్ అమెరికాతోనూ దగ్గరి సంబంధాలున్నాయి. అంతేకాదు ఆయన

మంత్రివర్గం అత్యధికంగా తెల్లజాతీయుల తోనూ, పురుషులతోనూ నిండి ఉంది. ట్రంప్ మంత్రివర్గాన్ని ఇతర అధ్యక్షుల మంత్రివర్గాలతో పోల్చి చూపే కింది పట్టిక చూస్తే తేడా అర్థమవుతుంది:

| అధ్యక్షుడు | పురుషులు | తెల్లజాతివారు | ప్రభుత్వఅనుభవం | మాజీ జనరల్స్ | శతకోటీశ్వరులు |
|---|---|---|---|---|---|
| జార్జి బుష్ | 83% | 74% | 96% | 4% | 0% |
| బరాక్ ఒబామా | 65% | 52% | 87% | 4% | 0% |
| డొనాల్డ్ ట్రంప్ | 82% | 82% | 59% | 9% | 9% |

### మళ్లీ యుద్ధ నాదాలు

ఒకవైపు దేశంలో ఫాసిస్టు శక్తులకు ఊతమిస్తూ మరోవైపు సైనిక జనరల్స్, ఫైనాన్స్ కార్పొరేట్‌లతో కూడిన మంత్రివర్గంతో ట్రంప్ ప్రపంచ వ్యాపితంగా ఉద్రిక్తతలు రెచ్చగొడు తున్నాడు. గత అధ్యక్షుల హయాంలో కూడా అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధ నౌకలు, డబ్బు మూటలతోనే ప్రపంచ పెత్తనానికి తరలి వెళ్లింది. కానీ పౌర ప్రభుత్వానికీ, సైన్యా నిక–ఫైనాన్స్ వ్యాపారానికీ మధ్య చిన్న గీత ఉండేది. ట్రంప్ హయాంలో ఆ గీత కూడా చెరిగిపోయింది.

> “ ట్రంప్ ఆఫ్ఘనిస్థాన్‌పై చేసిన యుద్ధ ప్రకటన ఒక్క ఆఫ్ఘనిస్థాన్‌ను ఉద్దేశించిందే కాదు. దీనిలోకి ఆయన భారత్ పాకిస్థాన్‌లను లాగాడు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్‌కు ఆఫ్ఘన్ యుద్ధంలో అవకాశాలు తగ్గించి భారత్‌కు ఎక్కువ పాత్ర ఇస్తానని ప్రకటించాడు. మన దేశ పాలక వర్గాలు దీనికే చాలా సంబర పడుతున్నాయి. ”



నాజీ స్వస్తిక్ జెండాలు, ఆయుధాలతో తెల్లజాతి దురహంకారుల ప్రదర్శన, శాంతి ప్రదర్శనపైకి దూసుకు పోతున్న కారు

దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం అనుభ విస్తున్న అమెరికన్లకు విలువైన వనరులను యుద్ధం మీద, సైనిక స్థావరాల మీద ఖర్చు చేయడం పట్ల యావగింపు ఉండేది. దీన్ని ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన ట్రంప్ త్వరలోనే తన స్వరం మార్చేస్తున్నాడు. ఆఫ్ఘని స్థాన్‌లో సుదీర్ఘ యుద్ధం చేస్తామని ఇటీవల ఆయన చేసిన ప్రకటనే దీనికి నిదర్శనం. ఒకవైపు దేశంలో నయా–నాజీలకు మద్దతిస్తున్న సమయంలోనే ఆగస్టు 21నాడు ట్రంప్ జాతీయ టెలివిజన్‌లో మాట్లాడుతూ తన కొత్త ఆఫ్ఘనిస్థాన్ విధానాన్ని ప్రకటించాడు. 16 సంవత్సరాలుగా అమెరికా ఆయుధ దాడులతో తల్లడిల్లుతున్న ఆఫ్ఘనిస్థాన్‌లో యుద్ధాన్ని మరింత విస్తరిస్తామని ట్రంప్ ప్రకటించాడు. బరాక్ ఒబామా ఆ దేశం నుండి దళాలను ఉపసంహరించుకున్నట్లు ప్రక టిస్తే ట్రంప్ మరింత మంది అమెరికన్ సైన్యాన్ని పంపుతున్నట్లు ప్రకటించాడు. ఎన్నికల సమయం లో ‘ఆఫ్ఘన్ యుద్ధం దండగ, అమెరికా దళాలను పూర్తిగా ఉపసంహరించుకోవాలి’ అన్న తన విధానం నుండి ఆయన పూర్తిగా యు టర్న్ తీసుకున్నాడు. 2001లో న్యూయార్క్ ట్విన్ టవర్స్‌పై దాడి అనంతరం నాటి అధ్యక్షుడు జార్జి బుష్ ఆఫ్ఘన్‌పై యుద్ధం ప్రకటించాడు. నాటి నుండి నేటి వరకు ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా సైన్యం ఆఫ్ఘనిస్థాన్‌లో 1.75 లక్షల మంది ప్రజలను చంపింది. పది లక్షల మంది ఇళ్లు విడిచి వలసలు పోయారు. వేల మంది అమెరికా సైనికులు కూడా చనిపోయారు. ఈ యుద్ధకాండ పట్ల దేశ ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో అనంతమైన ఈ యుద్ధం నుండి బయటపడాలని చెబుతూ ఒబామా సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకుంటామని ప్రకటించాడు. 2010–11 నాటికి ఆ దేశంలో లక్షమంది అమెరికా సైన్యం ఉండేది కాస్తా ఒబామా హయాం చివరి నాటికి 8500 మందికి తగ్గిపోయింది. ఈ సైన్యం కూడా నేరుగా తిరుగుబాటుదారులతో తలపడకుండా ఆఫ్ఘనిస్థాన్ సైన్యానికి శిక్షణ, మద్దతు ఇచ్చేందుకే ఉంచు తున్నట్లు ప్రకటించారు. ఆ సైన్యాన్ని కూడా వెనక్కి పిలవాలని ఎన్నికల ముందు పదే పదే పిలుపునిచ్చిన ట్రంప్ ఇప్పుడు కొత్త విధానం మరింత మంది సైన్యాన్ని ఆ దేశంలోకి పంపుతున్నట్లు తెలిపాడు. గత ప్రభుత్వాల్లాగా ఎంత సైన్యాన్ని పంపుతున్నదీ తెలపనన్నాడు. ఆ సైన్యం ఆఫ్ఘనిస్థాన్‌లో ఎంతకాలం ఉంటుందో చెప్పనన్నాడు. గత అధ్యక్షులు ఆఫ్ఘనిస్థాన్ అభివృద్ధి కోసమే సైన్యాన్ని పంపుతున్నట్లు చెప్పేవారు. ట్రంప్ ఆ ముసుగు కూడా తొలగించి “ఆఫ్ఘన్ నిర్మాణం కోసం కాదు ఉగ్రవాదులను చంపడం కోసమే మన సైన్యం అక్కడుంటుంది” అని ప్రకటించాడు. యుద్ధానికి “అవసరమైన అన్ని రకాల పరికరాలనూ, నిబంధనలనూ మీకు తోడుగా” ఇస్తానన్నాడు.

> “ ఉత్తర కొరియాపై యుద్ధానికి ట్రంప్ చేస్తున్న సన్నాహాలు తూర్పు ఆసియాలో తీవ్ర ఉద్రిక్తతలు సృష్టిస్తున్నాయి. దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి అమెరికా నిత్యం ఈ ప్రాంతంలో యుద్ధ విన్యాసాలు చేపట్టడం, దానికి ప్రతిగా ఉ. కొరియా క్షిపణు లను పరీక్షించడం, అణు పరీక్షలు జరపడంతో కొరియా ద్వీపకల్పం ఉద్రిక్తమయంగా మారింది. ”

ఆసియా, ఐరోపాలను కలిపే సిల్క్ రోడ్ ప్రాజెక్టులో ఆఫ్ఘనిస్థాన్ చేరితే దానిపై అమెరికా పట్టు జారిపోతుంది. అందుకే ఆఫ్ఘనిస్థాన్ స్థావరంగా ఈ ప్రాంతంపై పట్టు సాధించడం కోసం అమెరికా ప్రయత్నిస్తోంది. ట్రంప్ ఆఫ్ఘన్‌లో యుద్ధాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తానని ప్రకటించడానికి కారణం ఇదే. చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను ఎక్కుపెట్టేందుకు ఆయన కొత్త ఆఫ్ఘన్ విధానంలో పాక్‌ను తప్పించి భారత్‌కు పెద్ద భాగస్వామ్యం కల్పిస్తు న్నాడని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే రక్షణ మంత్రికి, సైనిక జనరల్స్‌కు “అపరిమిత అధికారాలు” ప్రకటించాడు. ట్రంప్ ఆఫ్ఘనిస్థాన్‌పై చేసిన యుద్ధ ప్రకటన ఒక్క ఆఫ్ఘనిస్థాన్‌ను ఉ ద్దేశించిందే కాదు. దీనిలోకి ఆయన భారత్ పాకిస్థాన్‌లను లాగాడు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్‌కు ఆఫ్ఘన్ యుద్ధంలో అవకాశాలు తగ్గించి భారత్‌కు ఎక్కువ పాత్ర ఇస్తానని ప్రకటించాడు. మన దేశ పాలక వర్గాలు దీనికే చాలా సంబర పడుతున్నాయి.



ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా అమెరికా ద.కొరియాలు కలిసి నిర్వహిస్తున్న యుద్ధ విన్యాసాలు

కానీ ఆఫ్ఘనిస్థాన్ సమస్యకు సైనికంగా పరిష్కారం కుదర్చాలంటే మరో 16 ఏళ్లకు కూడా సాధ్యం కాదన్న విషయం ఈ నేత లందరికీ తెలియంది కాదు. అక్కడి ప్రజల్లోని జాతుల విభజన, వారి మధ్య వైరం దీనికి కారణం. దేశంలోని ప్రజల్లో 40 శాతం మంది ఫస్తూన్ తెగలకు చెందిన వారు. వీరు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటారు. తాలిబాన్ రిక్రూట్‌లలో వీరే ప్రధానమైన వారు. 30 శాతంగా ఉన్న తజక్ తెగలవారు పట్టణ ప్రాంతాల్లో ఉంటారు. చదువు సంధ్యలు కలిగి ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉ న్నారు. ఆఫ్ఘన్ సైన్యంలో ఎక్కువ మంది వీరే. 20 శాతం వరకు హజారా షియేతలు, 10 శాతం మంది ఉజ్బెక్ తెగలు ఉన్నారు. అమెరికా ఆఫ్ఘనిస్థాన్‌కు అందిస్తున్నట్లు చెబుతున్న నిధులన్నీ ఆ దేశం మీద బాంబులు వేయడానికే సరిపోతున్నాయి. ఆఫ్ఘన్ ప్రభుత్వానికి అందే నిధులు ప్రధానంగా ప్రభుత్వంలో ఉండే తజక్‌లకు చేరుతున్నాయి. ఇక్కడ విపరీతమైన అవినీతి జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో యుద్ధ ప్రభువుల మాటే చెల్లుతుంది. తాలిబాన్లు స్థానిక ప్రజలకు రక్షణ కల్పిస్తారు కాబట్టి వారి మాటే వేదంగా సాగుతుంది. ప్రభుత్వంలో ఉండే తజక్ రాజకీయ వేత్తలు భారత్‌కు అనుకూలంగా ఉంటారు. ఫస్తూన్ నాయకులు పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉంటారు. నిజానికి పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుకు రెండు వైపులా ఫస్తూన్‌ల బంధుత్వాలుంటాయి. ఈ ప్రాంతాన్ని కలిపి ఫస్తూనీస్థాన్ ఏర్పాటు చేయాలనేది వీరి కోరిక. తెగల మధ్య సామరస్యం కుదర్చడం ద్వారా, తాలిబాన్లను ప్రభుత్వంలోకి తీసుకు రావడం ద్వారా ఆఫ్ఘన్‌లో శాంతి సాధించాలన్న ప్రయత్నాలు ఒబామా హయాం నుండీ సాగుతు న్నాయి. అమెరికా నాయకత్వంలో జరిగే ఈ శాంతి చర్చల్లో పాల్గొనే తాలిబన్ల కోసం కతర్ లో ఒక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా జరుగుతుండగానే ట్రంప్ యుద్ధం ద్వారా – అది కూడా ఎప్పటికి ముగుస్తుందో చెప్పలేని యుద్ధం ద్వారా ఆఫ్ఘనిస్థాన్ సమస్యకు పరిష్కారం చేకూరుస్తానని చెప్పడంలో ఆంతర్యం ఏమిటి?

వాస్తవానికి ఆఫ్ఘనిస్థాన్‌లో ట్రంప్ కొత్త విధానం వెనుక ‘ఒన్‌బెల్ట్ ఒన్‌రోడ్’ పేరుతో చైనా ఈ ప్రాంతంలోని దేశాలమధ్య వాణి జ్యాన్ని అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ప్రాజెక్టును అడ్డుకునే వ్యూహం దాగుందనేది విశ్లేషకుల అభిప్రాయం. చైనా నాయకత్వంలోని షాంఘై సహకార సంస్థలో చైనా, రష్యాతో బాటు మధ్య ఆసియాలోని పలు దేశాలు ఉన్నాయి. ఆఫ్ఘనిస్థాన్ ప్రస్తుతం పరిశీలకుని హోదాలో ఉంది. త్వరలోనే దానికి శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ఆఫ్ఘనిస్థాన్‌లో తిష్టవేసి ఉన్న 12,000 మంది నాటో దళాలకు తోడు మరిన్ని మంది దళాలు, వనరులను పంపాలని ట్రంప్ నాటోను కూడా డిమాండ్ చేశాడు.

### కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తత

ఉత్తర కొరియాపై యుద్ధానికి ట్రంప్ చేస్తున్న సన్నాహాలు తూర్పు ఆసియాలో తీవ్ర ఉద్రిక్తతలు సృష్టిస్తున్నాయి. ఉత్తర కొరియా అణు కార్య క్రమాన్ని రద్దు చేసుకుంటే దానిపై ఆంక్షలు ఎత్తివేయాలని గతంలో అమెరికా–ఉ.కొరి యాల మధ్య 6 దేశాల కూటమి సమక్షంలో కుదిరిన ఒప్పందం నుండి అమెరికా వైదొ లగటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి అమెరికా నిత్యం ఈ ప్రాంతంలో యుద్ధ విన్యాసాలు చేపట్టడం, దానికి ప్రతిగా ఉ. కొరియా క్షిపణు లను పరీక్షించడం, అణు పరీక్షలు జరపడంతో కొరియా ద్వీపకల్పం ఉద్రిక్తమయంగా మారింది. ఉల్చి–ఫ్రీడమ్ గార్డియన్ యుద్ధ విన్యాసాల పేరుతో అమెరికా, ద.కొరియాలు సరికొత్తగా భూమి మీద, సముద్రంలో, గాలిలో పెద్ద ఎత్తున యుద్ధ క్రీడలు ప్రారంభించాయి. 30,000 మంది అమెరికా సైన్యం, 50,000 మంది ద.కొరియా సైన్యం పాల్గొంటున్న ఈ విన్యాసాలు

మొత్తం ఉ.కొరియా, చైనాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవే కావడం గమనార్హం. ఉద్రిక్తతలు పెంచే ఈ యుద్ధ విన్యాసాలు నిలిపేయాలని ఉ.కొరియా, చైనాలు ఎంతగా విజ్ఞప్తి చేసినా అమెరికా వినలేదు. దానికి ప్రతిగా ఆత్మరక్షణ కోసం ఉ.కొరియా క్షిపణి ప్రయోగాలు నిర్వహిస్తుంటే సామ్రాజ్యవాదులు గగ్గోలు పెడుతున్నారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఉ.కొరియాపై మరింత ఎక్కువగా కాలుదువ్వడమే కాదు దానికి మద్దతిస్తోందన్న పేరుతో చైనా మీద కూడా ఆంక్షలు ప్రకటించాడు. ఉత్తర కొరియా బూచిని చూపించి ద.కొరియాలో అత్యాధునిక క్షిపణి వ్యతిరేక థాడ్ వ్యవస్థలను నెలకొల్పడం వివాదానికి దారితీసింది. నిజానికి ఉత్తర కొరియా వద్ద ఉన్న అణుబాంబులు కేవలం 100 లోపు మాత్రమే. దాని క్షిపణుల సామర్థ్యం కూడా అమెరికా తీరాన్ని తాకలేవు. కానీ అమెరికా వద్ద 7000 అణు బాంబులున్నాయి. వాటిలో 1700 బాంబులు ప్రయోగానికి సిద్ధంగా ఉన్నాయి. నేలమీద, నీటిలో సబ్ మెరైన్లపైనా, యుద్ధ నౌకలపైనా ఉన్న క్షిపణులు, యుద్ధ విమానాల సామర్థ్యంతో పోలిస్తే ఉ.కొరియా క్షిపణుల, అణుబాంబుల సామర్థ్యం ఏ మూలకూ సరిపోదు. అయినా సామ్రాజ్యవాద ప్రచార సాధనాలు ఉ.కొరియాను అణు భూతంగా చిత్రిస్తున్నాయంటే అసలు లక్ష్యం ఉ.కొరియా కాదు, చైనా. ఉ.కొరియాకు చైనాకు మధ్య 1961లో కుదిరిన రక్షణ ఒప్పందం ప్రకారం ఒక దేశం మీద దాడి జరిగితే మరో దేశం తనకు రక్షణగా రావాలి. ట్రంప్ అధికారంలోకి రాగానే ఉ.కొరియా సర్వనాశనం చేసే పథకాన్ని ప్రకటించాడు. "ఫైర్ అండ్ ఫ్యూరీ" అని దీనికి పేరు పెట్టాడు. ట్రంప్ దుష్ట వ్యూహాన్ని గ్రహించిన చైనా ఉ.కొరియా విషయంలో తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించింది. దాని సారాంశం ఏమంటే: "అమెరికా-ద.కొరియా సైనిక విన్యాసాల నుండి ఆత్మరక్షణ కోసమే అయినా ఉ.కొరియా చేస్తున్న అణు, క్షిపణి ప్రయోగాలను ఆపడానికి చైనా ప్రయత్నిస్తుంది. కానీ ఈ పేరుతో ఉ.కొరియాను ఏ దేశమైనా దురాక్రమణ చేయాలని ప్రయత్నిస్తే చైనా తటస్థంగా ఉండబోదు, జోక్యం చేసుకుంటుంది." చైనా నుండి స్పష్టమైన ఈ ప్రకటన వెలువడిన తరువాత ట్రంప్ తన 'ఫైర్ అండ్ ఫ్యూరీ' నుండి కొంత వెనక్కు తగ్గినప్పటికీ చైనాను నిలువరించే తన ప్రయత్నాలు మాత్రం మానుకోలేదు.

"చైనాను సైనికంగా చట్టుముట్టడానికి అమెరికా పన్నిన వ్యూహంలోకి జపాన్, దక్షిణకొరియా, భారత్, ఆస్ట్రేలియాలను కూడా లాగుతోంది. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడిచిపెట్టి అమెరికా యుద్ధ వ్యూహం లో జూనియర్ భాగస్వామిగా మారడానికి ఉవ్విళ్లూరుతోంది."



ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్: ఆత్మరక్షణ కోసం క్షిపణులు ప్రయోగించే ఉ.కొరియాను దుష్టరాజ్యంగానూ, కయ్యానికి కాలు దువ్వుతున్న అమెరికా తప్పులేనట్లు సామ్రాజ్యవాద ప్రచార సాధనాలు చిత్రీకరిస్తున్నాయి

చైనాను సైనికంగా చట్టుముట్టడానికి అమెరికా పన్నిన వ్యూహంలోకి జపాన్, దక్షిణకొరియా, భారత్, ఆస్ట్రేలియాలను కూడా లాగుతోంది. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడిచిపెట్టి అమెరికా యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మారడానికి ఉవ్విళ్లూరుతోంది.


ఎన్నికలకు ముందు రష్యాకు అనుకూలంగా మాట్లాడిన ట్రంప్ ఇప్పుడు రష్యాపైన కూడా కాలుదువ్వుతున్నాడు. యూరప్‌ను కలుపుకొని దానిపై ఆంక్షలు ప్రకటిస్తున్నాడు. సిరియాలో, ఉక్రెయిన్, ఇరాన్‌లలో అమెరికా దుష్టపన్నాగాలకు అడ్డుపడుతన్నందుకు గాను రష్యాపై విరుచుకు పడుతున్నాడు

**ఆర్థిక సంక్షోభం నుండి దృష్టి మళ్లించ దానికే**

2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం నుండి అమెరికా ఆర్థిక వ్యవస్థ బయట పడలేదు. అది ప్రపంచ వ్యాపిత సంక్షోభంగా మారింది. అమెరికాలో గత దశాబ్ద కాలంగా ఆర్థిక అంతరాలు, నిరుద్యోగం, దారిద్ర్యం విపరీతంగా పెరిగిపోయాయి. కార్మిక వర్గంలోనూ, ప్రజల్లోనూ అసంతృప్తి తీవ్రమవుతోంది. సమ్మెపోరాటాలు, ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ అసంతృప్తిని మళ్లించేందుకు పాలక వర్గాలు పచ్చి మితవాద శక్తులను ప్రోత్సహిస్తున్నాయి, దేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచుతున్నాయి.

సంక్షోభంతో అమెరికన్ సామ్రాజ్యవాదం బలహీనపడింది. దాని ఆర్థిక వ్యవస్థ ఊగిసలాటలో ఉంది. దాంతో ప్రపంచంపై దాని పట్టుకూడా సడలుతోంది. ఏకధృవ ప్రపంచాన్ని సవాలు చేసే శక్తులు ఊపందు కున్నాయి. చైనా, రష్యా వాటి నాయకత్వంలోని బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ), ఆసియా, ఐరోపా ఖండాలను కలుపుతూ చైనా నిర్మిస్తున్న సిల్క్ రోడ్ వాణిజ్య మార్గం... ఇవన్నీ అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి. మరోవైపు అమెరికాలో ఇటీవలి కాలంలో కార్మిక సమ్మెలు ఉధృతమవుతున్నాయి. వాల్‌స్ట్రీట్ వ్యతిరేక పోరాటాలు ముమ్మరమైనాయి. అన్ని జాతుల ప్రజలు కలిసికట్టుగా యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో నియంతృత్వాన్ని, ప్రపంచంలో యుద్ధాలనూ ప్రోత్సహించడం ద్వారా బయటపడాలని సామ్రాజ్యవాద పాలక పక్షాలు భావిస్తున్నాయి. ఇంటా బయట ట్రంప్ అనుసరిస్తున్న ప్రమాదకర విధానాలు అందులో భాగమే. ❋

# సంక్షోభ భయంలో ఐటీ


రచయిత ప్రముఖ పాత్రికేయుడు

**వి.శ్రీధర్**

భారత్ ఐటీ పరిశ్రమ దాదాపు 40 లక్షల మందికి నేరుగా ఉపాధి కలిగిస్తోందని నాస్కామ్ మాట. వీరిలో 60 శాతం మందికి నైపుణ్యాల విషయంలో తిరిగి శిక్షణనివ్వాలని ప్రచారం చేస్తున్నారు. కొన్ని కంపెనీలయితే ఆ పనిని మొదలుపెట్టినట్లు చెబుతున్నాయి. ఇది మామూలు విషయమే కదా అనుకోవచ్చు. కానీ సాంకేతిక మార్పిడి జరగబోతోందన్న, పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించబోతున్నారనే ప్రచారం గురించే కలవరింతల్లా. రోబోటిక్స్ ఆధారంగా నడిచే ఈ వ్యవస్థ లక్షలాది ఉద్యోగాలను తుంచేయబోతుందన్న చర్చ నడుస్తోంది. దేశ ఐటీ పరిశ్రమకు తీవ్ర సవాల్‌గా కంటే ఆ వృత్తిదారుల ఉపాధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తుందనే విషయమే ఇక్కడి ప్రధానాంశం. అమెరికా హెచ్-1బీ వీసాల గోల, కృత్రిమ మేధతో సేవలు అందించే రోబోట్స్, ఆటోమేషన్ ప్రభావం, అంతర్జాతీయంగా కనిపిస్తున్న ఆర్థిక స్తబ్ధత వంటి ఎన్నో సమస్యలు ఈ రంగ ఉద్యోగుల నిద్ర చెడగొడుతున్నాయి. బెంగళూరులోని సిలికాన్ వ్యాలీ మొదలుకొని ఇప్పుడిప్పుడే ఐటీ హబ్‌లుగా గుర్తింపు తెచ్చుకుంటున్న రెండో స్థాయి నగరాలకు చెందిన ఐటీ ఉద్యోగులనూ ఈ భయం వెన్నాడుతోంది. లక్షల సంఖ్యలో ఐటీ కొలువులు పోతాయని ఏ నివేదిక వచ్చినా కూడా భయంతో ఊగిసలాడుతోంది వీరి బతుకులే. ఆటోమేషన్ వల్ల 2021 నాటికి, అంటే మరో నాలుగైదేళ్లలో 4,80,000 ఉద్యోగాల్ని భారత్ నష్టపోతుందని అమెరికా నుంచి పనిచేసే హెచ్ఎఫ్ఎస్ అధ్యయనం వెల్లడించింది. మెకిన్సే అండ్ కంపెనీ రిపోర్ట్ ప్రకారం సగం మంది ఉద్యోగాలు రెండు మూడేళ్లలో 'అసంబద్ధమైనవి'గా పరిగణించబడతాయని పేర్కొంది. ఇదంతా కూడా కంపెనీలు నూతన సాంకేతికతను వినియోగించుకోవటానికి సన్నద్ధం కాకపోవడమే కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంపై ఉద్యోగులో ఆందోళనల్ని తగ్గించే విధంగా దిగ్గజ కంపెనీలు, నాస్కామ్ సరిగ్గా స్పందించకపోవడం ఆలోచనలో పడేస్తోంది. ఆటోమేషన్ ప్రభావం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు ఊడతాయో లేదోనన్న విషయంపై స్పష్టత ఇవ్వాల్సింది పోయి, 2025 నాటికి మరో 30 లక్షల ఉద్యోగాలు ఐటీ పరిశ్రమలో వస్తాయని చెప్పడం విస్మయపరిచే విషయం. రాబోయే కొలువులు ఏ స్థాయివి, పోయే ఉద్యోగాలు ఏ స్థాయివి అనే విషయంలో గందరగోళం తారాస్థాయికి చేరింది. కొలువుల కోతలు లక్షల్లో ఉంటాయనే దానిపైనే ముందుగా మాట్లాడాల్సి ఉంది. ఇదో మనుగడ సంక్షోభం. సరైన జవాబు లేకపోవడంతో ఈ భయం మరింత తీవ్రమై ఐటీ ఉద్యోగులు భద్రత లేని కొలువుల్లో ఉన్నామనే ఒత్తిడితో నలిగిపోతున్నారు. వేలకోట్ల రూపాయల వాణిజ్యం సాగే ఈ రంగ సంక్షోభం మిగతా రంగాల మీద కూడా గణనీయ ప్రభావం చూపిస్తుంది. ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తుంది. ఇలాంటి విషయంలో బాధ్యుల నుంచి సరైన జవాబుదారీతనం లేకపోవడమే ఉద్యోగుల ఆందోళనకు కారణం.

### ప్రత్యేకమనే ట్యాగ్ వదిలి...

దేశ ఆర్థిక సంస్కరణల ముద్దుబిడ్డగా, దేశ నూతన సాంకేతికతల ముఖచిత్రంగా పేర్కొనే సమాచార సాంకేతిక (ఐటీ) పరిశ్రమ మనుగడ రోజురోజుకీ సంక్షోభంలో కూరుకుపోతోంది. సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతుల కేంద్రాలైన భారత ప్రముఖ నగరాల నుంచి కొన్ని నెలల నివేదికలు ఇదే విషయాన్ని చెబుతున్నాయి. గత రెండు దశాబ్దాలను తీసుకుంటే ఐటీ వృత్తిదారుల సమాజంలోని అలజడి అంతకు ముందు లేనంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. భారత మేధావి తరగతిలోను ఇదే అభిప్రాయం ఉందని తెలుస్తోంది. 2001, 2008-09లలో పరిశ్రమ ఎదురుదెబ్బలు చూసినా ఈసారి ఉన్న పరిస్థితి తీవ్రమైంది. అది కొలువుల కోతల సంఖ్య పరంగా, ఎవరిని తీసేస్తారన్న ఆందోళనల పరంగా పూర్తి భిన్నమైనది. దీనిపై ఉద్యోగుల నుంచి నిరసన, స్పందన కూడా అంతకు ముందులా లేదు. ప్రతి ముఖ్య ఐటీ కేంద్రంలోనూ వారి తొలగింపుల్ని సవాల్ చేసే ప్రయత్నంలో సాఫ్ట్‌వేర్ వృత్తిదారులు కార్మిక యూనియన్లతో కలుస్తున్నారు. 'ఫోరమ్ ఫర్ ఐటీ ఎంప్లాయిస్' (ఫైట్) అదే ప్రయత్నం చేస్తోంది. బెంగళూరు, హైదరాబాద్, కోలకతా, న్యూఢిల్లీల్లో సంఘాలున్న ఈ సంఘంలో 600 మందికి పైగా ఐటీ వృత్తిదారులు పనిచేస్తున్నారు. ఇది మూడేళ్ల క్రితమే మొదలైంది. ఈ సభ్యుల మాటల్లో... రానున్న మూడేళ్లల్లో 20-25 శాతం వరకు అంటే దాదాపు పది లక్షల కొలువుల కోతలు ఉండబోతున్నాయనే ఆందోళన ఉంది. ప్రభుత్వానికి ఐటీ కంపెనీలు సమాచారం సరిగ్గా ఇవ్వకపోవడం, ఆ కంపెనీల్లో ఏం జరగబోతుందనే విషయాలపై స్పష్టత లేకపోవడం వృత్తిదారుల్లో భీతి కలిగిస్తోందని... వీటి మీదే తాము పోరాడుతున్నామని ఫైట్ చెబుతోంది. ఇలాంటి సంఘాలు ఏ స్థాయిలో ఉన్నాయి, నిలబడగలుగుతున్నాయా లేదా అనేది వేరే విషయం. ఏ రంగం వారి నుంచి అలాంటి పరిణామాన్ని అసలు ఊహించలేమో ఆ ఐటీ రంగ ఉద్యోగులు కూడా ఉద్యోగ భద్రత కోసం ఉద్యమించాల్సిన పరిస్థితులు తలెత్తడమనేది సంక్షోభముందనే విషయానికి ఊతమిచ్చేదే. దీన్నో ఉమ్మడి సమస్యగా తీసుకుని వారి 'ప్రత్యేక తరగతి' ట్యాగ్‌ను కూడా వదులుకోవాలనే అవసరాన్ని ఐటీ ఉద్యోగులు తెలుసుకోవడమనేది సంక్షోభానికి సంబంధించి పొరపాటుకు తావులేని సంకేతాల్ని ఇస్తున్నాయి.

### గతంతో పోల్చలేం

ఈ సంక్షోభపు ఆనవాళ్లు బయటపడ్డాక... జరుగుతున్న పరిణామాలపై బాధగా వున్నట్టు

ఆ రంగ దిగ్గజం ఎన్.ఆర్. నారాయణ మూర్తి లాంటి పెద్దలు గుప్తంగా స్పందించిన తీరు ఉంటోంది. కింది స్థాయి ఉద్యోగులను కాపాడటం కోసం... 2001లో ఇన్ఫోసిస్‌లో తాను తన సహచరులు చేసినట్టు కంపెనీలకు చెందిన ఉన్నత స్థాయివారు కొన్ని త్యాగాలు చేయాలని ఆయన సలహా ఇచ్చారు. పరిస్థితి తీవ్రత, దాని అడుగున క్రియాశీలకంగా పనిచేస్తున్న సమస్య గురించి మూర్తి అవగాహన సరిగ్గా లేనట్టు కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. అప్పటి పరిస్థితుల్ని పరికిస్తే... నేటి పరిస్థితిని 2001లో పేలిన అప్పటి 'డాట్.కామ్' బుడగతో పోల్చడం సమంజసం కాదు. ఎన్నడూ లేనంత స్థాయికి చేరిన 'గ్రేట్ ఆఫ్‌షోర్ బూమ్' మీద నిర్మితమై, నిలిచివున్న పరిశ్రమ ఊగిసలాటలో లక్షలాదిమంది ఉద్యోగుల భవితతో చెలగాటం ఉంది. ఇంకా చెప్పాలంటే, అప్పటి పరిశ్రమ చాలా చిన్నది. ఇప్పటిలా కోటిన్నర మందికి పైగా పోషిస్తున్నది కాదు.

“ పరిశ్రమ విస్తరించిన చెన్నై, హైదరాబాద్, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్), బెంగళూరు, పుణె, మరికొన్ని రెండో శ్రేణి నగరాల్లోను భారత ఐటీ సేవల కంపెనీలు వేలాది కొలువులను వదిలించుకునే ప్రక్రియలో ఉన్నట్టు చూచాయిగా తెలుస్తోంది. నివ్వెరపరిచేలా, పెద్ద కంపెనీల దృష్టంతా 10-15 ఏళ్ల ఉద్యోగానుభవమున్న మధ్యస్థాయి ఉద్యోగుల తొలగింపు మీదే ఉన్నట్టుగా కనిపిస్తోందని అభిప్రాయముంది. ”


హైదరాబాద్ హైటెక్ సిటీ

### మధ్యస్థాయి ఉద్యోగులే టార్గెటా?

పరిశ్రమ విస్తరించిన చెన్నై, హైదరాబాద్, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్), బెంగళూరు, పుణె, మరికొన్ని రెండో శ్రేణి నగరాల్లోను భారత ఐటీ సేవల కంపెనీలు వేలాది కొలువులను వదిలించుకునే ప్రక్రియలో ఉన్నట్టు చూచాయిగా తెలుస్తోంది. నివ్వెరపరిచేలా, పెద్ద కంపెనీల దృష్టంతా 10–15 ఏళ్ల ఉద్యోగానుభవమున్న మధ్యస్థాయి ఉద్యోగుల తొలగింపు మీదే ఉన్నట్టుగా కనిపిస్తోందని అభిప్రాయముంది. ఏ స్థాయిలో తొలగింపు ఉంటుందనేది, ఎక్కడ జరుగుతుందనేది కచ్చితంగా తెలీకపోవడానికి కారణం... నాస్కామ్ ధోరణే. బాగా స్పష్టంగా తెలిసే పరిశ్రమ స్థితిగతులపై జరుగుతున్న పరిణామాలపై సరైన సమాచారం అందిస్తే యుక్తంగా ఉంటుందని అటు కంపెనీలు కానీ, దాని ప్రధాన లాబీ అయిన నాస్కామ్ కానీ అనుకోకపోవడమే కారణం. పరిశ్రమ దిగ్గజాలు, అధినేతలు, కీలక వ్యక్తులు ఒకటే సానుభూతి రొద చేస్తున్నా చివరకు ఉద్యోగుల నైపుణ్యాల స్థాయినే తప్పుబడుతున్నారు. వేగంగా మారిపోయే సాంకేతికతకు తగ్గట్టు కావాల్సిన నైపుణ్యాల్లో కొరత ఉందనే నెపాన్ని ఉద్యోగుల మీదే నెడుతున్నారు. వీరందరికీ దశాబ్దాలుగా సాగుతున్న ఆటోమేషన్ అభివృద్ధి, పరిశోధనల గురించి తెలుసు. ఈ విషయంలో ఉద్యోగుల్ని సన్నద్ధుల్ని చేయాల్సిన ప్రక్రియ ఎప్పుడో మొదలెట్టాలి. ఏ రకమైన నైపుణ్యాల్ని వృద్ధి చేసుకోవాలనే స్పష్టత ఉద్యోగులకు తెలియజెప్పాల్సిన బాధ్యత వారిదే. అంతేకానీ తీరా సంక్షోభం వస్తుందనే దశలో తప్పును ఉద్యోగుల శక్తి, సామర్థ్యాలపై తోసేయడం సరైంది కాదు.

### ఆటోమేషన్ భయం

ప్రస్తుతం సమూల సాంకేతిక మార్పు హోరు ఎక్కువగా వినిపిస్తోంది. 2014లో గార్ట్నర్‌లాంటి విశ్లేషకులు ఆటోమేషన్ మీద స్పష్టమైన వాస్తవాల్ని వెలుగులోకి తెచ్చారు. నైపుణ్యంతో సంబంధంలేని పనే కాక జ్ఞానశక్తితో మనిషి చేసే పనులను కూడా భర్తీ చేసే అవకాశం ఆటోమేషన్ లాంటి నూతన సాంకేతికతలకు ఉంది. వాటి వల్ల ప్రతి మూడింటిలో ఒక ఉద్యోగం కోల్పోతారని ఊహించారు. కృత్రిమ మేధపై ఆధారపడే సేవల్లో నిపుణులైన సిడ్నీకి చెందిన స్టార్టప్ కంపెనీ రోబోనామిక్స్ ఏఐ వ్యవస్థాపకులు సమీర్ సిన్హా ఈ విషయంపై వివరణ ఇచ్చారు. దిగువ స్థాయి పనిని కూడా చేసే రాబోయే రోబోటిక్స్ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఆటోమేషన్ ఉద్యోగాల్ని కబళిస్తుందనే భయమే ఇప్పటి పరిస్థితికి కారణం. మరోవైపు ప్రముఖ భారత సాఫ్ట్‌వేర్ సేవల సంస్థలు షేర్ బైబ్యాక్‌ను ప్రారంభించడమో లేదా ఆ పనిలో ఉండటమో అన్నది ఆ రంగంలో ఊహకు అందని విషయమేదో జరగబోతోందనే సంకేతాల్ని ఇస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ తదితర నూతన సాంకేతికతల్ని తమ వ్యాపార మాతృకల్లో ఎంతవరకు ఐటీ కంపెనీలు చొప్పించాయనేదాన్ని పరిశ్రమ విశ్లేషకులు కొలవడం మొదలెట్టారు. భారత ఐటీ పరిశ్రమలో దాదాపు 30 శాతం ఉద్యోగాల్నిస్తున్న 5 ప్రధాన కంపెనీల నుంచే భారీస్థాయిలో కొలువుల కోతలు రాబోతున్నాయనే కథలు అందుకే వినిపిస్తున్నాయి. చిన్నస్థాయి

❝యు.ఎస్. కంపెనీలు ఒకప్పుడు ఆఫ్‌షోర్ ద్వారా ఖర్చుల్ని తగ్గించుకోవాలనుకున్నాయి. కానీ ఇప్పుడు అక్కడ పరిస్థితులు మారాయి. అమెరికా ఉద్యోగాల గురించి ఆందోళన తగ్గించే యత్నంలో ట్రంప్ ఫ్యాక్టర్ ఆటోమేషన్‌కు అనుకూలంగా పనిచేసే అవకాశం ఉంది. ఇది కూడా అక్కడి కంపెనీల ఖర్చుల్ని తగ్గించుకునేందుకే. సాఫ్ట్‌వేర్ సేవల పరిశ్రమలో రోబోటిక్ ఆటోమేషన్‌కు బహుశా ట్రంపే 'ఉత్తమ సేల్స్‌మెన్' అని సిన్హా పేర్కొన్నారు.❞

కంపెనీల్లోని ఉద్యోగులకు ఏం జరగబోతున్నదనేది మీడియా రాడార్‌లో కూడా లేనేలేదు.

**ఎంత వరకు ఆటోమేషన్!**

ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగుల నుంచి ఏం ఆశిస్తున్నాయనే దానిపై కంపెనీలు స్పష్టతనివ్వకపోవడం గుబులు పెంచుతోందని ఇన్‌సైడర్‌ల మాట. సాధారణ స్థాయిలో సాంకేతిక మార్పు వేగంపై చర్చించడం వరకు బాగానే ఉంది. కానీ దానిని అందుకునేందుకు తమ నుంచి ఏం కోరుకుంటున్నారో ఉద్యోగులకు చెప్పింది లేదని ఎక్కువగా వినిపిస్తోంది. రెవెన్యూలు, లాభాలు, మార్జిన్లు వంటి అంకెలతోనే తలమునకలైన కంపెనీలు సాంకేతిక మార్పులపై గుడ్డిగా వ్యవహరిస్తున్నాయని విమర్శలున్నాయి. ఐటీ దిగ్గజాలకు మరింత హానికరమైనది ప్రస్తుతమున్న ఈ డైలమానే. వేటికవే తమ సొంత వ్యూహాలతో ఆటోమేషన్ వంటి కొత్త సాంకేతికతల్లోకి అడుగుపెట్టాయి. కానీ వీటి వల్ల ఆఫ్‌షోరింగ్ రెవెన్యూలు దెబ్బతింటాయనే భయం వాటికి ఉంది. అందుకే కొన్నేళ్ల ముందు నుంచి సంసిద్ధం కావాల్సిన విషయాన్ని పక్కనపెట్టడమే కాక ఆటోమేషన్‌ను తమ డీఎన్ఏలో కలుపుకోడానికి అవి ప్రయత్నం చేయలేదు. కృత్రిమ మేధ మరింత తెలివైనది అయ్యే కొద్దీ, ప్రస్తుతం పరిశ్రమలో మనిషి చేస్తున్న పనిని తీసుకునే సామర్థ్యం పెరిగే కొద్దీ ఆటోమేషన్ పాత్ర పెరుగుతుంది. ఐటీ పరిశ్రమ ఆఫ్‌షోర్ అయినా మరో మాతృక మీద కొనసాగుతున్నా... ఏ విధంగా నిర్మితమైనా ఆటోమేషన్ జరిగిపోతుంది.

**అనుకూలతలు కలసిరావు**

ప్రస్తుతం ఆఫ్‌షోర్ అయిన విధుల్లో ప్రభావం చూపేంత పరిమాణంలో ఆటోమేషన్ పని చేస్తుందని అనుకుంటున్నారు. ఇది కింది, మధ్యస్థాయి ఉద్యోగాలపైనే ప్రభావం చూపిస్తుందని అనుకుంటున్నారు కానీ పైస్థాయివారికి ప్రత్యేక ప్రయోజనాల్ని, హక్కుల్ని ఇస్తుందనే గ్యారంటీ ఏం లేదు. ఆటోమేషన్ ఎందుకు భారత్ ఐటీ రంగం మీద ప్రభావం చూపుతుందన్న విషయం తెలియాలంటే ఇప్పటి వరకు మనకు ఆఫ్‌షోర్ బూమ్‌నిచ్చిన అంశాల్ని పరిశీలించాలి. ఇక్కడ ఎక్కువ మొత్తంలో ఆంగ్ల విద్య కలిగిన ఉద్యోగులు దొరుకుతారు. ఇండియాకు పశ్చిమ ప్రపంచానికి ఉన్న సమయ భేదం, అన్నింటికీ మించి చాలా తక్కువ ధరకే కోడింగ్ చేసే నిపుణులు వంటి పూర్వ ప్రయోజనాలు ఆటోమేషన్ వస్తే లెక్కల్లో లేకుండా పోతాయి. భారత్ నైసర్గిక అనుకూలతలు, వైవిధ్యాలూ పరిగణనలోకి రావు. సహేతుకంగా ఆశిస్తున్న పథంలోనే ఆటోమేషన్ ముందుకు సాగితే, పరిణతి చెందితే ఆఫ్‌షోర్ విధుల్లో ముఖ్యమైన వాటా ఉద్యోగులు చేయాల్సిన అవసరమే ఉండదు. మరింత వాస్తవంగా చూస్తే... మెషీన్ లెర్నింగ్, విశ్లేషణలతో ఆటోమేషన్ ఆచరణలోకి వస్తే ఆఫ్‌షోర్ పనినిచ్చే క్లైంట్ కంపెనీలు వాటి విధుల్ని సొంతంగా చేసుకునేందుకు, నియంత్రణలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తాయి.

యు.ఎస్. కంపెనీలు ఒకప్పుడు ఆఫ్‌షోర్ ద్వారా ఖర్చుల్ని తగ్గించుకోవాలనుకున్నాయి. కానీ ఇప్పుడు అక్కడ పరిస్థితులు మారాయి. అమెరికా ఉద్యోగాల గురించి ఆందోళన తగ్గించే యత్నంలో ట్రంప్ ఫ్యాక్టర్ ఆటోమేషన్‌కు అనుకూలంగా పనిచేసే అవకాశం ఉంది. ఇది కూడా అక్కడి కంపెనీల ఖర్చుల్ని తగ్గించుకునేందుకే. సాఫ్ట్‌వేర్ సేవల పరిశ్రమలో రోబోటిక్ ఆటోమేషన్‌కు బహుశా ట్రంపే 'ఉత్తమ సేల్స్‌మెన్' అని సిన్హా పేర్కొన్నారు. ఇది అక్కడ ఉద్యోగాల్ని ఏ స్థాయిలో పెంచుతుందనేది సందేహమే. కానీ ఆఫ్‌షోర్ మీదే ఆధారపడిన భారత్ లాంటి ఐటీ పరిశ్రమల కొంప ముంచుతుందనే విషయంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

**15 ఏళ్లయినా మారలేదు**

పదిహేనేళ్ల క్రితం భారత ఐటీ పరిశ్రమలో ఆఫ్‌షోరింగ్ మోడల్ మొదలైంది. విదేశాల్లోని క్లైంట్‌లకు సేవల్ని అందించిన డెలివరి మోడల్ మీదే అది విస్తరించింది. అప్పటి అవసరానికి తగ్గట్టు పరిశ్రమ ఏం చేసిందంటే పిరమిడ్ ఆకృతిలో కార్మికశక్తిని విస్తరించింది. కార్మికశక్తిలో ఎక్కువ భాగం దిగువ స్థాయిలో ఉంటుంది. వీరంతా తక్కువ వేతనాలతో పనిచేసేవారు. అతి తక్కువ భాగం పైస్థాయిలో ఉంటారు. వీరే ఎక్కువ జీతాలు పొందే అతికొద్దిమంది. ఎవరైతే దిగువ, మధ్యస్థాయిలో ఉన్నారో వారిలోనే ఉద్యోగాలు కోల్పోతారనే భయం అధికమవుతోంది. ఓ కంపెనీలో ఉన్న 1,70,000లో 40,000–45,000 వేల ఉద్యోగాలు కోతల టార్గెట్‌లో ఉన్నాయని కొందరు చెబుతున్నారు. కంపెనీలో 10–12 ఏళ్ల అనుభవమున్న వారిలో ముఖ్యమైన వాటా ఇది. అంటే వీరంతా ఇప్పటివరకు నిపుణులుగా రాణిస్తున్నవారే. నైపుణ్యలేమితో ఉన్నవారు కంపెనీలకు ఇక అవసరముండరనే నాస్కామ్ మాట ఇక్కడ చెల్లుబాటు కాదు. ఐటీ రంగంలో అట్రిషన్ అనేది సాధారణ విషయమే. మంచి అవకాశాలొస్తే మరో కంపెనీకి మారడం ఇంతవరకు చూస్తున్నదే. కానీ ఇలా చేయకుండా ఒక కంపెనీకే సేవలు అందించినవారి ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడిపోవడం నైతికంగా చూడాల్సిన విషయం. ఇలాంటి వారి ఉద్యోగాలు తొలగించి చేసేది ఏ రకమైన సర్దుబాటో! సరైన పద్ధతి లేకుండా ఉద్యోగులను బయటకు పంపుతోన్న యాజమాన్యాల ప్రవర్తనపై వారు మనస్తాపం చెందుతున్నారనే వార్తలు చూస్తున్నాం.

**విద్యాతీరుపై కూడా**

నిజానికి, ఆటోమేషన్ వంటి సాంకేతికతలు నాలుగు, ఐదు దశాబ్దాలుగా పరిణామం చెందుతున్నాయి. వీటి మీద విస్తృతమైన అధ్యయనం దేశ విద్యా ప్రాంగణాల్లో కనిపించదు. కానీ ఎలాగైనా తమ డిమాండ్లను తీర్చుకునే పద్ధతిలో కంపెనీలు అప్పటికి నడిచిపోయే సాంకేతికతల వరకే చూస్తున్నాయి. మారుతున్న సాంకేతికతల్ని ఉద్యోగుల నుంచి హక్కుగా ఆశిస్తున్నాయి. ప్రస్తుతానికి రొటీన్ విధుల్ని ఆటోమేషన్ దెబ్బతీస్తుందనేది వాస్తవమైనా రేపటి రోజున నైపుణ్యంతో కూడినవి కూడా రొటీన్ అయిపోతాయి. డొమైన్ లెవెల్ జ్ఞానం ఎంత

ఆటోమేషన్ జరిగినా క్లిష్టంగానే ఉంటుందని అంటారు. రేపోమాపో ఇది కూడా మారొచ్చు. ఇలాంటి విషయాల పట్ల ఐటీ విద్యార్థులకు ఎంతమాత్రం అవగాహన ఉంటోందనేది ప్రశ్న? విద్యా విధానం ముఖ్యంగా ఇప్పుడున్న ఇంజినీరింగ్ కరిక్యులమ్ విషయంలో చాలా చేయాల్సింది ఉంది. చవకగా పరిశ్రమకు లేబర్‌ను సరఫరా చేసే విధానంలోనే విద్యార్థుల్ని తయారుచేసి, ఖర్చులు తగ్గించుకునేందుకు దిగువ స్థాయి ఉద్యోగాల్లోకి కంపెనీలు దింపుతున్న తీరు కూడా మారాలి. దిగువ స్థాయి ఉద్యోగాల భర్తీ కోసం రెండో, మూడో శ్రేణి ఇంజినీరింగ్ కళాశాలల మీదే దృష్టి పెడుతున్న ఐటీ కంపెనీలు వెంటనే తమ విధానాన్ని మార్చుకోవాలి. కనీసం ఒకటి లేదా రెండు తరాల యువత ఈ పరిశ్రమ అవసరాలను తీర్చేందుకు త్యాగం చేయబడింది. వైవిధ్యమైన పరిధిలోని రంగాలకు పనికివచ్చే సాధారణ నైపుణ్యాల్ని నిర్లక్ష్యం, అలక్ష్యం చేశారు. ఐటీ దిగ్గజాల తీరులో మరింత విషాదమేమంటే దేనిలోనైతే తమ బాధ్యత ఉందో ఆ విద్యా వ్యవస్థను ఇప్పుడు వాళ్లు తప్పుబడుతున్నారు.

**అంచనా ఏది?**

త్రైమాసిక ఫలితాల ప్రకటనల సందర్భాల్లో కంపెనీలు ఓ సమాధానం చెబుతుండేవి... 'మాంద్యం కారణంగా ఖర్చులకు కోత విధించుకోవడం కోసం క్లైంట్లు మరింత ఔట్‌సోర్సింగ్‌కు రావాల్సిందే'నని. కానీ ఈ కంపెనీల మధ్య భారీ పోటీతో, క్లైంట్లు ఆఫ్‌షోరింగ్ ప్రాజెక్టుల పెద్ద వాటాని చిన్న చిన్న బిట్లుగా విడగొట్టారని త్వరలోనే అవి గుర్తించాయి. దీన్ని ఇన్ఫోసిస్ కన్నా గొప్పగా ఏది హైలెట్ చేయదు. సాధారణంగా క్లైంట్ల ప్రాజెక్టుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తూ ప్రాజెక్టులు తీసుకునే అదే... చిన్నపాటి టికెట్ ప్రాజెక్టుల వంటి వాటి కోసం కూడా వెళ్లింది. ఆఫ్‌షోరింగ్ వృద్ధి చెందే కొద్దీ క్లైంట్లకు మార్జినల్ లాభాలు తగ్గిపోతాయనేది స్పష్టమే. నూతన సాంకేతికతకు మారే కొద్దీ పరిస్థితులు మారిపోతుంటాయనే విషయంపై వాటి అంచనా ఎంతవరకు ఉందో ఉద్యోగుల్లో ఉన్న ఆందోళనే తెలియపరుస్తుంది. ఏ సాంకేతికత కూడా ఒక్కసారిగా వచ్చేది కాదు. ఆ అంశాలలో ఉద్యోగులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం కూడా

**" ఆటోమేషన్ వంటి సాంకేతికతలపై ముందు నుంచి వృత్తిదారుల్ని అప్రమత్తం చేసి, శిక్షణనివ్వాల్సిన కనీస ధర్మం కంపెనీలది. ఆటోమేషన్ ప్రభావం ఏ స్థాయి నిపుణులపై ఉంటుందో చెప్పి వారిని మెరుగుపరచడమో, లేదా వారిని ఇతర అవకాశాల వైపు నడిపించే ప్రయత్నం చేయడమో ఈపాటికే జరగాలి. "**



ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆటోమేషన్‌తో వేలాది ఐటి ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది

వేగంగా జరగదు. ఈ రెండు విషయాల్ని దృష్టిలో పెట్టుకున్నా ఆటోమేషన్ వంటి సాంకేతికతలపై ముందు నుంచి వృత్తిదారుల్ని అప్రమత్తం చేసి, శిక్షణనివ్వాల్సిన కనీస ధర్మం కంపెనీలది. ఆటోమేషన్ ప్రభావం ఏ స్థాయి నిపుణులపై ఉంటుందో చెప్పి వారిని మెరుగుపరచడమో, లేదా వారిని ఇతర అవకాశాల వైపు నడిపించే ప్రయత్నం చేయడమో ఈపాటికే జరగాలి.

**ఐటీ తత్వమే అంత**

ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రైవేట్ సంస్థల ద్వారా నిర్మితమై, రూపొందించబడిందీ పరిశ్రమ అని ప్రచారం చేస్తున్నారు. ఇంత కన్నా తప్పు మరోటి ఉండదు. ఈ కంపెనీలు పుట్టకముందే 1972లో వచ్చిన తొలి సాఫ్ట్‌వేర్ పథకాన్ని మనం తరచూ మర్చిపోతుంటాం. కంప్యూటర్ విద్య, శిక్షణలో స్పెషలైజ్ అయిన సాఫ్ట్‌వేర్ ఎగుమతుదారులు, సంస్థలు రాయితీలపై హార్డ్‌వేర్‌ను దిగుమతి చేసుకునే విధంగా అది రూపొందించబడింది. ప్రభుత్వం నుంచి ఈ 'అరుణోదయ' రంగం పొందిన ట్యాక్స్ హాలీడేలు, ట్యాక్స్ బ్రేక్‌లతో 2008 నాటికే 7 శాతం ఎఫెక్టివ్ ట్యాక్స్ రేట్ కంపెనీలకుంది. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భూమి ధరలో రాయితీలు, మిగతా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, ఇంకా చెప్పాలంటే ప్రజా రవాణా వ్యవస్థ నుంచి పరిశ్రమ కార్మికుల కోసం బస్సులు నడపడం వంటి అనేక విషయాల్ని ఈ పరిశ్రమ విస్మరించింది. మిగతా రంగాల భారత పరిశ్రమలు, వాటిల్లోని ప్రధానమైన ప్రభుత్వరంగ సంస్థలు, అండర్‌టేకింగ్‌లతో సంబంధాలతో ఐటీ సేవల పరిశ్రమ తొలి వేర్లు, నైపుణ్యతలు ఎలా పెనవేసుకుపోయాయనే వాస్తవ కథను, వీటి వల్ల అది ఎంత వృద్ధి చెందిందనే సంతోషకర కథల్ని కూడా ఇది వదిలేసింది. వాస్తవంగా ఆలోచిస్తే... కేవలం దాని ఉద్యోగులకే కాదు. సమాజానికి కూడా భారీ స్థాయిలోనే ఈ పరిశ్రమ రుణపడి ఉంది.

**(అనువాదం: వారాల అజయ్‌కుమార్)**

❋

## సందేహాలు - సమాధానాలు

**జియస్‌టిని సిపియం స్వాగతించింది. ఇది ఏ విధంగా సరైనది? జియస్‌టి రాష్ట్రాల హక్కులను హరించదా? దేశ ఫెడరల్ స్వభావం దెబ్బతినదా?కేంద్రం రాష్ట్రాలలోని పాలకులను ఇబ్బందిపెట్టదా?**

నూతలపాటి కాళిదాసు
సిపిఐ(ఎం) గుంటూరు జిల్లాకమిటి సభ్యులు

కాళిదాసుగారి ప్రశ్నలోని అంశాలకు పార్టీ పొలిట్‌బ్యూరో జియస్‌టిపై చేసిన తీర్మానంలో సమాధానం ఉంది. తీర్మానం కింద ఇస్తున్నాం:

ఈ ఏడాది జులై 1 నుండి హడావుడిగా అమలులోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను చట్టం ద్వారా ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఎటువంటి ముందు జాగ్రత్తలు చేపట్టకుండా ఈ చట్టాన్ని అమలులోకి తేవటంతో వినిమయ వస్తువుల ధరలు పెరగటంతో పాటు ద్రవ్యోల్బణం కూడా పెరిగే ముప్పు పొంచి వుందని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో వివరించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి పన్ను రేటు వర్తించే వస్తువుల సంఖ్య కన్నా జిఎస్‌టి పన్నురేటు వర్తించే వాటి సంఖ్య తక్కువగా వున్నప్పటికీ ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపింది. జిఎస్‌టి అమలు ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు రు.లక్ష కోట్ల రెవిన్యూ నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారని, అయితే ఈ ప్రయోజనాలను వినియోగదారులకు అందించేందుకు సిద్ధంగా లేని కార్పొరేట్‌లకు ఇది వరంగా మారిందని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. జిఎస్‌టి చట్టంలో వున్న లాభదాయకత నిరోధక క్లాజ్‌ను సమర్ధవంతంగా వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం సుముకంగా లేదని పేర్కొంది. జిఎస్‌టి వర్తింపు ద్వారా తగ్గే పన్ను రేట్ల ప్రయోజనాలను వస్తువుల ధరలను తగ్గించటం ద్వారా వినియోగదారులకు అందచేయాలని ఈ క్లాజ్ చెబుతోందని గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ క్లాజ్ అమలుకు అవసరమైన విధి విధానాలను ఇప్పటికీ రూపొందించలేదని తెలిపింది. ఈ పన్ను విధానంలో స్పష్టత లేకపోవటంతో ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జిఎస్‌టి, ప్రస్తుత ఉమ్మడి పన్ను విధానాల పరిధిలోకి వచ్చే వస్తువుల సమగ్ర జాబితాను వెంటనే విడుదల చేయాలని పొలిట్‌బ్యూరో కేంద్రాన్ని డిమాండ్ చేసింది. వస్తు, సేవల పన్ను రేటు కొన్ని రంగాలు, వస్తువులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని వివరించింది. ఈ పన్ను పరిధిలోకి వచ్చే చిన్న తరహా పరిశ్రమలు రు.75లక్ష టర్నోవర్ దాటితే పూర్తి పన్ను చెల్లించాలన్న నిబంధనతో తీవ్రంగా నష్టపోతున్నాయని, ఇంతకు ముందు ఈ పరిధి అన్ని యూనిట్లకు రు.1.5 కోట్ల మేర వుండేదని వెల్లడించింది. ఇదే విధంగా ఈ చట్టంలో చిన్న పరిశ్రమలను దెబ్బతీస్తూ, బడా పారిశ్రామిక యూనిట్లకు అనుకూలంగా వుండే అనేక లసుగులు వున్నాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, జిఎస్‌టి కౌన్సిల్ వీటిని పునఃపరిశీలించి లసుగులను తొలగించాలని డిమాండ్ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సామాన్యుల సొమ్మును కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయరాదని సిపిఎం పొలిట్ బ్యూరో స్పష్టం చేసింది.

## అభిప్రాయం

# రైతుల ఆత్మహత్యలు - ప్రభుత్వ హత్యలే

''వ్యవసాయు సంక్షోభానికి కారణమేమిటి" వ్యాసం అనేక అంశాలను వెలుగులోనికి తీసుకొనివచ్చింది. గ్రామీణ భారతం చాలా సంక్షోభంలో వుంది. దేశంలో 20 రాష్ట్రాలలో రైతుల ఆత్మహత్యలు జరిగాయి. నేషనల్ క్రైం రికార్టుబ్యూరో నివేదిక ప్రకారం (3) మూడు లక్షల పై చిలుకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అందులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర అధికంగా వున్నారు. ఈ మధ్య కాలంలో తమిళనాడు రైతులు ఢిల్లిలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనా కార్యక్రమాలు చేసారు. దేశంలో లక్షల కోట్లు బ్యాంకు రుణాలు తీర్చని బడాపెట్టుబడిదార్ల జోలికి వెళ్లని ప్రభుత్వం పంటలు పండక రుణాలు తీర్చలేని రైతుల ఆస్తులు స్వాధీనంచేసుకున్నారు. పంటలు భీమా పథకం ఒక ప్రీమియం కట్టలేదని నష్ట పరిహారం చెల్లించలేదు సరికాదా కట్టిన ప్రీమియంలు వారి ఖాతాలో కలిపేసు కొన్నారు. ప్రీమియంలు ప్రభుత్వమే చెల్లించే విధంగా పథకంలో మార్పులు చేయాలి. విత్తనాల ఎరువుల ప్రకటనలకు సినీనటులకు లక్షలాది రూపాయలు చెల్లిస్తున్నారు. ఒకొక్కసారి పండించిన పంట అమ్మిన సొమ్ము రవాణా చార్జీలకు చాలనందున మార్కెట్ యార్డులో పంటను తగుల బెడుతున్నారు. గిట్టుబాటు ధరలభించుట లేదు. దళారులు వ్యాపారులు బాగుపడుచున్నారు. ప్రభుత్వ సహాయం పండించిన కౌలుదార్లకు అందడంలేదు. మహిళా రైతులు పిల్లలతో సహా ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. వీటిపై పార్లమెంట్ లో సమగ్ర చర్చలు జరగడం లేదు. స్వామినాధన్ కమీషన్ నివేదికపై సమగ్ర చర్చలు జరిపి పంటలకు రక్షణ కల్పించడం తో పాటు రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే.

**తుంపాల శ్రీరామమూర్తి**
**గాజువాక - విశాఖ.**

# ప్రమాదంలో మన ప్రజాస్వామ్యం



రచయిత భారత మాజీ
ఉప రాష్ట్రపతి

హమీద్ అన్సారి

**2017** ఆగస్టు 6వ తేదీన బెంగుళూరులోని "నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా "యూనివర్సిటీ" స్నాతకోత్సవ సభలో భారత మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారి చేసిన ప్రసంగపాఠం:

భారతదేశంలోని న్యాయశాస్త్ర విద్యాలయాల్లో ఖ్యాతిగాంచిన ఈ ప్రాంగణంలో, న్యాయ కోవిదుడిని కాని నేను, మీతో కలసి ఈ సమయాన్ని గడపడం, నా ఆలోచనలను మీతో పంచుకోవడం ఓ అద్భుతమైన అవకాశం. ఈ గౌరవాన్ని నాకందించిన ఈ న్యాయ విద్యాలయ డైరెక్టర్ గార్కి నాధన్యవాదాలు.

విశ్వవ్యాప్తమైన న్యాయంలోని అస్పష్టత, చట్టపరమైన ప్రక్రియలు ఈ సభా ప్రాంగణంలోని సభికులకు చాలా స్పష్టంగా తెలుసు, అయినప్పటికీ ఈరెండింటి మధ్యనున్న అనిశ్చితి, సంబంధ బాంధవ్యాలను గూర్చి చాలా సున్నితంగా, క్లుప్తంగా నేను చర్చించదలుచుకున్నాను. ఈ సందర్భంగా అత్యంత వినయంగా మీ దృష్టికి రెండు పాత్రలను తెస్తాను...అవి, మొదటిది మిష్టర్ బంబ్లే ఉటంకించినట్లు"చట్టము ఒక గాడిద" షేక్స్పియర్ రచనల్లోని "హెన్రీIV" పాత్ర పరుషంగా చెప్పిన న్యాయవాదులందరినీ చంపెయ్య" మన్న రెండో వాక్యం. అయితే ఈ రోజు నా ప్రసంగం ద్వారా నేను చేసే ప్రయత్నం "వాస్తవ పరిస్థితుల్లో సూత్ర ప్రాయంగా చట్ట బద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన, యాధృచ్ఛికమైన న్యాయ పరిస్థితులు, తద్వారా ప్రజా బాహుళ్యానికి లభిస్తున్న ఫలితాలను గురించి "యధాతధంగా మీ దృష్టికి తీసుకురావడం చేస్తాను.

రాజకీయ తత్త్వశాస్త్రంలో ఆసక్తి కలిగి ఉండటమనేది ఓ జీవితకాలం వెంటాడే అనుభవం. జాన్లాక్ చెప్పిన "ఎప్పుడు చట్టం అణచివేయబడుతుందో అప్పుడు నిరంకుశత్వం ప్రారంభమవుతుంది" అన్న సామెత నాకు జ్ఞప్తికి వస్తుంది. అదేవిధంగా జాన్రాల్ ప్రకటించిన "సామాజిక సంస్థల ప్రధమ ధర్మం, న్యాయం, న్యాయబద్ధమైన సమాజంలో పౌరులకు సమానహక్కులు, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ, రాజకీయ లాభనష్టాలకతీతంగా సమన్యాయం లభిస్తుందన్న" వాక్యాలు సైతం గుర్తుకొస్తున్నాయి. రాల్ ఉద్దేశ్యంలో "రాజకీయ తత్వం ఏదయినా వాస్తవ దృక్పథంలో చూడగల గాలి. అంతర్గతంగా ఎన్నెన్ని ప్రశ్నలుద్భవించినా, తాత్వికసిద్ధాంతాలేవైనా, నైతిక స్వభావాలేవైనా, వాటిని శోధించి, ప్రజా సహకారంతో, పరస్పర గౌరవ భావనతో పౌరులు జీవించ గలగాలి.

భారత రాజ్యాంగం, పీఠిక, వీటన్నింటిని సమగ్రంగా కలిగి ఉన్నదన్న సత్యం మనం మరవరానిది. భారతపౌరులు ఓ పటిష్టమైన రాజ్యాంగ వ్యవస్థను కలిగి ఉన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంలతో కూడిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య లక్షణాలు పుష్కలంగా కలిగి ప్రజలందరినీ సమానంగా చూడాలన్న చట్టాలను, అమలును తమ హక్కుగా ఈ దేశ ప్రజలు పొంది ఉన్నారు.

మన పూర్వీకులు భారతదేశ అస్థిత్వ వాస్తవ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేశారు. మన సమాజం బహుళ స్వభావం కలిగి, భిన్న సంస్కృతుల ఏకీకరణతో మనుగడ సాగే జీవన విధానం కలిగి ఉన్నది. 130 కోట్ల ప్రజా బాహుళ్యంలో 4,635 సామాజిక తరగతులున్నాయి. 78 శాతం భాషా పరంగానే గాక, సాంస్కృతిక పరంగా, సామాజిక విభాగాలుగా విభజింపబడిన సమాజం. మొత్తం ప్రజానీకంలో మత ప్రాతిపదికన మైనారిటీలుగా 19.4 శాతం నివశిస్తున్నారు. కేవలం భాషా ప్రాతిపదికనే గాక క్రమానుగతంగా భిన్న నేపధ్యాల సమాహారంగా మూర్తీభవించిన సమాజం మనది.

భిన్న భాషా, సంస్కృతుల మేళవింపుగా విభజింపబడి, మనుగడ సాగిస్తున్న భారతీయ సమాజానికి ఏర్పరిచిన "రాజ్యాంగం" ప్రజాస్వామ్య పాలనను, లౌకికవాద పరిరక్షణను కలుపుకుని ఓ సంపూర్ణత్వాన్ని కలిగి ఉంది. బహుళత్వానికి ప్రతీకైన మనదేశంలో నైతిక విలువలతో సామాజికంగా భిన్న వర్గాల ప్రజల, సమూహాల ఆసక్తులను పరిరక్షిస్తూ, వ్యక్తిగత అవసరాలను సంరక్షిస్తూ, అందరికీ సమాన అవకాశాలు, సమానంగా చట్టబద్ధంగా అందించవలసి ఉంది. ఆధునిక పరిభాషలో బహుళత్వ మంటే ముందుగా ఊహించిన పౌరసత్వం. పౌరసత్వాన్ని ఓ ప్రాధమిక యూనిట్గా పరిగణించినపుడు దానిని" జాతీయత అందించిన జాతి వారసత్వంగా గాక జాతీయ పౌరసత్వం" గా స్వీకరించాలి. జాతీయ గుర్తింపు చాలా పెళుసుగా ఉన్నపుడు, స్పష్టమైన క్రమానుగతమైన" జాతీయ, పౌర సంబంధిత, బహుళజాతి కలయికగానే పరిగణలోనికి తీసుకోవాలి.

ఆధునిక ప్రజాస్వామ్యం మానవజాతి చరిత్రలోనే చక్కటి భవిష్యత్తున్న రాజకీయాలను అందించే యత్నం చేస్తుంది. అదేరీతిలో ప్రజాస్వామ్య సమాజాల్లోని భిన్న స్వభావాల సంయోగం నుంచీ ఉద్భవించిన ఓ తాకిడిని కూడా ఆస్వాదిస్తుంది. తత్ఫలితంగా భిన్న భావాల, ఉజ్వల, సమాజాల ప్రభావాన్ని రాజకీయ రంగం చూస్తూనే, వ్యక్తుల అస్థిత్వానికి, సమూహాల అస్థిత్వానికి మధ రాజకీయ చక్రం తిరుగాడుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ కూడా భిన్న సామాజిక నేపధ్యంలో వర్గాల గొంతుకగా గాక, భిన్న వ్యక్తుల ప్రస్తుత అభిప్రాయాలు వెల్లడించే ఓ స్వేచ్ఛా వేదికగా పరిగణించాలి... ఒక్క వాక్యంలో చెప్పాలంటే "ఎదుట వారి అభిప్రాయాన్ని సైతం గుర్తించే గౌరవించే ఓ వేదిక 'ప్రజాస్వామ్యం'.

లౌకికవాదమనేది రాజకీయంగా విస్తృతంగా చర్చించే అంశాలకు సహకారిగా ఉండే ఓ భావన. భారతదేశ రాజకీయ లక్ష్యాల సాధనకు ఒక ఖచ్చితమైన ప్రకటన. ఇదే అంశాన్ని "బొమ్మై" కేసులో సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది.

లౌకిక వాదమనేది అనుకూల, అననుకూల అంశాలను రెండు కోణాల్లోనూ కలిగిన భావన.

**" రాజకీయ పార్టీలు నిర్వహించే మత సంబంధిత కార్యక్రమాలను, మతాధారిత రాజకీయ కార్యకలాపాలను, పాలనలో మత వ్యవహారాలను రాజ్యాంగం నిషేధించింది. లౌకికవాదానికి వ్యతిరేకంగా ఏ వ్యక్తి/ సంస్థ/ సంఘటన వ్యవహరించినా అది రాజ్యాంగాన్ని అతిక్రమించడమే అవుతుంది. "**

భారత రాజ్యాంగం ఈ రెండు అంశాల మధ్య ఓ స్పష్టమైన రేఖను విస్పష్టంగా ప్రకటించింది. వ్యక్తుల మత విశ్వాసాలు, నమ్మకాలు, మతానుసరణ, తమ మతాన్ని ప్రచారం చేయడం మొదలగు విషయాలన్ని ప్రజానుకూలంగా, నైతికత పరిధులకు లోబడి ఆచరించదగినవి. లౌకికతను ఆచరణను చట్టబద్ధంగా ఆచరించే సౌలభ్యం రాజ్యాంగం ప్రసాదించింది. అదే విధంగా రాజ్యం ఏ మతాన్ని ప్రత్యేకంగా ప్రోత్సహించడాన్ని గానీ, అనుసరించడానికి వీలు లేకుండా నిషేధాన్ని సైతం విధించింది. రాజ్యం మత వ్యవహారాల ఆచరణలో తటస్థంగా ఉండాలన్న స్పష్టతను కూడా భారత రాజ్యాంగం ప్రకటించింది. అంతేగాక రాజ్యంలోని పౌరులందరూ, లౌకికవాద పునాదులపై, వ్యక్తులుగా పురోగతిని, ప్రాంతీయ ఎదుగుదలను, జాతీయ సమగ్రతను, అభివృద్ధిని సాధిస్తూనే అన్ని మతాల మధ్య, అంశాల మధ్య సమతుల్యతను పాటించవలసి ఉంటుంది. లౌకికవాద పునాదులతో పాటు, హేతుబద్ధతను సైతం కలిగి వ్యవహరించాల్సి ఉంటుంది. మతసహనం, సౌభ్రాతృత్వం ప్రధమ ప్రాధాన్యత కలిగి, సిద్ధాంత వైరుధ్యాల కన్నా జాతి సమగ్రత, వైషమ్యాలు లేని మత ఐక్యతకు, మత సామరస్యానికి రాజ్యాంగం స్పష్టమైన మార్గదర్శకాలను అందించింది.

రాజకీయ పార్టీలు నిర్వహించే మత సంబంధిత కార్యక్రమాలను, మతాధారిత రాజకీయ కార్యకలాపాలను, పాలనలో మత వ్యవహారాలను రాజ్యాంగం నిషేధించింది. లౌకికవాదానికి వ్యతిరేకంగా ఏ వ్యక్తి/సంస్థ/ సంఘటన వ్యవహరించినా అది రాజ్యాంగాన్ని అతిక్రమించడమే అవుతుంది.

మత ఆచరణకు సంబంధించి సుస్పష్టమైన ఆదేశాలను రాజ్యాంగంలో పొందుపరచినప్పటికీ, లౌకికవాదానికి విఘాతం కలిగించే, పలచన చేసే సంఘటనలు, భిన్న సందర్భాలలో ఎదురవుతూ కొత్త నిర్వచనాలు చెబుతున్న అనేకానేక ఘటనలు ఎదురవుతున్నాయి. న్యాయబద్ధంగా, రాజకీయంగా రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి తూట్లు పొడిచే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

భారతదేశంలోని ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి మధ్య ఓ గుర్తింపు, ఓ స్పష్టమైన అసమానత్వం ఉన్నట్లుగా పరిశీలించబడింది. నేడు భారతదేశంలోనున్న పరిస్థితులు లౌకిక తత్వం ప్రాధమిక సూత్రాలను, సమానత్వం, నచ్చిన మతాన్ని స్వీకరించే స్వేచ్ఛ, పరమత సహనం, వ్యక్తుల మధ్య సమానత్వం, మతస్వేచ్ఛకు సంబంధించిన భిన్న కోణాల స్వభావాలను పునరుద్ఘాటిస్తూ, పునరుజ్జీవింప చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం, స్వేచ్ఛ మన దేశ విజయాలను, అపజయాలను, పరిమితులను, సాధించాల్సిన లక్ష్యాలను, పొందిన విలువలను వాస్తవికంగా చర్చించాల్సిన పరిస్థితులను మన ముందుంచింది. ఆశావహ దృక్పథంతో వాస్తవ పరిస్థితులను సమీక్షించుకొనే సమయంలో మూడు ప్రశ్నలు నా మస్తిష్కంలోకి వచ్చాయి. అవి.

1. భారతదేశ ప్రజాస్వామ్యంలో తరతరాలుగా వస్తున్న బహుళత్వ వారసత్వం ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో కొనసాగుతుందా?

2. భారతదేశంలోని బహుళత్వ లక్షణాలకు మన ప్రజాస్వామ్యం ఎంత వరకు దోహదపడి, సహాయకారి అవుతుంది?

3. లౌకిక తత్వాన్ని పరిరక్షించడానికి మనందరం ఎంత వరకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాం?

మన ప్రజాస్వామ్య రాజనీతి, బహుళత్వాన్ని కలిగిఉంది. అంతేగాక సమిష్టివాదం ద్వారా ఆమోదం పొందింది. కారణం 1.దీనియొక్క సమాఖ్య స్వభావం 2.భాషాపరంగా, మత పరంగా మైనారిటీలకున్న హక్కులు 3. వ్యక్తులకున్న ప్రాధమిక హక్కులు. మతపరంగా, భాషాపరంగా మైనారిటీలకు రక్షణ వ్యవస్థను, భావ ప్రకటనను స్వేచ్ఛను కలగచేయడం వీటన్నిటిని ప్రత్యేకంగా కలిగిఉంది.

జాతీయ సమన్వయం గురించి ఓ ప్రశ్న. భావనా పరంగా, సిద్ధాంతపరంగా వాస్తవ రూపంగా, "సమన్వయం" చేయడం సమానత్వానికి, సజాతీయతకు పర్యాయపదం కాదు. కొన్ని సంవత్సరాల క్రితం రాజకీయ శాస్త్రవేత్తగా అభివర్ణించబడ్డ ఓ వ్యక్తి మాటలను పరిశీలిద్దాం!

వ్యవహారిక రాజకీయాలకు సంబంధించినంత వరకు జాతీయ సమన్వయము / సమగ్రత అంటే అర్థం ఐక్యంగా ఉండటం తప్ప ఏకరూపత కాదు. సయోధ్య తప్ప విలీనం కాదు. పరస్పరం కల్పించుకునే వసతి తప్ప విధ్వంసం కాదు. సంశ్లేషణ తప్ప రద్దు కాదు. సంఘీభావం తప్ప నియంత్రణ కాదు. విశాలమైన సమాజంలో, విస్తృత రాజకీయ వాతావరణంలో ఆనాటి పరిస్థితులలో సమన్వయాన్ని కల్పించడమే! వివిధ భాషా, సంస్కృతుల మధ్య ఉన్న సారూప్య లక్షణాలకు అనురూపత కల్పించడమే!

పైన పేర్కొన్న స్వభావం భారత ప్రజాస్వామ్యంలో ఎంతవరకు పరస్పర సహకారంతో పని చేస్తుందన్నదే ప్రశ్న! ఇన్ని రకాల అసమానతలు, సాంఘిక భిన్నత్వాలున్న భారతీయ సమాజం రాజ్యాంగం కల్పించిన విశ్వజనీనమైన సార్వత్రిక ఓటుహక్కు, భిన్నమతాల, వర్గాల ప్రజల ఓట్లు పొంది గెలిచి, అధికారాన్ని కైవసం చేసుకునే వ్యవస్థ మనదేశంలో ఉంది. అంతర్లీనంగా దీని అర్థం "ప్రజల ఆకాంక్షలను, ఆశలను, ఆలోచనలను పరిరక్షిస్తూ, వారి ప్రతినిధిగా, చట్ట బద్ధంగా, న్యాయ వ్యవస్థ పరిధిలో, బాధ్యతతో ప్రభుత్వాన్ని నడిపిస్తూ జవాబుదారీ తనాన్ని వహించాల్సి ఉంది.

స్వాతంత్రానికి పూర్వం గాంధీజీ ఊహల్లో "ప్రజాస్వామ్యం క్షేమంగా ఉండాలంటే ప్రజలకు సుస్పష్టమైన స్వాతంత్ర్యం, ఆత్మాభిమానం, అందరం ఒక్కటే నన్న బావన, స్వచ్ఛత, మంచితనం, ప్రజలకు మంచి చేయాలన్న ఆకాంక్ష ఉన్న ప్రజాప్రతినిధులు ఉండాలి." కానీ అంబేద్కర్ ఈ విషయంలో దిగులు చెందారు. కారణం, సమానత్వం, సౌభ్రాతృత్వం లేని సమాజంలో "ఒక మనిషికి ఒక ఓటు ఒకే విలువ" విధానంలో ఏర్పరచబడిన ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ కష్టమని" ఆయన భావించారు.

భారతదేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన పనితీరు పట్ల ఎలాంటి అంచనా లైనా, విధానపరంగా, యదార్థంగా ఉండాలి. కారణం ఎన్నికల తీరును, ఎంపిక ప్రక్రియ. ఎన్నికల విధానంలో నియంత్రణలు, ఎన్నికలలో ఓటర్ల

"రెండో దశలో ఆర్థిక అసమానతలను తొలగించే చర్యలు చేపట్టడం, ఆర్థిక, వర్గ అసమానతలను రూపుమాపడం. కానీ ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని భారత రాజ్యాంగం సూచించినప్పటికీ ఆచరణలో వాస్తవ పరిస్థితులలో మార్పు లేకుండా కేవలం వాగ్దానాలకే పరిమిత మవ్వడం జరుగుతున్నది."



కత్తులతో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల కవాతు: బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలపై సంఘ్ పరివార్ దాడులు పెరిగాయి.

పాల్గొనడం, ఓట్ల లెక్కింపు, వీటన్నిటి తర్వాత గెలుపొందిన వ్యక్తి విధానసభల్లోకి అధికారికంగా ప్రజా ప్రతినిధిగా అడుగు పెట్టడం, ఈ ప్రక్రియ అంతా చాలా సంతృప్తినిచ్చే విధానం.

ఈ ఎంపిక విధానంలో గణనీయమైన, చాలా సునిశితంగా పరిశీలించాల్సిన విషయాలున్నాయి.

1."చట్టం ముందు సమానత్వం", చట్టం ద్వారా సమానన్యాయం
2. ఎంపికయిన అభ్యర్థియొక్క ప్రాతినిధ్య వ్యవహారశైలి.
3. శాసనసభ ప్రతినిధుల పనితీరు.
4. లింగ వివక్ష, వైవిధ్యమైన ప్రతినిధుల మధ్య అసమానత.
5. ఆచరణలో లౌకికతత్వం

"చట్టం ముందు సమానత్వం" మరియు " చట్టం ద్వారా సమాన న్యాయం."

సమానత్వాన్ని సాధించడానికి చేసే ప్రయత్నాలు రెండు స్థాయిల్లో ఉన్నాయి. మొదటిది సమాజంలో నున్న అసమానతలను తొలగించే దిశగా, సమాజంలో ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలు వృద్ధి పరిచే క్రమంలో తెచ్చే మార్పులు, అనగా " కుల ఆచరణ", "అంటరానితనాన్ని పాటించడం", మత పరమైన కార్యక్రమాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టడం వంటి వాటిని చట్ట వ్యతిరేక చర్యలుగా భావించడం.

రెండో దశలో ఆర్థిక అసమానతలను తొలగించే చర్యలు చేపట్టడం, ఆర్థిక, వర్గ అసమానతలను రూపుమాపడం. కానీ ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని భారత రాజ్యాంగం సూచించినప్పటికీ ఆచరణలో వాస్తవ పరిస్థితులలో మార్పు లేకుండా కేవలం వాగ్దానాలకే పరిమిత మవ్వడం జరుగుతున్నది.

**"ఎంపికైన అభ్యర్థి యొక్క ప్రాతినిధ్య వ్యవహారశైలి"**

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎంపికైన 61 శాతం పార్లమెంటు సభ్యులు పోల్ అయిన ఓట్లలో 50 శాతం ఎన్నా తక్కువ ఓట్లు పొందిన వారే! దీని అర్థం ఎంపిక అయిన వారు కేవలం మైనారిటి ఓట్లతో మాత్రమే గెలిచారు. అంటే ఆ ప్రాంత ప్రజల సంపూర్ణ సహకారంతో ఎంపిక కాబడలేదు. కేవలం కొద్దిమంది, ఎవరైతే ఓట్లు వేశారో, వారిలో కూడా ఆ వ్యక్తికి ఎక్కువగా ఓట్లు వేశారో వారి ప్రతినిధి గా మాత్రమే ఎంపిక జరిగింది.

**ఎంపిక కాబడిన అభ్యర్థుల బాధ్యత పనితీరు** : ఎంపిక కాబడిన ప్రజా ప్రతినిధుల ప్రథమ కర్తవ్యం, తమ ప్రాంత ప్రజల సమస్యల పరిశీలించి, చట్టసభలలో చర్చించడం, పరిష్కారం దిశగా కృషి చేయడం. కానీ ఈ మూడు అంశాలు తరచుగా ఒక దానిని మరొకటి అధిగమిస్తున్నాయి. మూడింటికీ సమానమైన సమయమివ్వాలి. కానీ వాస్తవానికి అలా జరగడం లేదు. గతంలో, అనగా 1953 వ సంవత్సరంలో ప్రజా సమస్యలు చర్చించడానికి లోక్‌సభ 137 సార్లు, రాజ్యసభ 100 సార్లు సమావేశం కాగా, 2016 వ సంవత్సరంలో లోకసభ 49 సార్లు, రాజ్యసభ 52సార్లు మాత్రమే సమావేశమయ్యింది. కోల్పోయిన ఈ సమయం ప్రజా సమస్యలను చర్చించడంలో ఓ విఘాతం కాగా, పరిష్కారాన్ని వెదకడంలో, సమస్యలను నివృత్తి చేయడంలో వెనకబడటం జరుగుతుంది. ఒక అంచనా ప్రకారం గతంలో లోక్‌సభలో ప్రజా సమస్యల పట్ల చర్చ జరిగి, "ఒక్క గంట"లోనే బిల్లులను అమోదించబడినట్లు, ఇవి 40 శాతమున్నట్లు తేలింది. ఈ పరిస్థితి రాజ్యసభలో కొంతమేరకు ఆశావహంగా జరిగింది. ఈ పరిస్థితిని నిశితంగా పరిశీలించిన స్టాండింగ్ కమిటీ బృందం సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్త పరిచింది.

ఈ మధ్య జరి "భారత పార్లమెంట్ – ఒక బాధ్యతాయుత వ్యవస్థ" అనబడే అధ్యయనం కూడా "క్రమానుగతంగా బలహీన పడుతూ, ప్రభుత్వ పని తీరుపై నిఘావేయటాన్ని పెంచడం లేదని" అభిప్రాయ పడింది. ఈ విధానం జాతీయ స్థాయిలో కన్నా, రాష్ట్ర స్థాయిల్లో అత్యంత అధమంగా ఉంది. అయితే ప్రజా ప్రాతినిధ్యం, ఎన్నికల ప్రక్రియలో గతంలో కన్నా అభివృద్ధి చెందింది. ఎన్నిక కాబడుతున్న వ్యక్తుల, పార్టీల, ఎన్నికలలో పాల్గొంటున్న జనబాహుళ్యం ఆలోచన విధానంలో సుస్పష్టమైన మార్పు వచ్చింది. ప్రస్తుతమున్న ప్రజాస్వామ్య విధానంలో అధికారం మరింత వికేంద్రీకరణ జరగాలని, ప్రజాసమస్యల పట్ల మరింత స్పష్టత, సమస్యల పట్ల సానుకూలత పెరగాలని ప్రస్తుత భారతీయ పౌర సమాజం ఆశిస్తుంది. ఇది గతంలో కన్నా మెరుగ్గా ఉంది.

**"లింగ వివక్ష, వైవిధ్యమైన ప్రతినిధుల మధ్య అసమానత"**

2014 వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా పార్లమెంట్ సభ్యులలో మహిళలు కేవలం 12.15 శాతం మాత్రమే ఉన్నారు. అంతర్జాతీయ రాజకీయ ముఖచిత్రంలో చూసినా, లేదా సార్క్ దేశాలతో పోల్చినా పితృస్వామ్య వ్యవస్థ ఈ దేశ మహిళల రాజకీయ ప్రాధాన్యతను ఎంతగా అణగ దొక్కేస్తుందో అర్థమవుతుంది. మన మహిళలను రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దడంలో ఈ దేశం వెనుకబడి ఉంది.

> ❝ భారత రాజ్యాంగంలో సుస్పష్టంగా వివరించిన బహుళత్వాన్ని, లౌకిక వాదాన్ని పరిరక్షించ డానికి, ప్రస్తుత పరిస్థితులలో మనం ఎలాంటి అవకాశాలను కలిగి ఉన్నాం? సమాధానం చూస్తే ఓ పెద్ద అబద్ధంలా కనిపిస్తుంది.❞

2009లో రాజ్యసభలో అంగీకరించబడి, లోక్‌సభకు పంపబడిన "మహిళా రిజర్వేషన్ బిల్లు" వెనక్కి నెట్టివేయ బడింది. 2014లో పార్లమెంట్ ముగిసినపుడు మట్టిలో కలిసి పోయింది. మహిళా రిజర్వేషన్ అన్న మాటే లేకుండా సార్వత్రిక ఎన్నికలు ముగిసి పోయాయి. మహిళా బిల్లు తిరిగి పునరుజ్జీవనం పొంద లేదు. అదే విధంగా మైనార్టీల ప్రాతినిధ్యం సైతం ఉంది. భారతదేశ జనాభాలో 14.23 శాతం మంది ముస్లీంలు ఉన్నారు. పార్లమెంట్ ఉభయ సభలలో సభ్యుల సంఖ్య 790 కాగా, 1980 లో ముస్లీం ప్రతినిధుల సంఖ్య 49. అదే సంఖ్య 1999-2009 దశాబ్దంలో 35 నుండి 30 కి పడిపోయింది. 2014లో మరింత క్షీణించి 23 కి దిగజారిపోయింది. "భిన్నత్వంతో కూడిన ఈ దేశంలోని ప్రజానీకం, ప్రజా ప్రాతినిధ్యం అసమానతల ఉచ్చులో పడకూడదని, దానివలన సమాజంలో కొంతమంది పెత్తం దారీతనం ఎక్కువవుతుందని, తద్వారా రాజకీయ ప్రాబల్యం పెరిగి, దేశ లౌకిక వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందని, నిర్ణయాలలో అసమతుల్యత ఏర్పడుతుందని" కొన్ని సంవత్సరాల క్రితం "నిపుణుల కమిటీ" ప్రభుత్వానికి స్పష్ట పరిచింది.

**ఆచరణలో లౌకికతత్వం**

అనుభవం తెలుపుతున్నదేమంటే భిన్న మతాల సమూహమైన ఈ సమాజంలో మతరీత్యా అధిక జనాభా కలిగిన వారిని దేశంలోని మొత్తం జనాభాకు ప్రతినిధులుగా భావించడం అసాధ్యం. ప్రజల మధ్య ఓ గోడను నిర్మించడం ఈ దేశంలో సాధ్యంకాదు. సమాన ప్రాతినిధ్యం కాకపోయినా, కనీస ప్రమేయం నేడున్న అవసరం. అందుకోసం మత విశ్వాసాలను సంస్కృతి నుంచి వేరుపరచి చూడాల్సిన అవసరముంది. కారణం వీటిమధ్య ఓ సందిగ్ధ పరిస్థితి నెలకొని ఉంది. చట్టంలో ఉన్నట్లే జీవితంలో కూడా తప్పులు, అస్పష్టత ఉంటాయి. ఎన్నికల పదజాలంలో " అధికసంఖ్య" అంటే గణాంకాల సంఖ్య తప్ప, అధిక ప్రజల ఆకాంక్ష కాదు. ఇది సమాజానికి లోబడి ఉండదు. అదే విధంగా మైనారిటీ అన్నది సైతం 'లెక్కల్లో తక్కువ' మాత్రమే. మెజారిటీ, మైనారిటీ అనేవి కేవలం సామాజిక, రాజకీయ పదజాలం మాత్రమే! ఈ రెండూ కలిసి ఓ విలువైన తీర్పును మన ముందుంచుతాయి. రాజ్యాంగ పరంగా" భారతీయ పౌరసత్వం" లో బాధ్యతలు, విధులు, హక్కులు ప్రతి పౌరుడికీ సమానమే... ఇది మెజారిటీ వాదనకో, మైనారిటీ వాదనకో సంబంధించిన సమస్యకాదు.... రాజ్యాంగం పీఠిక ప్రకారం సౌభ్రాతృత్వానికి సంబంధించిన విషయం.

భారత రాజ్యంగంలోని ఆర్టికల్స్ 14,15, 16 చట్టబద్ధంగా పౌరులకున్న అవకాశాలు, సమానత్వం గురించి విస్తృతంగా చర్చించాయి. ఈ సమానత్వం అన్ని స్థాయిలలో, అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యతతో అమలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇదే మన ప్రధాన మంత్రి నరేంద్రమోడి గారి "సబ్‌కాసాత్, సబ్‌కావికాస్" నినాదం సారాంశం కూడా! ఈ స్థితిలోనే రాజ్యవ్యవస్థకు, న్యాయవ్యవస్థకు, రాజ్యాంగబద్ధమైన ఓ అధికారం ఉంది. రాజ్యాంగమిచ్చిన అవకాశాలను అమలు పరచడంలో న్యాయ వ్యవస్థ ఎక్కడా అపజయం పొందగూడదు. రాజ్యాంగం, చట్టం రెండూ ప్రజాజీవనానికి ఒక రక్షణ వ్యవస్థగా, బాధ్యతతో వ్యవహరించాలి.

భారత రాజ్యాంగంలో సుస్పష్టంగా వివరించిన బహుళత్వాన్ని, లౌకిక వాదాన్ని పరిరక్షించడానికి, ప్రస్తుత పరిస్థితులలో మనం ఎలాంటి అవకాశాలను కలిగి ఉన్నాం?

సమాధానం చూస్తే ఓ పెద్ద అబద్ధంలా కనిపిస్తుంది. తొలుతగా వ్యవస్థలో ఉన్న భిన్నత్వాన్ని కాపాడుకోవాలి. రెండవది, భారత ప్రజాస్వామ్యంలో రాజకీయ, న్యాయవ్యవస్థలను రక్షించుకుంటూ బహుళత్వాన్ని, లౌకిక వాదాన్ని పరిరక్షించే వ్యవస్థలకు పునరుజ్జీవనం పోయడం. రెండూ సమాంతరంగా కనిపిస్తాయి తప్ప ఒక దాని వెనుక ఒకటి ఉండవు. రాజ్యం ఆచరించే వాటిలో వ్యకిగత వాదాలు, కుతర్కాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎ (ఈ) మరియు (ఎఫ్) స్పష్ట పరచినట్లుగా, సౌభ్రాతృత్వ వాతావరణాన్ని ప్రోత్సహించాలి. ఇది రాజకీయ నాయకుల వలన వారి అనుచరుల వలన ఆచరణలోకి రావాలి. ఒక్క వాక్యంలో చెప్పాలంటే " రాజ్యాంగం ఇచ్చిన సౌభాతృత్వ అవకాశాలను నాయకులు, వారి అనుచరులు ఖచ్చితంగా పాటించి తీరాలి.

దీనికి అందరూ సూచించే ఒకే ఒక్క పదం "సహనం వహించడం". సహనం ఓ మంచి లక్షణం. ఇది "మూఢ విశ్వాసం" నుంచి ఓ స్వాతంత్ర్యం. భిన్న మతాలు, రాజకీయ సిద్ధాంతాలు, జాతిమతాలు, సమూహాలు, సంస్కృతులున్న సమాజంలో కార్యసాధనకు ఓ ఫార్ములా! బహుళత్వాన్ని కలిగిన, ఒక బలమైన సమాజాన్ని నిర్మించడానికి, కలిసి నివశించడానికి "సహనం" ఒక్కటే చాలదు. అర్ధవంతంగానూ, పరస్పర అంగీకారంతోనూ కలసి నడిస్తేనే సాధ్యం. వివేకానందుడు ప్రవచించినట్లు "మనం కేవలం పరమత సహనం కలిగి ఉండటమే గాదు. ఆ మతాలను ఆప్యాయంగా కౌగిలించుకొని ఆదరించ గలగాలి, ఎందుకంటే అన్ని మతాల మూల సారాంశం సత్యమేగాబట్టి".

అంగీకరించడమనేది సహనానికన్నా మరో ముందడుగు. సహనం నుంచి అంగీకరించడమన్నది ఓ ప్రయాణం. అది మన నుంచే ఆరంభమవ్వాల్సిన పయనం. సాటి ప్రజల పట్ల, వారి ఆలోచనల పట్ల సహానుభూతితో ఒకరినొకరు సంపూర్ణంగా అంగీకరించాల్సిన అర్థవంతమైన అవసరం. ఏదేదో అర్ధరహిత ఊహలనుండి, అనాది నుండి కొనసాగుతున్న వివక్షలను దాటి స్పష్టతతో గమ్యం చేరాల్సిన సమయం. ఇది కేవలం మాటలకు, చర్చలకు పరిమితం కానటువంటి అంశం. సమాజం భిన్న సమూహాలుగా విడిపోతున్న తరుణంలో ప్రజల మధ్య సద్భావనను, సదావగాహనను పెంపొందించాల్సిన ఓ జాతీయ అవసరం. క్రైస్తవులు, ముస్లీంలు, దళితులు వివక్షకు లోనవుతున్న ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో, అందరం కలసి వారి రక్షణకు భరోసా ఇవ్వవలసిన తరుణం.

దీనికోసం ప్రత్యామ్నాయం ఆలోచించాల్సిన అవసరం ఉంది. మన రాజకీయ వ్యవస్థ ప్రస్తుతం ఒక యుద్ధ వాతావరణాన్ని కలిగి ఉంది. అది మానసిక ఐక్యతకు సంబంధించి

పునరుజ్జీవనాన్ని కోరుకుంటున్నది. చట్టబద్ధంగా మనకున్న నిబద్ధత నేడు ప్రశ్నింప బడుతున్నది. రాష్ట్రాలలో, రాజ్యవ్యవస్థలో ఓ తీవ్రమైన ముప్పు మన కళ్లముందుంది. ఏకపక్ష నిర్ణయాలు, గుంపు పాలన, ప్రజాశాంతిని పోగొట్టి, జీవితాలను దుర్భరం చేస్తున్న వాతావరణం మన ముందు నేడు సుస్పష్టంగా కనబడుతున్నది. "మౌనంగా కొనసాగిన ఈ దేశ సంస్కృతి నేడు నిరసన స్వరాలను వింటున్నది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రీతిగా, నక్సలైట్ ఉద్యమ స్వరూపంగానో, భాషా ప్రాతిపదిక విభజనగానో, అస్థిత్వవాదాల ప్రశ్న లు రూపంలోనో, బలహీన వర్గాల సమస్యల రూపంలోనో, జాతీయతా భావం పేరుతోనే, చాపక్రిందనీరులా అంతర్గత సమస్యలు ఈ దేశాన్ని చుట్టుముట్టాయి. జాతీయతా వాదం పేరులో ఈ దేశాన్ని అతలాకుతలం చేస్తున్న సమస్యల సంఖ్య సామాన్యమైనది కాదు. జమ్ము కాశ్మీర్‌ని ఆవరించి ఉన్న రాజకీయ అస్థిరత్వం సామాన్యమైనది కాదు. మన దేశంలో అసమాన వ్యవస్థ నేడు మన కళ్లముందు నిలబడి ఉంది. భిన్న విషయాలల్లో, విభిన్న అంశాలలో మానసిక ఐక్యత లోపించిన ఈ సమాజంలో నైతికతతో ఐక్యభారత దేశాన్ని పునర్మించాల్సిన ఆవశ్యకత మన ముందుంది.

నేను రెండు "ఇజాలలో" నివశించాను అవి "బహుళత్వం" లౌకికవాదం. రెండు విలువల సమాహారం మాటలలో, చేతలలో వాటిని అనుభ విస్తూ రాజ్యాంగ స్ఫూర్తితో ఆచరించాల్సిన బాధ్యత నాపై ఉంది. ఇప్పుడు మీ అందరి అనుమతితో నేను మూడో "ఇజం" గూర్చి మాట్లాడబోతున్నాను. " అది ఆధునిక రాజ్యం "గురించి. ఇది సంపూర్ణంగా కొత్తది కాదు... ఎన్నో సంవత్సరాలుగా, మనలో జాతీయవా దాన్ని ప్రేరేపించే "ఇజమే"

ఈ ఆలోచనను ఎంతోమంది పరిశోధకులు పరిశోధించారు. భారతదేశ చారిత్రక పరిస్థితులు ఇందులో భాగమే. ప్రాంతీయతా, వలస పాలనల వారసత్వమే! 1920 నాటికి భిన్నత్వం కలిగిన జాతీయవాదాలతో ఉన్న మన దేశంలో, సాంస్కృతిక నేపథ్యాలు, వివిధ మతాలలో ఉన్న ప్రజలందరినీ ఒక త్రాటిపై నడిపించాల్సిన ఆవశ్యకత కలిగింది... అప్పుడే "రవీంద్రనాథ్ టాగూర్" దేశంలో విగ్రహారాధనపై తన అభిప్రా యాలను వెల్లడించారు.

" స్వాతంత్ర్యం సిద్ధించిన ఎన్నో దశాబ్దాల తర్వాత జాతీయవాదంపైనా, భారతీయతపైనా ఒక వాదనను కలగాపులగంగా కలిపి, మన ఆలోచనలపై రుద్దే ప్రయత్నం జరిగింది. దీనిలో ఒక ప్రధాన భాగంగా "జాతీయత" పేరుతో అమాయకులపై దాడులు జరుగుతున్నాయి. "అతి జాతీయ వాదం" పేరుతో ప్రజలలో అనిశ్చిత వాతావరణాన్ని, భయానక పరిస్థితులను సృష్టించడం జరుగుతున్నది. "

స్వాతంత్ర్యం సిద్ధించిన ఎన్నో దశాబ్దాల తర్వాత జాతీయవాదంపైనా, భారతీయతపైనా ఒక వాదనను కలగాపులగంగా కలిపి, మన ఆలోచనలపై రుద్దే ప్రయత్నం జరిగింది. ఇటీవల కాలంలో సైతం భారతదేశ బహుళ త్వాన్ని శుద్ధిచేసే కార్యక్రమాన్ని రాజకీయంగా, సాంస్కృతికంగా చేపట్టడం జరిగింది. దీనిలో ఒక ప్రధాన భాగంగా "జాతీయత" పేరుతో అమాయకులపై దాడులు జరుగుతున్నాయి. "అతి జాతీయ వాదం" పేరుతో ప్రజలలో అనిశ్చిత వాతావరణాన్ని, భయానక పరిస్థితులను సృష్టించడం జరుగుతున్నది.

దేశంలో అంతర్గతంగా శాంతి భద్రతల వాతావరణాన్ని సృష్టిస్తూ, బాహ్య ప్రపంచం నుంచి వచ్చే ప్రమాదాలనుండి ప్రజానీకాన్ని రక్షించాల్సిన ప్రథమ బాధ్యత ప్రభుత్వానిది... ఈ సందర్భంగా జార్జి వాషింగ్టన్ తన దేశ ప్రజానీకాన్ని ఉద్దేశించి దశాబ్దాల క్రితం చెప్పిన రెండు వాక్యాలను మీ ముందుంచుతాను. అవి "రక్షణ దళాలను పెంచుకుంటూ పోవడం ఏదేశ స్వేచ్ఛకైనా అమంగళకరమే"

పౌరసత్వం ఓ జాతీయ బాధ్యతను పౌరులపై ఉంచుతుంది. భిన్నత్వంలోని అనేకానేక అంశాలను, లక్షణాలను కలిగి ఉంటుంది. అనగా "అంతర్జాతీయంగా ఉన్న ప్రజాసమూహాలందరూ వారి వారి పౌరసత్వం పట్ల బాధ్యతగా వ్యవహరించడమే అసలైన జాతీయత". ఇదే విషయాన్ని ఇజ్రాయిల్ పరిశోధకుడు యేల్ తమీర్ ఇదే సమాన అర్ధంలో చెప్పింది. ఆమె అభిప్రాయంలో "స్వేచ్ఛా యుతమైన జాతీయత ఓ మానసిక అనుబంధం. సాటి మతాల పట్ల, వర్గాల పట్ల సహనం కలిగి భిన్నత్వం లోని సరళతను కలిగి, పరస్పర అవగా హనతో నివశించడం'' కాబట్టి జాతీయత అనేది ఓ భిన్న బావాల నిర్వచనం...




మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా ర్యాలీ

"మానవ హక్కుల పట్ల గౌరవంతో, సామూహికంగా, సాంస్కృతికంగా పరస్పర అవగాహనతో, స్వయం ప్రతిపత్తితో భిన్న సమాజాల వ్యక్తులు కలిసి జీవించడం. మరో విధంగా చెప్పాలంటే '' సాంస్కృతిక పరిధులతో, నిబద్ధతతో, పరస్పర సహకారంతో, గౌరవ ప్రపత్తులతో, సనాతనతను, ఆధునికతను కలిపి పుణికి పుచ్చుకుని ముందుకు స్వేచ్ఛగా కొనసాగడం." కాని దీనికి భిన్నంగా అసహనం, అహంకార పూరిత జాతీయతా భావాలను చూస్తున్నాం.

బహుళత్వం మరియు లౌకిక వాదంలో ఎన్ని చిక్కులున్నప్పటికీ ఈ రెండు వాదాలు కలగలసి, ఒక సానుకూల దృక్పథంతో, అభిప్రాయాలతో కొనసాగుతూ "అసహనాన్ని" పారద్రోల వలసిన అవసరం ఉంది. అతి వాదాన్ని స్వేచ్ఛలేని జాతీయతను ప్రేరేపించ కూడదు. అదే రాజ్యాంగ పీఠికలో సైతం భారతదేశంలో కుల,మత, ప్రాంత, సిద్ధాంత భేద భావాలు లేకుండా ఒకే పదంగా " భారతీయత" కొనసాగాలని సూచిస్తున్న ప్రధాన అంశంగా ఉన్నది.మన భారతదేశ లౌకిక ప్రజాస్వామ్యంలో "పరులు" అంటూ ఎవరూ లేరు అందరమూ "మనమే". అలా స్వీకరించని రోజున మన విలువలు హానికరంగా పరిణమిస్తాయి. ❋

**(అనువాదం : డాక్టర్ శమంతకమణి)**

# 7 దశాబ్దాల స్వాతంత్ర్య భారతం

డా॥ హేమలత



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు, సిఐటియు నేత

ఒక దేశం తన ప్రయాణం ప్రారంభించినపుడు నిర్దేశించుకున్న లక్ష్యాలవైపు పయనించిందా, లేదా? అని వెనుకకు తిరిగి చూసుకోవడానికి 70 సంవత్సరాల సమయం సరిపోతుంది.

మన పూర్వీకులు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడినపుడు, అది అసాధ్యమైన విషయంగా పరిగణించబడింది. వారు ఈ దేశ భవిష్యత్‌పట్ల, వారి పిల్లల, మనుమల, ముని మనుమల భవిష్యత్‌పట్ల ఒక దార్శనికతను కలిగి వున్నారు. వందల, వేల సంఖ్యలో కార్మికులు, రైతులు, యువకులు, విద్యార్థులు, మహిళలు అందరూ స్వాతంత్ర్యం కొరకు పోరాడే క్రమంలో వారికున్న ఆస్తిపాస్తులను, వారి యవ్వనాన్ని, వారి కుటుంబాలను, మరియు వారి జీవితాలను ఈ దార్శనికత కొరకు త్యాగం చేయడానికి సంకోచించలేదు. నిరక్షరాస్యతను, పేదరికాన్ని, అసమాతలను, నిరుద్యోగాన్ని మరియు కులం, మతం జాతి మరియు లింగ భేదం లేకుండా పౌరులందరూ సమాన అవకాశాలు పొందేటటువంటి, ఎటువంటి అణచివేతనైనా రూపుమాపేటటువంటి ఒక స్వాతంత్ర్య భారత దేశాన్ని వారు ఊహించినారు. సోషలిస్టు విధానంలో సోవియట్ యూనియన్ చేత ఏర్పాటు చేయబడిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు వారి కళ్ళముందున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యువత మరియు అన్ని ప్రగతిశీల వర్గాల ప్రజలు ఆ విధమైన సమాజం భారత దేశంలో రావాలని కోరుకున్నారు.

1931లో ప్రాథమిక కార్యక్రమం మరియు ఆర్థిక హక్కులపై చేయబడిన కరాచీ కాంగ్రెస్ తీర్మానంలో ఈ కోర్కెలన్నీ ప్రతిబింబించబడినాయి. పౌరులందరి జీవన ప్రమాణాలస్థాయి పెంపుదల మరియు పారిశ్రామిక కార్మికుల అవసరాల పరిరక్షణ ద్వారా, స్వాతంత్ర్య భారతదేశాన్ని ప్రగతి బాటలో నడిపించే ఆర్థిక స్వయం సమృద్ధి గురించి ఈ తీర్మానం చర్చించింది. వ్యవసాయ మరియు పారిశ్రామిక రూపాంతరాలలో రాజ్యం చాలా ప్రముఖ పాత్ర పోషిస్తుందని, సమాజంలోని అత్యంత పేదలకు ఆ ప్రయోజనాలు కలుగజేస్తుందని భరోసా యిచ్చారు.

1944లో బ్రిటిష్‌వారు ఈ దేశం విడిచి వెళ్ళవలసి వుంటుందన్న విషయం స్పష్టమైనపుడు, భారతదేశంలోని పెద్ద పారిశ్రామికవేత్తలు ఒక పెద్ద డాక్యుమెంట్‌ను ప్రచురించినారు. దానికి 'బొంబాయి ప్లాన్' అనే పేరుంది. స్వాతంత్ర్యం అనంతరం పారిశ్రామిక అభివృద్ధి కొరకు భారత దేశం అనుసరించవలసిన మార్గాలను ఆ డాక్యుమెంట్‌లో కొన్ని ప్రతిపాదనల రూపంలో పొందుపరచబడినాయి. యిది ప్రైవేట్ రంగానికి పెద్దపీట వేసింది. రాజ్య యాజమాన్యంలో వున్న అన్ని వ్యాపారాలు స్థిరంగా రాజ్యంచే నియంత్రించబడవలసిన అవసరం లేదని ఆ డాక్యుమెంట్ చెబుతుంది.

అదే సంవత్సరంలో 'పీపుల్స్ ప్లాన్' కూడ రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో ఎం.ఎన్.రాయ్ సహచరులు ముగ్గురు ప్రచురించారు. వీరి డాక్యుమెంట్ స్పష్టంగా సోవియట్ తరహా ప్రణాళిక పట్ల విశ్వాసాన్ని వ్యక్తపరచింది.

ఆ రకంగా స్వాతంత్ర్యం సిద్ధించే కాలం నాటికి మన దేశం ముందు రెండు విశాల ప్రత్యామ్నాయ ఆర్థిక పారిశ్రామిక విధానాలున్నాయి. జనవరి 17, 1948 నాడు ఖాజీ సయ్యద్ ఖరీముద్దీన్ అనే ఒక భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు ఒక ప్రైవేట్ వ్యక్తి యొక్క తీర్మానాన్ని కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టినాడు. దేశంలోని వనరులను, ముఖ్యమైన పరిశ్రమలను జాతీయం చేయడం, సహకార, సమిష్టి వ్యవసాయ విధానాలను అనుసరించాలన్న సూత్రం ఆధారంగా మన దేశం సోషలిస్టు ఆర్థిక విధానాన్ని అనుసరించాలని ఈ తీర్మానం పేర్కొన్నది.

కానీ మన పాలకవర్గాలు పెట్టుబడిదారీ విధాన మార్గాన్ని ఎంచుకున్నాయి. ఖరీముద్దీన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించకుండా నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించాడు. అది అంత ప్రభావాన్ని చూపించదు కాబట్టి దానిని ఉపసంహరించుకోవాలని నెహ్రూ ఒత్తిడి చేస్తాడు. యిది భారతదేశంలోని పెద్ద వ్యాపార వర్గాల ప్రభావం కాంగ్రెస్ నాయకులపై ఏ విధంగా ఉన్నదో సూచిస్తుంది. 1948లో అసెంబ్లీలో నాటి ఇండస్ట్రీ మరియు సప్లై మంత్రి శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేత ప్రవేశపెట్టబడిన పారిశ్రామిక విధానం విషయంలో కూడ యిది స్పష్టం అవుతుంది. యిది 'బొంబాయి ప్లాన్' లో సూచించిన విధానాలకు అనుగుణంగా వున్నది. ఈ విధానాన్ని సమర్థిస్తూ, యిది పారిశ్రామికవేత్తలకు 'ఒక మంచి అవకాశం, ఒక మంచి రంగాన్ని, ఒక మంచి లాభాన్ని' యిస్తుందని నెహ్రూ పేర్కొన్నాడు.

1956లో భారత ప్రభుత్వం తిరిగి ప్రకటించిన పారిశ్రామిక విధాన తీర్మానంలో, సామాజిక, ఆర్థిక విధానం యొక్క లక్ష్యం సోషలిస్ట్ సమాజపు తరహా విధానాన్ని అంగీకరిస్తూ, పారిశ్రామిక విధానపు అవసరాన్ని గుర్తిస్తూ, యివన్నీ సోషలిస్ట్ తరహా మార్గదర్శకాల ఆధారంగా నిర్వహించబడవలసి వుంటుందని, అది పార్లమెంట్ అంగీకరించినట్లు పేర్కొనడం జరిగింది. అదే సమయంలో, కేవలం అవసరం వున్నాయనుకుంటున్న పరిశ్రమలు, పెట్టుబడులు అవసరం అనుకున్న పరిశ్రమలు, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఏ పరిశ్రమలకైతే పెట్టుబడులు సమకూరుస్తాయో, ఆ పరిశ్రమలు మాత్రమే 'ప్రభుత్వరంగ సంస్థలు' గా వుంటాయి. ఎక్కువ పెట్టుబడులు అవసరం వున్న పరిశ్రమలు, ప్రైవేట్ పారిశ్రామికవేత్తలు తక్కువ సమయంలో లాభాలు పొందని కారణంతో పెట్టుబడులు పెట్టబడని పరిశ్రమలు మాత్రమే ప్రభుత్వ రంగంలో వుండిపోయినాయి.

ఆ రకంగా, రైల్వేలు, విమానయానం ద్వారా రవాణా, ఆయుధాలు మరియు మందుగుండు సామాగ్రి, అణుశక్తికి సంబంధించినవన్నీ కూడ కేంద్ర ప్రభుత్వం యొక్క గుత్తాధిపత్యం కిందకు వచ్చే విధంగా అభివృద్ధి చేయబడినాయి. ఐరన్ మరియు స్టీల్, బొగ్గు మరియు లిగ్నైట్, నౌకా నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీతో సహ కొన్ని యితర

**"అనేక ఆటంకాల మధ్య ప్రభుత్వరంగం దేశ పారిశ్రామిక అభివృద్ధిలో అపారమైన సహకారాన్ని అందించింది. పారిశ్రామిక పునాది ని, మన దేశం, ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించడంలో ప్రభుత్వ రంగం ఒక సాధనంగా పనిచేసింది."**

పరిశ్రమలలో కొన్ని కొత్త యూనిట్లు ప్రభుత్వరంగ సంస్థలుగా ఏర్పాటు చేయబడవలసివుండింది. ఆర్థిక పునాదులు వేయడానికి, ఉద్యోగ అవకాశాలు పెంచుకోవడానికి, ఆదాయ మరియు సంపద తారతమ్యాలు తగ్గించడానికి, గుత్తాధిపత్యాలను, కొద్దిమంది వ్యక్తుల చేతులలో కేంద్రీకరించబడిన సంపద పోగుపడడాన్ని అడ్డుకోడానికి, వీటి అన్నింటికి హామీ యిచ్చే విధంగా ప్రభుత్వరంగం ప్రధానమైన పాత్ర పోషించే విధంగా పారిశ్రామిక అభివృద్ధి జరగాలని పారిశ్రామిక విధానం పేర్కొన్నది.

కానీ భారతదేశ ప్రభుత్వం, తన 'సామ్యవాద' చతురత గురించి పెట్టుబడిదారీ వర్గంలో వున్న భావనల పట్ల చాలా జాగ్రత్త వహించింది. ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్‌ను యివ్వడంలో (రెండూ స్వదేశం మరియు విదేశాలలో) ఆర్థిక అభివృద్ధికి తాను చేసే గరిష్ట సహాయం కొరకు చేసే ప్రతి ప్రోత్సాహంలోనే (ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో) భారతదేశం యొక్క ప్రయోజనం వుంటుందని భారత ప్రభుత్వానికి నాటి ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు ఉపదేశించినపుడు, భారత ప్రభుత్వం వెంటనే నాటి ఆర్థికమంత్రి టి.టి. కృష్ణమాచారి నాయకత్వాన ఒక ఉన్నతస్థాయి కమిటీని అమెరికా పంపించింది. భారతదేశంలో యోచించబడిన సామ్యవాదానికి ఊహలో కూడ కమ్యూనిజం అని అర్థం కాదు. అది రాజ్యం యొక్క పెట్టుబడిదారీ వ్యవస్థ అనే అర్థం కూడ కాదు. యిది ప్రైవేట్ పోటీ వ్యాపారం కలిగి వున్న ఒక విధానం. ఈ విధానం ఒక ప్రధానపాత్ర పోషించడానికి కొనసాగుతుంది అని కృష్ణమాచారి ప్రపంచ బ్యాంక్ మరియు అమెరికా ప్రభుత్వానికి ధైర్యం చెబుతాడు.

ఈ నేపథ్యంలో మన దేశంలో ప్రభుత్వ రంగం ప్రారంభమయింది. ప్రభుత్వానికి న్యాయ సమ్మతమైన పంపిణీలోగాని, సామ్యవాద విధానపు సమాజంలో గాని ఏ విధమైన ఆసక్తిలేదు అనేది వాస్తవం. ఒక శాసనసభలోని సభ్యుడు ఎత్తిచూపినట్లుగా, ఎక్కడైతే ప్రైవేట్‌రంగం పెట్టుబడి పెట్టడానికి 'సిగ్గు' పడుతుందో, ఆ పరిశ్రమలలో ప్రభుత్వరంగ పెట్టుబడులు పెట్టి, ప్రైవేట్ రంగం దానిని తీసుకోవడానికి సిద్ధపడినపుడు వాటిని వారికి అప్పజెపుతారు.

అనేక ఆటంకముల మధ్య ప్రభుత్వరంగం దేశం యొక్క పారిశ్రామిక అభివృద్ధిలో అపారమైన సహకారాన్ని అందించింది. పారిశ్రామిక పునాది మరియు మన దేశం, ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించడంలో ప్రభుత్వరంగం ఒక సాధనంగా పనిచేసింది. కొన్ని ప్రభుత్వరంగ



నయా ఉదారవాద విధానాల అమలులో దొందూ దొందే

సంస్థలు (పిఎస్‌యులు) స్థాపించబడిన దూరప్రాంతాలలో నిర్మించబడిన టౌన్‌షిప్స్‌లో ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా ఆ ప్రాంత అభివృద్ధికి సహాయకారిగా వున్నాయి. ఈ ప్రభుత్వరంగ సంస్థలలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడం వలన వారికి ఉద్యోగ అవకాశాలుపెరిగి, వారియొక్క ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి.

కానీ, ప్రభుత్వరంగాన్ని కొల్లగొట్టిన విధానం, ఈ మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రైవేట్ రంగానికి మరియు 'మార్కెట్ శక్తులకు' అప్పజెప్పడం అనేది 1991లో దేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలులో భాగంగా వున్న ప్రభుత్వ విధానాల ఫలితంగానే జరిగింది. యింతకు ముందు ప్రభుత్వాల పాలనా సంరక్షణ ద్వారా లబ్ధిపొంది, ఈ కాలంలో సంపదను పోగుచేసుకున్న ప్రైవేట్ కార్పొరేట్ శక్తులు యిప్పుడు ఆర్థిక వ్యవస్థను స్వాధీన పరచుకోవడానికి సిద్ధంగా వున్నాయి.

యిది సామ్యవాదం బాగా యిబ్బంది పడిన కాలం. సోవియట్ యూనియన్ కొల్లగొట్టబడింది. తూర్పు యూరప్ దేశాలన్నీ కుప్పకూలిపోయినాయి. పరస్పర సంబంధాలున్న వర్గ శక్తులన్నీ సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారాయి. పెట్టుబడిదారి విధానం 'చరిత్ర యొక్క ఆఖరి దశ'గా ప్రకటించబడింది.

1970లో ఏర్పడిన పెట్టుబడిదారీ సంక్షోభానికి స్పందనగా, నయా ఉదారవాదం యింతటి ఔన్నత్యాన్ని సాధించింది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలైనటువంటి ఐ.ఎం.ఎఫ్. మరియు ప్రపంచ బ్యాంక్‌ల ద్వారా మొత్తం ప్రపంచం పైన ఈ నయా ఉదారవాద విధానాలు రుద్దబడుతున్నాయి. 1990 నాటికి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు, వాటి ఆర్థిక విధానాలలో భాగంగా ఈ నయా ఉదారవాద విధానాలను చేర్చుకున్నాయి. యూరప్‌లోని సోషల్ డెమోక్రటిక్ పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలతో సహా, అనేక ప్రభుత్వాలు, నేడు ప్రపంచంలో ఆధిపత్య భావజాలంగా పరి గణించబడుతున్న నయా ఉదారవాద విధానా లను అవలంభించాయి.

1991లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, 2014లో స్వంత మెజారిటీతో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో మరింత వేగం పుంజుకున్నాయి. కాంగ్రెస్ నాయకత్వాన వున్న యుపిఎ-2 ప్రభుత్వం చేత అమలు చేయబడిన ఈ నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజలలో ఏర్పడిన అసంతృప్తిని బిజెపి ఉపయోగించుకోగలిగింది మరియు ఈ విధానాలకు అంతం పలుకుతామని వాగ్దానం కూడ చేసింది. కానీ ప్రభుత్వరంగాన్ని కొల్లగొట్టి, ప్రైవేటీకరణ ద్వారా ఈ విధానాలను మరింత వేగంగా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్నది. ప్రణాళికాబద్ధంగా వున్న ఆర్థిక వ్యవస్థను అంతం చేయడానికి ప్లానింగ్ కమీషన్ రద్దుచేయబడింది. దాని స్థానంలో వచ్చినటువంటి నీతి ఆయోగ్‌కు ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించాలన్న పని అప్పజెప్పబడింది. అది యిప్పటికే మూతపడడానికి సిద్ధంగా వున్న 26 ప్రభుత్వరంగ సంస్థలు మరియు వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టకూడదనుకుంటున్న 10 ప్రభుత్వరంగ

> **❝ రక్షణ రంగాన్ని, రైల్వేను ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నాలు ఆందోళనకరంగా మారుతున్నాయి. ప్రభుత్వరంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసే 273 ఉత్పత్తులలో 182 ప్రైవేట్ రంగంలో ఉత్పత్తి చేయ బడడానికి వీలుగా ప్రభుత్వరంగం నుండి తీసివేయ బడినాయి. ❞**

సంస్థలతోపాటు, మొత్తం 74 ప్రభుత్వరంగ సంస్థలను గుర్తించడం జరిగింది. వీటిలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు (రక్షణ రంగం, స్టీల్, విద్యుత్, జనరల్ ఇన్సూరెన్స్, డ్రగ్స్ మరియు ఫార్మస్యూటికల్స్, ఏవియేషన్, భారీ ఇంజినీరింగ్ మరియు నిర్మాణరంగం మొ॥) ప్రైవేటీకరణ దిశగా గుర్తించబడినాయి. ప్రైవేటీకరణ లక్ష్యంగా గుర్తించబడిన రైల్వే రంగానికి సంబంధించి, ప్రభుత్వం వివేక్ దేవ్‌రాయ్ కమిటీ సిఫారసులను అమలు చేయడం ప్రారంభించింది.

రక్షణ రంగాన్ని, రైల్వేను ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నాలు ఆందోళనకరంగా మారుతున్నాయి. ప్రభుత్వరంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలచేత ఉత్పత్తి చేయబడే 273 ఉత్పత్తులలో 182 ఉత్పత్తులు ప్రైవేట్ రంగంలో ఉత్పత్తి చేయబడడానికి వీలుగా ప్రభుత్వరంగం నుండి తీసివేయబడినాయి. ప్రభుత్వం యిప్పటికే ప్రైవేట్ రంగానికి చెందిన సంస్థలకు లైసెన్స్‌లు మంజూరు చేసింది. ఆ విధంగా పబ్లిక్‌రంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను పనిగట్టుకొని తక్కువ ప్రయోజన సామర్థ్యం వున్న ప్రైవేట్‌రంగ సంస్థలలోకి నెట్టివేస్తూ, వాటిని మూసివేయడం అనివార్యం అన్న స్థితికి తీసుకొని రావడం జరిగింది. ప్రస్తుతం 41 ప్రభుత్వరంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలో ఏడింటిలో పనిలేకుండా పోయింది. యింకా 14 ఫ్యాక్టరీలలో వాటి సామర్థ్యంలో 50 శాతానికి పనిలేని పరిస్థితి వున్నది. మొత్తం 1,10,000 ఉద్యోగాలలో 50,000 ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే స్థితి వున్నది. దీనితోపాటుగా, ప్రభుత్వ నిధులతో నిర్వహించబడుతున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలోని మౌలిక సదుపాయాలను వినియోగించుకోవడానికి ఎంపిక చేయబడిన ప్రైవేట్‌రంగ సంస్థలకు అనుమతించే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) లోకి ప్రవేశించాలని, చిన్న ఆయుధాలు ఉత్పత్తిచేసే ప్రభుత్వరంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు మార్గదర్శకాలు యివ్వబడుతున్నాయి. యిక్కడ గుర్తించవలసిన విషయమేమంటే, ఈ ప్రభుత్వ రంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు మన సైన్యం, నావికాదళం మరియు ఎయిర్‌ఫోర్స్ యొక్క అవసరాలకు తగిన సామాగ్రిని సమకూర్చడంలో యింత వరకు ఏనాడూ విఫలం చెందలేదు మరియు అవి నాణ్యత కలిగిన అవసర సామాగ్రిని అందజేస్తూ వస్తున్నాయి. ప్రభుత్వం ఏకరూప దుస్తులు, దోమ తెరలు, బూట్లు మొదలగు సామాగ్రిని ఉత్పత్తి చేయడానికి ప్రైవేట్‌రంగ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేసింది. కానీ ఆ ప్రైవేట్‌రంగ సంస్థలు వాటిని సరియైన సమయానికి అందజేయలేకపోయాయి మరియు వాటియొక్క నాణ్యత విషయంలో సరియైన హామీని కూడ యివ్వలేకపోయినాయి. దీని ఫలితంగా ఈ వస్తువులను ఉత్పత్తి చేసే బాధ్యత తిరిగి ప్రభుత్వరంగ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు అప్పజెప్పవలసి వచ్చింది. కానీ ప్రభుత్వం మాత్రం, కార్పొరేట్ యజమానులకు సేవ చేయాలన్న అత్యుత్సాహంతో ఏ విధమైన గుణపాఠాలు నేర్చుకోవాలనుకోవడం లేదు.

చిన్న తరహా ఆయుధ సామాగ్రి మాత్రమే కాదు, ప్రభుత్వరంగ సంస్థలచే ఉత్పత్తి చేయబడే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, సముద్రంలో వుండే మరియు యితర సామాగ్రి లాంటి విలువైన ఉత్పత్తులన్నీ నియామకాల ఆధారంగా యిప్పుడు బిజెపి ప్రభుత్వంచేత ప్రైవేట్‌రంగ సంస్థలకు యివ్వజూపబడుతున్నాయి. రిలయన్స్ మౌలిక సదుపాయాలు, రాఫేల్ యుద్ధ జెట్ విమానాలు సరఫరా చేయడానికి ఫ్రాన్స్‌కు చెందిన దాసాల్ట్ ఏవియేషన్‌తో భాగస్వామ్యంలోకి ప్రవేశించినాయి. టాటా మరియు అమెరికాకు చెందిన లాక్‌హీడ్ సంస్థలు ఎఫ్16 యుద్ధ విమానాలను పాక్షికంగా ఉత్పత్తిచేస్తాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సహజంగానే కనుమరుగుకాబోతోంది. ఆ విధంగా, గడచిన 65 సం.లలో మన దేశంచేత నిర్మించబడిన మొత్తం రక్షణ రంగ ఉత్పత్తి మౌలిక సదుపాయాలు, వస్తువులు తయారుచేయడానికి ఏ విధమైన యోగ్యత, నైపుణ్యం లేనటువంటి ప్రైవేట్‌రంగ సంస్థలు కొల్లగొట్టుకోవటానికి అప్పగిస్తున్నారు. తుదకు విదేశీ ఆయుధ సంపత్తి మరియు ఉపకరణాల పరిశ్రమలు మన దేశం యొక్క రక్షణరంగ ఉత్పత్తులపై ఆధిపత్యం వహిస్తాయి. మన భద్రతా సైన్యం యొక్క సన్నద్ధత పూర్తిగా విదేశీ ఆయుధ పరిశ్రమలపై ఆధారపడి వుంటుంది. బిజెపి ప్రభుత్వం, జాతీయవాద నినాదాలను జపించడం మరియు మన సరిహద్దు ప్రాంతాల రక్షణ చర్యలు చేపడుతున్న మన సైనికుల పట్ల చూపిస్తున్న తప్పుడు సానుభూతి వెనుక వున్న ఈ జాతి వ్యతిరేక చర్యలను కప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్నది.

అదే విధమైన జాతి వ్యతిరేక చర్య రైల్వే రంగాన్ని ప్రైవేటీకరించడం. మన దేశంలో ప్రతిరోజు కోట్ల మంది ప్రజలు, ముఖ్యంగా పేదలు ఉపయోగించుకుంటున్న అతి చౌక అయిన ప్రజా రవాణా వ్యవస్థ రైల్వే. ప్రభుత్వం ఒక కార్యనిర్వాహక ఆజ్ఞ ద్వారా రైల్వే అభివృద్ధి అథారిటీని (RDA) ఏర్పాటు చేసింది. ఈ ఆర్.డి.ఎ. ప్రస్తుతం ఉనికిలో వున్న రైల్వే మార్గాలను ప్రయాణీకులు మరియు వస్తువులు రవాణా చేసే రైళ్ళను నడిపించే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెపుతుంది. యిది ఖర్చుల ఆధారంగా ప్రయాణ మరియు రవాణా ఛార్జీలను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ప్రయాణీకుల ఛార్జీలు 53 శాతం, ఖర్చు 47 శాతంలో రాయితీలు కూడా వున్నాయి. నిత్యావసర సరుకులపై వున్న రాయితీలు కూడ తీసివేయబడతాయి. రైల్వే కోచ్‌లు, వ్యాగన్లు మరియు ఇంజన్ల నిర్వహణ కొరకు ప్రస్తుతం వున్నటువంటి యార్డులు, షెడ్లు మరియు వర్క్‌షాపులలో కూడ ప్రైవేట్ ఆపరేటర్లు అనుమతించబడతారు.

దేశంలోని 'ఎ' మరియు 'ఎ' కేటగిరీ రైల్వేస్టేషన్లను 'ప్రపంచశ్రేణి' రైల్వేలుగా మార్చాలన్న నెపంతో, వాటిని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి మార్గదర్శకాలు కూడ తయారు చేయబడినాయి. యిప్పటికే హౌరా, ముంబై, చెన్నై, బెంగళూరు మరియు హైదరాబాద్‌లతో సహా, 23 రైల్వేస్టేషన్లకు టెండర్లు వేయబడినాయి. స్టేషన్‌ను నిర్వహించే ప్రైవేట్ కాంట్రాక్టర్లే స్టేషన్ ఫెసిలిటేషన్ మేనేజర్లు (ఎస్ఎఫ్ఎం) గా వుంటారు. ఈ ఎస్ఎఫ్ఎం లు తమ స్వంతంగా ఉద్యోగులను నియమించుకుంటారు. యిప్పటికే ఆయా స్టేషన్లలో వున్న ఉద్యోగులు మరియు దానికి సంబంధించిన ఉద్యోగాలు ఎక్కడికైనా బదిలీ చేయబడతాయి.

రైలు యింజన్లు మరియు కోచ్‌లు ఉ

> **"ఇటీవల నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, ఉద్యోగ కల్పనను సమకూర్చే, తయారీ రంగం యొక్క వృద్ధిరేటు భారతదేశంలో గత 25 సం.లుగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లలో ఉద్యోగాల కొరకు నమోదు చేయించుకున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2015లో ఆ సంఖ్య 4.82 కోట్లుంటే, 2015 మొదటి 9 నెలల్లో అది 4.48 కోట్లకు పెరిగింది. ఏడాదికి యిది 5.98 కోట్లకు పెరుగుతుంది."**

తృప్తిచేసే ప్రభుత్వరంగ సంస్థల యూనిట్లు ఏ పనిలేకుండా ఉండిపోయినాయి. మన వద్ద తయారుచేయబడే కోచ్‌లు మరియు యితర ఉత్పత్తులు బయటినుండి దిగుమతి చేసుకోవడమే దీనికి గల కారణం. యిది 'మేక్ ఇన్ ఇండియా' వాస్తవ పరిస్థితి.

వాస్తవానికి మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వంచే యివ్వబడిన 'మేక్ ఇన్ ఇండియా' 'స్కిల్ ఇండియా' 'స్టార్టప్ ఇండియా' నినాదాలు, నయా ఉదారవాద విధానాల యొక్క ప్రభావాన్ని మరియు ఉద్యోగ కల్పన గురించి ప్రభుత్వం కల్పించిన భ్రమలను దాచి ఉంచడానికి మాత్రమే ఉద్దేశించబడినవి. 2014 పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో నిరుద్యోగానికి వ్యతిరేకంగా ప్రజలలో వున్న అసంతృప్తిని ఉపయోగించుకునే ఉద్దేశ్యంతోనే మోడీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసినాడు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధానమంత్రి విదేశాలు పర్యటిస్తూ, అతి చౌకగా మీకు కార్మికశక్తిని అందజేస్తానని హామీయిస్తూ విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాడు. ప్రభుత్వం మాత్రం వ్యాపారాలను వృద్ధి చేయడానికి తాను అనుకున్న విధంగా కార్మిక చట్టాలను మారుస్తూ పోతుంది.

రైల్వేలు, రక్షణ రంగ తయారీ, ఐటి, టెక్స్‌టైల్స్, నిర్మాణం, తోలు పరిశ్రమ, ఓడలు మరియు ఓడరేవులు, టూరిజం లాంటి వాటితో సహా 21 రంగాలను 'మేక్ ఇన్ ఇండియా' పథకం కొరకు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వీటిలో ఎక్కువగా కార్మికులు అవసరం వున్న రంగాలున్నాయి. కానీ ఈ 3 సంవత్సరాల కాలంలో సృష్టించబడిన ఉద్యోగాల సంఖ్య చాలా అధ్వాన్నంగా వున్నది. గత సంవత్సరం కేవలం 2.3 లక్షల కొత్త ఉద్యోగాలు ఎనిమిది ప్రధాన వ్యవసాయేతర రంగాలలో (తయారీరంగం, నిర్మాణరంగం, వ్యాపారం మరియు రవాణా, వసతులు మరియు రెస్టారెంట్స్, ఐటి/బిపిఓ, విద్య మరియు వైద్యం) కల్పించబడినాయి. ఈ రంగాలలో 2 కోట్ల పైన కార్మికులు నియమించబడవలసి వుంది. అంటే కేవలం 1.1 శాతం కొత్త ఉద్యోగాలు మాత్రమే కల్పించబడినాయి. వీటిలో 2.1 లక్షల ఉద్యోగాలు కేవలం విద్య మరియు వైద్య రంగాలలోనే కల్పించబడినాయి. మిగిలిన అన్ని రంగాలలో ఉద్యోగాలు లేవు, ఉద్యోగ కల్పన కూడ లేదు.

ఇటీవల నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, ఉద్యోగ కల్పనను సమకూర్చే, తయారీ రంగం యొక్క వృద్ధిరేటు భారతదేశంలో గత 25 సం.లుగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లలో ఉద్యోగాల కొరకు నమోదు చేయించుకున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2015లో ఆ సంఖ్య 4.82 కోట్లుంటే, 2015 మొదటి 9 నెలల్లో అది 4.48 కోట్లకు పెరిగింది. సంవత్సరాంతానికి యిది 5.98 కోట్లకు పెరుగుతుంది.

ఈ నిరుద్యోగ సమస్యకు ప్రధానమైన కారణాలలో ఒకటి ఏమంటే ప్రపంచీకరణ సంక్షోభం కొనసాగుతున్న సందర్భంలో ఎక్కువ లాభాల కొరకు చేసే ప్రయత్నంలో, పెట్టుబడిదారులు కూలీ ఖర్చులను తగ్గించుకోడానికి ఎక్కువ పెట్టుబడులతో నడిచే సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఉదాహరణకు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కర్ణాటక రాష్ట్రంలో చేసిన ఒక ఆర్థిక సర్వే ప్రకారం 7.4 లక్షల పెట్టుబడితో సగటున ఒక ఉద్యోగం సృష్టించబడింది 2006-07లో. 2014-15 నాటికి యిది 60 రెట్లు పెరిగింది. అంటే 4.5 కోట్ల పెట్టుబడికి ఒక ఉద్యోగం సృష్టించబడింది. యిది అన్ని తయారీ మరియు సేవా రంగాలలో సాధారణంగా వున్న పరిస్థితి.

పారిశ్రామిక ఉత్పత్తి సూచిక, పారిశ్రామిక ఋణాల పెంపుదలకు సంబంధించి ఆర్.బి.ఐ. యిచ్చిన గణాంకాలతో సహా అన్ని కొత్తగా ఉత్పత్తి చేయడానికి ప్రైవేట్ కార్పొరేట్ రంగం పెట్టుబడులు పెట్టడం లేదని సూచిస్తున్నాయి.

2008లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం వల్ల, దశాబ్దకాలంగా ఈ స్థితిలో ఏ విధమైన తగ్గుదల లేకుండా కొనసాగుతుంది. ప్రజల అవసరాలే ప్రధానం కాకుండా, లాభం మాత్రమే పరమావధిగా వుండే పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు ఒక భాగంగా వుంటాయి. సంక్షోభాల నుండి పెట్టుబడిదారి వర్గం బయటపడి, కార్మికుల ఖర్చులను తగ్గించి, సంక్షోభ భారం అది కార్మికులపైన, యితర కష్టజీవులపై మోపి లాభాలు పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో శ్రమ ఖర్చులు తగ్గించుకోవడానికి కృత్రిమ ప్రతిభలాంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించబడుతుంది. అనేక పరిశ్రమలలో మానవుల స్థానంలో రోబోలు వచ్చి చేరతాయి. కానీ నిరుద్యోగం కారణంగా ప్రజల వద్ద కొనుగోలు శక్తిలేక పోవడం వలన పెట్టుబడిదారులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేకపోవడం అనేది యిక్కడున్న వైరుధ్యం. రోబోలు అవి తయారుచేసిన వస్తువులను అవే కొనుక్కోలేవు. కాబట్టి పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు అనివార్యం.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వివిధ ప్రభుత్వాలు, కార్మికుల ప్రయోజనాలకన్నా పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాయి. మన పాలకులు ఎంపిక చేసుకున్న పెట్టుబడిదారి విధానం కారణంగానే, యిప్పుడున్న విధానాలు అమలు జరపబడుతున్నాయి.

ఎన్నో త్యాగాలు చేసి, మన దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడిన మన పూర్వీకుల దార్శనికత వాస్తవరూపం దాల్చడానికి, సామాజిక ఉత్పత్తి క్రమానికి మరియు కార్మికులు సృష్టించిన మిగులు అనుభవించే వ్యక్తికి మధ్య వున్న వైరుధ్యం పరిష్కరించబడాలి. పరిష్కారం కార్మికవర్గానికి అనుకూలంగా చేయవలసి వుంటుంది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడానికి, ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం సాధించడానికి జరిగే ఈ పోరాటంలో కార్మికవర్గం నాయకత్వం వహించాలి. కష్టజీవులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగ యువత మొదలగు అన్ని వర్గాల ప్రజలను కులం, మతం, ప్రాంతం, లింగ భేదాల తేడా లేకుండా ఐక్యం చేయాలి. యిదే కార్మికవర్గం ఈ విధానాలకు భిన్నమైన విధానాల సాధన కొరకు, యిప్పుడున్న విధానాన్ని మార్చుడానికి పోరాడవలసి వుంటుంది.

**(అనువాదం: బోడపట్ల రవీందర్)**

*

# భూ సమస్యను ముందుకు తెచ్చిన తెలంగాణా సాయుధ పోరాటం

(2వ పేజీ తరువాయి)

ములచే బేదఖల్ చేయబడిన, భూములు కబళించబడిన రైతులు, ఆ భూస్వాముల చేతనే ఇప్పుడు బేదఖలు చేయబడిన రైతులూ యావన్మందిని ఐక్యం చేయటం, తక్షణమే ఆచరణకు రావలసిన కర్తవ్యంగా రూపొందింది. అందువల్ల ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుపార్టీ ఎలాంటి తటాపటాయింపు లేకుండా 'అక్రమంగా కబళించబడిన భూములను అసలు రైతులకు అప్పగించాలి' అనే సామాన్య రైతాంగపు నినాదాన్ని చేపట్టాయి. ఇది దావానలంలాగా వ్యాప్తిగాంచింది.

ఈ నినాదం ఫలితంగా పంచాయతీ కమిటీలకు, సంఘం కార్యకర్తలకు అనేక సమస్యలు ముందు నిలిచాయి. భూస్వాములు ఆ భూములను మరికొందరు ఇతర చిన్న రైతులకు కౌలుకివ్వటమో, వాళ్ళకు అమ్మటమో జరుగుతుంది. అందువలన అన్ని సందర్భాలలోనూ ఈ భూములను అసలు స్వంత దారులకు అప్పగించటం సాధ్యంకాదు. ఎందుకంటే కొత్తగా స్వంతదారులైన వీరు కూడా కాస్తంత మెరుగైన పరిస్థితిలో ఉన్నా సన్నకారు రైతులే. భూస్వాములకు, నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ మన శిబిరంలో ఉన్నవారే. కార్యకర్తలు, పంచాయతీ కమిటీలు వారికి అంతమంచి భూమిని, లేదా అంతకంటే సారవంతమైన దానినో, ఆ భూస్వాములకు చెందిన దానినే నష్టపరిహారంగా ఇవ్వజూపినా, రైతులు 'ఆ భూములనే ప్రస్తుతం ఆక్రమణ దార్లకివ్వండి, మా తాతముత్తాలత నుండి అనుభవిస్తూ వచ్చిన ఆ భూమినే మాకివ్వండి' అని పట్టుబట్టడం కద్దు. తమకే దక్కాలనే ఇద్దరు రైతుల మధ్య అతి కష్టంమీదగాని అంగీకృత పరిష్కారం సాధించటం కుదిరేది కాదు. ఉభయులకూ నచ్చచెప్పి, పరిష్కారం చేసే పద్ధతే అనుసరించబడింది. పైనుండి ఏదో పరిష్కారాన్ని వాళ్ళ నెత్తిన రుద్దటం లేదు. ఐక్యత ఆవశ్యకతను గుర్తించటం వల్లనూ, ప్రజాభిప్రాయానికి తలనొగ్గి వారు సర్దుబాటుకు రావటం జరుగుతుండేది.

తాను కోల్పోయిన పాత నేలనే తిరిగి పొందాలని రైతు పట్టుబట్టడమనేది గుర్తు చేసుకోవలసిన ప్రధానాంశం. తనకివ్వజూపిన కొత్త భూమి భూస్వామికి కాగా, 'అది నాది' అనే తన ఆస్తి సంబంధమైన మనోభావం ఫలితంగా గాని, తన స్వంతభూమి తన చేతుల్లో ఉంటే, అది న్యాయ సమ్మతమైన హక్కని, దానిని మరెవ్వరూ తననుండి గుంజుకొనజాలరన్న విశ్వాసం కారణంగా గాని, మరొకరికి చెందిన భూమిని తాను తీసుకుంటే 'న్యాయసమ్మతమైన' 'శాశ్వత యాజమాన్య హక్కు'కు అంతటి హామీ ఉండదని భావించడం వల్లగాని వారలా కోరటం జరిగేది. అంతేకాదు, భూస్వాముల మిగులు భూములను ఆక్రమించుకునేట్లు చేయటం కన్నా, తాను కోల్పోయిన భూములను తిరిగి ఆక్రమించుకోవటమనే సమస్యపై రైతును కదిలించటం మరింత సులభమనే విషయం కూడా గమనించబడింది. భారత యూనియన్



పోరాటం ఫలితంగా బంజరు భూములు, భూస్వాముల మిగులు భూములు పదిలక్షల ఎకరాలు పేదలకు పంచారు

సైన్యం జోక్యం తరువాత, భూస్వాములు, దేశముఖులు తిరిగి వచ్చిన తర్వాత, రైతులు తాము సాగుచేసుకుంటూ వచ్చిన భూస్వాముల మిగులు భూములను మరింత సులభంగా వదులుకున్నారు. తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకున్న తమ స్వంత భూములను నిలబెట్టుకొనటానికి తుదికంటా పోరాటం సాగించారు. ఇది కూడా గమనార్హమైన లక్షణం. రైతాంగం ఆధీనంలో ఉన్న భూమిలో అత్యధిక భాగం ఈ విధంగా తిరిగి ఆధీనంలోకి తెచ్చుకున్న భూములు, కౌలుభూములు, గ్రామాల పేదలు కొత్తగా తుప్పలు కొట్టి, ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్న బంజరు భూములు మాత్రమే. కాగా, పంపిణీ చేయబడిన మిగులు భూములలో చాలా భాగం భూస్వాములచే తిరిగి స్వాధీనం చేసుకోబడినాయి.

**బంజరు భూములు**

అదేవిధంగా సంవత్సరంలో గణనీయమైన భాగంలో ఒక విధంగా గ్యారంటీగా ఉపాధిని కల్పించే ఏకైక వనరు భూమే కావటం వల్ల, గ్రామీణ పేదలు భూదాహంతో ఉన్నారు. అందువల్ల, వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేద రైతులు, ప్రభుత్వం కిందనో, భూస్వాముల ఆక్రమణ కిందనో గల బంజరు భూములను ఆక్రమించుకొన్నారు. అప్పు పుట్టాలన్నా, ఇతర సౌకర్యాలు పొందాలన్నా, భూమి కలిగి ఉండటం ప్రాతిపదికగా ఉంది. అదొక గౌరవ చిహ్నంగానూ ఉండేది. పరిస్థితి ఇప్పటికీ అంతే. ఈ భూములను సాగుచేసుకోవడం ఎంతో కష్టం. పెద్ద పెట్టుబడులు పెట్టకుండా, నీటిపారుదల సౌకర్యాలు కల్పించకుండా ఎక్కువ పంటలు పండించటం కష్టం. అయినప్పటికీ లక్షలాది ఎకరాల భూమి ఆక్రమించుకోబడింది. గ్రామంలోని బంజరు భూమిలో పదిశాతం సమిష్టిగా పశువులు మేపుకొనటానికి, ఇతర సమిష్టి అవసరాల కోసం వదిలి ఉంచాలనే పాత నిబంధనలు విస్మరించబడినాయి. అదేవిధంగా ఫారెస్ట్ ప్రాంతంలోని సాగుకు లాయకైన భూమి కూడా ఆక్రమించబడింది.

పోలీసుచర్య అనంతరం, ఈ భూములను తిరిగి తీసుకోవడానికి ప్రభుత్వం సర్వశక్తులా ప్రయత్నించింది. అయితే ఆ ప్రయత్నంలో అది దారుణంగా విఫలమైంది. ఈ బంజరు భూములను సాగు చేసుకోవటానికి అనుమతించేట్లయితే, తమ పశువులను, గొర్రెలను మేపుకొనటానికి భూమిలేకుండా పోతుందని చెప్పి, గొర్ల కాపరులను, హరిజనులపైకి, వ్యవసాయ కార్మికులపైకి ఉసిగొల్పటానికి వారు ప్రయత్నించారు. అయినా తెలంగాణ రైతు ఉద్యమం అలాంటి ఆటంకాలన్నింటినీ అధిగమించింది. ఇరవై సంవత్సరాల తర్వాత ఈనాటికీ, ఈ భూములపై పట్టా హక్కులు, యాజమాన్య హక్కులు పొందటం కోసం పోరాటం కొనసాగిస్తూనే ఉంది. సాగుదార్లలో అత్యధిక సంఖ్యాకుల విషయంలో ప్రభుత్వం క్రమక్రమంగా ఈ

డిమాండ్‌కు అంగీకరిస్తూ ఉంది.

**భూస్వాముల మిగులు భూములు**

ఈ విధంగా బంజరు భూములను ఆక్రమించుకున్నా బేదఖళ్లను నిరోధించినా, గతంలో అక్రమంగా స్వాహాచేయబడి భూములను తిరిగి సంపాదించుకున్నా, గ్రామీణ పేదల భూదాహం తీరలేదు. భూమి కావాలన్న వారి కోర్కెకు తృప్తి కలగలేదు.

ఈ విధంగా భూస్వాముల భూములను స్వాధీనం చేసుకోవటమనే సమస్య, ఉద్యమం ముందు నిజమైన, ఆచరణ సంబంధమైన, సమస్యగా తయారైంది. ఈ బడా దేశముఖుల, పట్టాదార్ల, జాగీర్దార్ల భూములను స్వాధీనం చేసుకొని పంపిణీ చేయటం రాజకీయంగా సులభమూ, అవసరమునూ, అయితే భూ దాహాన్ని ఎంతో కొంతమేరకు సంతృప్తిపరచడానికి, తర్వాత ప్రజాపోరాట పునాదిని దిటవుపరచి నిలదొక్కుకొనటానికి గానూ, మిగులు భూమినంతటినీ స్వాధీనం చేసుకొనే విషయాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచించటం అవసరమైంది.

ఐదుపదుల ఎకరాలకు పై సగం భూములను స్వాధీనం చేసుకోవటంతో ఈ చర్య ప్రారంభమైంది. నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ మనతోపాటు నిలిచిన పెద్ద భూస్వాములు కొందరున్నారని రాజకీయంగా ఒక వాదన చేయబడింది. పార్టీ నాయకత్వం ఆ వాదనను అంగీకరించింది. అలాంటివారిని మనతోనే నిలబెట్టుకొనటంకోసం, మనం గరిష్ట పరిమితిని తగినంత హెచ్చుగా ఉంచవలసి వచ్చింది. అంతేకాదు, 1946లో ఆంధ్రలో 'విశాలాంధ్రలో ప్రజాస్వామ్యం' అనే ఎన్నికల కరపత్రంలో వంద ఎకరాల గరిష్ట పరిమితి, స్వాధీనం చేసుకున్న భూమికి తగిన నష్టపరిహారం అనే నినాదమిచ్చిన విషయం కూడా దృష్టిలో ఉంది.

అయితే తెలంగాణా ఉద్యమం పెంపొందిన కొలది భూమి కావాలన్న కోర్కె అంతకంతకూ తీవ్రమైనకొలదీ, భూగరిష్ట పరిమితులు రెండువందల ఎకరాలకు తగ్గించబడినాయి. చివరకు 1948 మధ్యభాగానికల్లా వంద ఎకరాలు మెట్ట, పది ఎకరాల మాగాణి గరిష్ట పరిమితిగా నిర్ణయించబడింది. అయితే దానిని అమలు జరిపేటప్పుడు పలువురు అన్నదమ్ములుగల ఉమ్మడి కుటుంబానికి ఇది వర్తిస్తుందా? అనే ప్రశ్న తలెత్తింది. పంపిణీ కోసం తగినంత భూమి కావలసిన ఆవశ్యకత దృష్ట్యా ఉమ్మడి కుటుంబానికయినా సరే పది ఎకరాల మాగాణి, వంద ఎకరాల మెట్ట గరిష్ట పరిమితిగా ఉండాలని స్పష్టం చేయబడింది. అయితే అదే సమయంలో ఉద్యమంలో చేరే అవకాశం ఉన్నవారి భూములను మనం స్వాధీనం చేసుకోరాదనే విషయం కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కాని ఈ వివరణలివ్వటానికి, వాటిని అమలు జరపటానికిముందే 'పోలీసు చర్య' అడ్డం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత ప్రకటించిన గరిష్ట పరిమితులతో వీటిని పోల్చిచూడండి.



తెలంగాణా సాయుధ పోరాటంలో రైతులకు గెరిల్లా శిక్షణ

హైదరాబాద్ ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట పరిమితి 50 ఎకరాల మాగాణి, 250 ఎకరాల మెట్ట, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని 27 ఎకరాల మాగాణి, 216 ఎకరాల మెట్టకు తగ్గించింది. ఈ గరిష్ట పరిమితులు, తెలంగాణా ఉద్యమం విధించ తలపెట్టిన వాటికంటే చాలా ఎక్కువే. అంతేకాదు ఆ చట్టంలో అనేక లొసుగులున్నాయి. అదసలు అమలు జరపబడనే లేదు. మిగులు భూమిని స్వాధీనం చేసుకోవటంగాని, పంపిణీ చేయటంగాని జరగనే లేదు.


పైగా భూస్వాములు తమ మిగులు భూములను కొనుక్కోగల వాళ్ళకు అమ్ముకొనటానికి అనుమతిచంటం జరిగింది. అంతేగాదు, భూమిని తక్కువ ధరలకు కొనేందుకు మొదటి అవకాశం రక్షిత కౌలుదార్లకివ్వబడింది. తెలంగాణా ప్రాంతంలో చాలా పెద్ద మొత్తంలో భూములను కౌలుదార్లు కొనటమో, నిలబెట్టుకొనటమో జరిగింది. తెలంగాణాలో సైతం, 1960 నాటికల్లా, రక్షిత కౌలుదార్లలో నూరింట యాభైమంది బేదఖలు చేయబడ్డారు. అలా తొలగించబడినవారిలో అత్యధికభాగం, తెలంగాణా ఉద్యమం విస్తరించి లోతుగా వేదూనని జిల్లాలకు, ప్రాంతాలకు చెందినవారే.

1946 ఎన్నికల కరపత్రంలో ఆంధ్రలో పార్టీ సూచించిన గరిష్ట పరిమితి, సంస్కరణవాద అవగాహనుండి రూపొందినట్టివేననే విషయం విదితమే. అందులో ఆనాటి వర్గ విభజనను విశ్లేషించడం, తగిన వ్యవసాయ కార్యక్రమాన్ని రూపొందించడం జరగలేదు. ఫ్యూడల్ దోపిడీ సాగిస్తూ, విపరీతమైన కౌళ్ళు గుంజుతూ, అధిక వడ్డీరేట్లు పిండుతూ, ఇతర అక్రమ నిర్బంధ వసూళ్ళుచేస్తూ, నైజాముతో చేతులు కలిపిన భూస్వాముల భూములను, జాగీర్దార్ల, దేశముఖుల భూములను, స్వాధీనం చేసుకోవటం జరుగుతుందనే నినాదాన్ని తెలంగాణలో పార్టీ ప్రచారంలో పెట్టియుండవలసింది. నైజాం వ్యతిరేక ఉద్యమంలో కలిసొచ్చే భూస్వాములకు తమ కుటుంబ సభ్యుల శ్రమతోనూ, కూలీలతోనూ సొంతంగా సాగుచేసుకుంటూ సాఫీగా జీవితం సాగించటానికి, తగినంత భూమిని వదలటం జరుగుతుందని పేర్కొని ఉండవలసింది. ఉద్యమాభివృద్ధిపై ఆధారపడి, ఆ నినాదాన్ని ఆచరణలో పెట్టడం మరింత త్వరితంగా జరిగి ఉండవలసింది. పార్టీ భూ పంపిణీని దైర్యంగా జరిపి ఉండవలసింది. అలా జరిగితే ఉద్యమం ఉధృతి మరింత విస్తృతంగా ఉండిఉండేది.

మిగులు భూములను స్వాధీనం చేసుకోవటం, దాన్ని పంపిణీ చేయటానికి పూనుకోవటం, పోరాడుతున్న జనసామాన్యం నుండి ఒత్తిడి అధికమైన మీదటనే జరిగిందనే విషయాన్ని, కొంత తటపటాయింపు అనంతరం 1947 చివరిభాగంలో మాత్రమే, అందుకుగాను పొలిట్‌బ్యూరో నుండి అనుమతిపొందటం జరిగిందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొనటం ముఖ్యం. ఆనాడు పార్టీ నాయకత్వం, 1947 ఆగస్టులో సాధించబడిన స్వాతంత్ర్యాన్ని దిటవుపరచటం పేరుతో సంకుచితమైన వల్లభాయ్ ముఠాకు వ్యతిరేకంగా, అభ్యుదయకాముక కాంగ్రెస్ సెక్షన్‌లలో సంఘటనను (జాతీయ సంఘటన) నిర్మించే విధానాన్ని అనుసరిస్తూ ఉంది. ❃

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-09-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# జాతుల సమస్య పరిష్కారంలో బూర్జువా పార్టీలు విఫలం



**– బి టి రణదివే**

విభిన్న జాతుల మధ్య ఐక్య భావాన్ని చేకూర్చడంలో విఫలమైనందున ఇప్పటికీ చెడు పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. ఈశాన్య భారతంలో ఈ సమస్య అత్యంత తీవ్ర పరిణామాలకు దారి తీసింది. అక్కడ మిలిటరీని ప్రవేశపెట్టి పరిస్థితులను చక్క పరచవలసిన స్థితి ఏర్పడింది. తీవ్రమైన జాతీయ దురభిమానాలతో మిజోరామ్, నాగాలాండ్, మణిపూర్‌లు కల్లోలిత ప్రాంతాలుగా తయారైనాయి. తమను అసమానత్వంతో చూస్తూ అన్యాయం చేస్తున్నారన్న భావం ఆ రాష్ట్రాల్లో ఏర్పడింది. బూర్జువా–భూస్వామ్య ప్రభుత్వం అనుసరించే దివాళాకోరు విధానాలే నగ్నంగా ఈ విచ్ఛిన్నానికి దారితీస్తున్నాయి. తతిమ్మా ఈశాన్య రాష్ట్రాల్లో కూడా పరిస్థితి సవ్యంగా లేదు. ఇతర ప్రాంతాలు తమపై ఆధిపత్యం వహించుతున్నాయనే భయంతో ప్రాంతీయ వేర్పాటు వాతావరణం సహజంగానే అక్కడ నెలకొంటున్నది. పాలకవర్గ పార్టీ, కేంద్ర ప్రభుత్వం కూడా సమైక్యతా సంబంధాలను నెలకొల్పి, వాటిని ఇతోధికంగా బలపరచడంలో పూర్తిగా విఫలమైనాయి. పై పెచ్చు ఆ నాయకత్వం అనుసరించే పాలసీలు ఆ రాష్ట్రాలను మరింత దూరం చేసేందుకు తోడ్పడుతున్నాయి.

గిరిజన జాతులు ఉండే ఈ సరిహద్దు ప్రాంతాల పట్ల బాషా ప్రాంతాల కంటే మరింత హెచ్చు శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది. అనేక సంవత్సరాల పాటు ఈ ప్రాంతాలను బ్రిటిష్ వారు తక్కిన భారతదేశాన్నుండి వేరు చేసి ఉంచారు. ఆ ప్రాంతాలకు భారతీయులను స్వేచ్ఛగా వెళ్ళనీయలేదు. తతిమ్మా భారతదేశంలాగా ఈ ప్రాంతాల వారు ఉమ్మడిగా జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగం పంచుకొనలేదు. వారు తమ పోరాటాలను తతిమ్మా భారతీయులతో నిమిత్తం లేకుండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగించుకోవడం సంభవించింది. పైపెచ్చు విదేశీ క్రైస్తవ మిషనరీలు ఆ ప్రాంతాల్లో ప్రవేశించి వేర్పాటువాద బీజాలను నాటారు. తతిమ్మా భారతీయుల పట్ల భయవాతావరణాన్ని కల్పించారు. ఈ రకమైన భయ సందేహాలను, వేర్పాటువాద వాతావరణాన్ని తుదముట్టించడం ద్వారా మాత్రమే ఐక్యతా భావాన్ని సృష్టించడానికి, మనమంతా ఒకే దేశస్తులమనే భావాన్ని వారిలో కలిగించడం సాధ్యం కాగలదు. ఈ కర్తవ్యాన్ని నిర్వహించడంలో బూర్జువా భూస్వామ్య ప్రభుత్వమూ, దాని విధానాలు మొత్తంగానే విఫలమైనాయి.

ఇదికేవలం పాలక వర్గ పార్టీ, కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేకాదు. అది భారతదేశ ప్రజాతంత్ర, కార్మికవర్గ ఉద్యమాల వైఫల్యం కూడా. వారి వెనుకబాటుతనాన్ని అధిగమింపజేసే లక్ష్యాలతోనూ, ఆశయాలతోనూ వారిని ఉమ్మడి పోరాటంలోకి ఆకర్షించడంలో ఉద్యమాలు విఫలమైనాయి. జాతుల సమానత్వాన్ని సాధించడం, జాతుల సమస్యను పరిష్కరించడం తాము సాగించుతున్న ప్రజాతంత్ర ఉద్యమంలో భాగమన్న విశ్వాసం వారిలో కలిగించడంలో విఫలం కావడం సంభవించింది.

కాని, ఎక్కడైతే కార్మికవర్గ పార్టీ – భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)– జాతుల సమానత్వ సమస్యను ప్రజాతంత్ర విస్తృతికి, ఆర్థిక పురోగతికి జరిగే ఉమ్మడి పోరాటంలో భాగం చేయగలిందో అక్కడ బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఐక్యతను సాధించగలిగాం. జాతీయ దురభిమానాన్ని, వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టడాన్ని ప్రతిఘటించ గలిగాం. త్రిపురలో యిది జరిగింది. అక్కడ మార్క్సిస్టు పార్టీ గిరిజనుల పోరాటానికి, మొత్తం మీద ప్రజాతంత్ర ఉద్యమానికి రెండింటికీ నాయకత్వం వహించగలిగింది. ఆ కారణంగానే మార్క్సిస్టు పార్టీ అక్కడ శాసనసభా ఎన్నికల్లో కాంగ్రెసు (ఐ)ని ఓడించి, గిరిజనుల, బెంగాలీ ప్రజల ఉమ్మడి మద్దతుతో వామపక్ష మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయగలిగింది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జిల్లా గిరిజన సమితిని ప్రవేశపెట్టింది. ఆ విధంగా గిరిజన వేర్పాటు వాదుల దాడిని తిప్పికొట్టడంలో జయప్రదమైంది.

మన దేశంలో సంభవిస్తున్న ఇలాంటి పరిణామాలను అమెరికా సామ్రాజ్యవాదులు జాగ్రత్తగా పరిశీలించుతూ, వాటిని తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడానికి ప్రయత్నించుతున్నారు. కొన్ని విదేశీ క్రైస్తవ మిషనరీల సహాయంతో అమెరికా ఏజెంట్లు అస్సాం భారతదేశాన్నుండి విడిపోవాలని ప్రచారం చేసే పుస్తకాలు రాసి ప్రచురించడంలో నిమగ్నమవుతున్నారు. అదే విధంగా ప్రజల్లో వున్న అసంతృప్తి వేర్పాటువాద మార్గంలోకి మరలించడానికి కూడా ఈ పుస్తకాల ద్వారా ప్రయత్నించుతున్నారు.

కాశ్మీర్‌లోని పరిణామాలు మనదేశంలోని బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వం అనుసరించుతున్న రాజకీయాలకు నగ్నంగా అద్దం పడుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావంతో కాశ్మీర్ ప్రజలు షేక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ పతాకం కింద మత, మతోన్మాద దుష్ప్రభావాలను అధిగమించి, భారత ప్రజాతంత్ర – సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంతో జతకట్టి, భారత దేశంలోనే ఉండిపోవడానికి నిర్ణయించుకున్నారు. హిందువులు, ముస్లింలు వేరువేరు జాతులనీ, మత ప్రాతిపదికపై రాజ్యాలు ఏర్పడాలనే సిద్ధాంతానికి ఇది తీవ్రమైన దెబ్బ. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిణామ క్రమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళలేకపోయింది. పైపెచ్చు, పెట్టుబడిదారీ పంథాలో ఆ రాష్ట్రం అదేపనిగా వెనుకబాటు తనంలో కొనసాగడం వలనా, తరతరాలుగా వస్తున్న దారిద్ర్య పరిస్థితులను నివారించలేక పోవడంతో ఒకరకమైన అసమానతా భావం కాశ్మీర్ ప్రజలను వెంటాడుతూ వచ్చింది. ఆ విధంగా తతిమ్మా ప్రజలకు దూరం కావడంతో పాటు ఆ ప్రజల్లో అత్యధిక భాగం మత భావాలకు గురి కావడం సంభవించింది. ఈ రకమైన భావాలను అభివృద్ధి నిరోధకులు సొమ్ము చేసుకోగలిగారు. భారత సమైక్యతను విచ్ఛిన్నపరచే అభివృద్ధి నిరోధకుల పన్నాగాలకు వ్యతిరేకంగా అందరూ పోరాడుతూనే ఈ పరిణామాలలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన పాత్రను ఎవ్వరూ మరచిపోరాదు.

**(బి టి రణదివే రచించిన ' భారతదేశంలో జాతుల సమస్య' పుస్తకం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275 .Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.5. Published on September 1, 2017